# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 120 | హైదరాబాద్ | బుధవారం 29-10-2025 | పేజీలు : 12 | వెల : 1.00



11లో

ఢిల్లీ ఎయిర్‌పోర్టులో బస్సు దగ్ధం..
ఎయిరిండియా విమానం పక్కనే ఘటన

## నేటి భారతం

- మన విశాల భారతంలో లంచం అనేది మన అనుబంధాలలో అంతర్భాగం అయిపోయింది
- పుట్టుక నుంచి గిట్టుక వరకు లంచం ప్రతి పనికి సమర్పించాలి లంచం
- అన్ని వ్యవస్థల్లో నాటుకు పోయిన పెను భూతం ధనమే పరమావధిగా పని చేస్తున్న అధికార యంత్రాంగం
- నీతికి ఎప్పుడో ఇచ్చారు తిలోదకం అవినీతి సంపాదనకు వేసారు అగ్ర పీఠం
- మన రక్తాన్ని పీల్చి వేసే జలగల సమూహం మన జీవితాలను కుంగదీసే విష వలయం
- ప్రతిభావంతులకు లేదు అవకాశం అవినీతి పరులదే సమాజంలో రాజ్యం
- లంచంతో కొన్న కంచం ఆకలి తీర్చునా? లంచంతో కొన్న మంచంలో నిద్దుర పట్టునా?
- లంచగొండితనాన్ని రూపు మాపుదాం అవినీతి రహిత సమాజాన్ని రూపుదిద్దుదాం



11లో

## హైవేలపై..
## టోల్ వసూళ్ల జోరు

- 9 నెలల్లోనే రూ.49 వేల కోట్ల ఆదాయం
- ఈ ఏడాది 9 నెలల్లో 16 శాతం పెరిగిన టోల్ ఆదాయం
- రూ.49,193 కోట్లకు చేరిన జాతీయ రహదారుల వసూళ్లు

## సినీ పరిశ్రమ అండగా ఉంటే హాలీవుడ్‌ను
## హైదరాబాద్‌కు తీసుకువస్తాం

- ప్రపంచ చిత్ర పరిశ్రమకు హైదరాబాద్ నగరం వేదిక కావాలనేది తన సంకల్పమన్న ముఖ్యమంత్రి
- ఐటీ, ఫార్మా పరిశ్రమలు ఎలాగో ఫిల్మ్ ఇండస్ట్రీ కూడా అంతేనని వ్యాఖ్య
- హాలీవుడ్ సినిమాలు రామోజీ ఫిల్మ్ సిటీ, హైదరాబాద్‌లో చిత్రీకరణ జరిగేలా బాధ్యత తీసుకుంటానన్న సీఎం

11లో



11లో

## హైదరాబాద్‌లో కబ్జా నుంచి
## 1.27 ఎకరాల స్థలాన్ని కాపాడిన హైడ్రా

- ప్రజావాణిలో ఫిర్యాదుల ఆధారంగా ఆక్రమణల తొలగింపు
- సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలన
- హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలో 1.27 ఎకరాల పార్కును కాపాడిన హైడ్రా
- చందానగర్ సర్కిల్ పరిధిలో 700 గజాల స్థలానికి ఫెన్సింగ్

## భారీగా తగ్గిన బంగారం ధరలు..


హైదరాబాద్‌లో
రూ. 1.22 లక్షలకు దిగొచ్చిన పసిడి


11లో

- అంతర్జాతీయ పరిణామాలు, పసిడి పెట్టుబడుల్లో లాభాల స్వీకరణ ప్రభావం
- అమెరికా-చైనా వాణిజ్య ఒప్పందం కుదరవచ్చనే అంచనాల ప్రభావం

## ఢిల్లీలో కురవనున్న
## కృత్రిమ వర్షం!

- ఢిల్లీలో పెరిగిన వాయు కాలుష్యం
- కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు వర్షం కురిపించేందుకు ఢిల్లీ ప్రభుత్వం కసరత్తు
- క్లౌడ్ సీడింగ్ ప్రక్రియను పూర్తి చేసిన ఢిల్లీ ప్రభుత్వం


11లో


11లో

## తరుముకొస్తున్న..
## 'మొంథా' తీవ్ర తుపాను

- ప్రభావిత ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణకు అధికారులకు ఆదేశాలు
- నేటి అర్ధరాత్రి కాకినాడ సమీపంలో తుపాను తీరం దాటే అవకాశం
- డ్రోన్ల ద్వారా ముందు ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని సూచన
- రహదారులకు అడ్డంకులు లేకుండా చూడాలని అధికారులకు పవన్ కల్యాణ్ ఆదేశం

## అవినీతికి శాశ్వత చిరునామా..
## బడంగ్ పేట్ మున్సిపాలిటీ..





12లో


- ఎన్ని కథనాలు వెలువడినా, ఎన్ని ఫిర్యాదులున్నా మారని పరిస్థితి
- అధికారులే కాదు, స్థానిక నాయకులు సైతం అవినీతిలో మునిగిపోయారు
- అక్రమ కట్టడాలకు ఆలవాలంగా నిలుస్తున్న ప్రాంతం
- అవినీతి పరులకు కొమ్ముకాస్తున్న మున్సిపల్ అధికారులు
- అడిగితే అడ్డగోలు సమాధానాలుతలబిరుసు ప్రవర్తన
- కోట్లలో ప్రజాధనం, ప్రభుత్వ ధనం కొల్లగొడుతున్న దౌర్భాగ్యం
- అటు ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్, ఇటు హైదరాబాద్ నగరం
- అభివృద్ధికి ఎంతో అవకాశంకానీ అవినీతి అశనిపాతం
- గ్రీన్ బెల్ట్ ను సైతం కొల్లగొడుతున్న అక్రమార్కులు
- చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలు మటుమాయం
- ప్రత్యేక అధికారిని నియమించినా కనిపించని ఫలితం
- దొరికిన కాడికి దోచుకుంటున్న అధికారులు, స్థానిక నాయకులు
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ముఖ్యమంత్రి రేవంత్ దృష్టి పెట్టాలి
- బడంగ్ పేట్ మున్సిపాలిటీని ప్రక్షాళన చేయకుంటే న్యాయపోరాటం చేయడానికి సంసిద్ధమవుతున్న "ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హైమన్ రైట్స్ సంస్థ"..

# సంపాదకీయం

## సెక్స్ వార్ ఫేర్...

టెక్నాలజీ పెరిగేకొద్దీ.. శత్రువుని దెబ్బతీసేందుకు.. వారి రహస్యాలను దొంగిలించే పద్ధతి మారుతుంది. అలా.. ఇప్పుడు కొత్తగా ట్రెండింగ్‌లోకి వచ్చిందే.. సెక్స్ వార్ ఫేర్. ఎస్.. సిలికాన్ వ్యాలీలో నడుస్తున్న సరికొత్త గూఢచర్యం ఇది. వలపు వల విసిరి.. దిగ్గజ టెక్ కంపెనీల ట్రేడ్ సీక్రెట్లని దొంగిలించేస్తున్నారు. దిగ్గజ టెక్ కంపెనీలన్నీ ఉండే.. సిలికాన్ వ్యాలీలో.. అకస్మాత్తుగా సెక్స్ వార్‌ఫేర్ పెరిగిపోయింది. చైనా, రష్యాకు చెందిన ఆపరేటర్లు.. టెక్ కంపెనీల్లోకి చొరబడేందుకు, అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులను ప్రలోభ పెట్టేందుకు, అక్కడి ట్రేడ్ సీక్రెట్స్‌ని.. దొంగిలించేందుకు అందమైన, ఆకర్షణీయమైన మహిళలను వాడుతున్నట్లు తేలింది. ఇదే.. ఇప్పుడు అందరినీ షాక్‌కి గురిచేస్తోంది. అంతేకాదు.. ఓ గూఢచారి మహిళ.. ఓ టెకీని పెళ్లి కూడా చేసుకుంది. ఆమెను.. అతను ఓ మీటింగ్‌లో కలిశాడు. ఆమె అందమైనదే కాదు.. ఎంతో తెలివైంది కూడా. అతనంటే నిజంగానే ఎంతో ప్రేమ ఉన్నట్లు, ఇష్టం ఉన్నట్లు నమ్మించింది. కొన్నేళ్ల తర్వాత.. ఆమె ఓ ఇంటలిజెన్స్ ఆపరేషన్‌లో భాగమని, అమెరికా వాడే టెక్నాలజీ నుంచి అనేక రహస్యాలను తెలుసుకునేందుకు వచ్చిందని.. తెలుసుకున్నాడు. ఇదే.. ఇప్పుడు సిలికాన్ వ్యాలీలో నడుస్తున్న లేటెస్ట్ స్పై ఆపరేషన్. ఎరగా అందమైన, ఆకర్షణీయమైన మహిళలు. చైనా, రష్యాకు చెందిన కొందరు ఆపరేటర్లు.. అమెరికా టెక్ కంపెనీల్లోకి చొరబడి, అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులను ప్రలోభపెట్టేందుకు అందమైన మహిళల్ని ఎరగా వాడుతున్నట్లు తేలింది. కొన్ని సందర్భాల్లో.. ఆ గూఢచారి మహిళలు.. తమ టార్గెట్లను పెళ్లి కూడా చేసుకుంటారు. టెక్నాలజీపరమైన రహస్యాలను దొంగిలించే క్రమంలో.. ఎక్కువ కాలం వారితో ఉండాల్సి వచ్చినప్పుడు.. పిల్లలను కూడా కంటారు. అందుకోసమే.. ఇంటలిజెన్స్ ఎక్స్‌పర్ట్స్ దీనిని సెక్స్ వార్‌ఫేర్ అని పిలుస్తున్నారు. ఇదంతా.. టెక్ ప్రపంచంలో పెరుగుతున్న అమెరికా ఆధిపత్యానికి ముప్పును సూచిస్తోందని చెబుతున్నారు. చైనాలో పెట్టుబడులు పెట్టే.. అమెరికా కంపెనీలకు సలహాలు ఇచ్చే నిపుణులు.. దీనిని గమనించారు. లింక్డ్ ఇన్ లాంటి ప్లాట్ ఫామ్స్‌లో.. అందమైన యువతుల నుంచి తమకు రిక్వెస్ట్‌లు వస్తున్నాయంటున్నారు. ఈ మధ్యకాలంలో సిలికాన్ వ్యాలీలో ఈ తరహా గూఢచర్యం బాగా పెరిగిందని కౌంటర్ ఇంటలిజెన్స్ నిపుణులు చెబుతున్నారు. ఇటీవల.. చైనా పెట్టుబడి నష్టాలపై వర్జీనియాలో జరిగిన వ్యాపార సమావేశంలోనూ.. ఇద్దరు ఆకర్షణీయమైన చైనీస్ లేడీస్ ప్రవేశించడానికి ప్రయత్నించినట్లు గుర్తించారు. ఇది.. కచ్చితంగా అమెరికా ఇంటలిజెన్స్ వైఫల్యమే అంటున్నారు. టెక్ కంపెనీల సీక్రెట్స్ దొంగిలిస్తున్న గూఢచారులు. అయితే.. సెక్స్ బేస్డ్ గూఢచర్యం ఇప్పుడున్న ముప్పులో ఓ పార్ట్ మాత్రమే. యూఎస్ బిజినెస్ ప్లాన్స్‌ని సేకరించేందుకు.. చైనా అమెరికా గడ్డపై స్టార్టప్ కాంపిటీషన్స్ నిర్వహిస్తోంది. ఈ ఆపరేషన్‌కి.. రష్యా, చైనా.. తమ దేశ పౌరులు, పెట్టుబడిదారులు, విద్యావేత్తలు, క్రిప్టో అనలిస్టులను.. అనధికార నిఘా ఏజెంట్లుగా వాడుతుండటం వల్ల.. ఈ కార్యకలాపాలను గుర్తించడం కష్టతరమవుతోందని నిపుణులు అంటున్నారు. మరోవైపు.. అందమైన తమ దేశపు మహిళలకు.. ఓ టార్గెట్‌ని సెలక్ట్ చేయడం, వారిని పెళ్లి చేసుకోవడం.. ఓ లక్ష్యంతో పిల్లల్ని కనడం, జీవితాంతం.. టెక్ సీక్రెట్స్ సేకరించే ఆపరేషన్ నిర్వహించడం లాంటివి చేస్తున్నారు. ఈ రకంగా చేయడం వల్ల.. అస్సలు అనుమానమే వచ్చే పరిస్థితి లేదంటున్నారు. ఈ విధంగా.. మేధో సంపత్తిని దొంగిలించేందుకు.. ఏడాదికి 600 బిలియన్ డాలర్ల దాకా ఖర్చవుతోంది. ఇదంతా.. ఎక్కువగా చైనా నుంచే జరుగుతోంది. స్టార్టప్‌లు.. చైనా ఇన్వెస్టర్లతో తమ బిజినెస్ ప్లాన్స్‌ని పంచుకుంటే.. రహస్యాలను కోల్పోయే ప్రమాదం ఉంది. లేనిపక్షంలో.. వాళ్లు చైనాకే వెళ్లాల్సి వచ్చే ప్రమాదం కూడా ఉంది. భవిష్యత్తుల్లో అమెరికా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదా? సిలికాన్ వ్యాలీ.. ఇప్పుడు సాఫ్ట్ ఎకనమిక్ గూఢచర్యానికి కేంద్రంగా మారింది. టెక్నాలజీతో పాటు ట్రేడ్ సీక్రెట్స్‌ని కూడా టార్గెట్‌గా చేసుకుంది. చైనా దీనిని.. డ్రాఫ్ట్‌గా పిలుస్తోంది. యూఎస్ యాక్సెస్‌ని నిరోధించేందుకు.. డీవోడీ నిధులతో కూడిన స్టార్టప్‌లలో వాటాలు కొనుగోలు చేస్తోంది. సిలికాన్ వ్యాలీ ఓపెన్ కల్చర్ కూడా గూఢచారులు ఎంట్రీ ఇచ్చేందుకు.. రూట్ క్లియర్ చేస్తోంది. సౌత్ కొరియా, ఇజ్రాయెల్ లాంటి అమెరికా మిత్రదేశాలు కూడా.. సైలెంట్‌గా తమకు కావాల్సిన సమాచారాన్ని సేకరిస్తుంటాయని.. ఇంటలిజెన్స్ ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. 2017లో రష్యన్ కాన్సులేట్ మూసివేసిన తర్వాత కూడా.. రష్యా హానీపాట్స్, మధ్యవర్తులను ఉపయోగిస్తోంది. ఇక.. చైనా అయితే.. టెక్నాలజీ, ఐపీ అడ్రస్‌వ కోసం.. ఓ భారీ వలనే విసురుతోంది. ఈ విషయంలో.. యూఎస్ కౌంటర్ ఇంటలిజెన్స్ అనేక అడ్డంకులను ఎదుర్కొంటోంది. ఎందుకంటే.. స్టార్టప్స్ తరచుగా బెదిరింపులను తక్కువగా రిపోర్ట్ చేస్తాయ్. మరోవైపు.. సిలికాన్ వ్యాలీలోని ఓపెన్ కల్చర్.. స్పై ఆపరేషన్లను సులభతరం చేస్తోంది. అందువల్లే.. చైనా, రష్యా.. హానీ ట్రాప్ పద్ధతుల్లో.. దిగ్గజ టెక్ కంపెనీల నుంచి ట్రేడ్ సీక్రెట్స్ దొంగిలిస్తున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయ్. బడా టెక్ కంపెనీల్లో.. విలువైన సమాచారాన్ని యాక్సెస్ చేయగలిగే వారిని.. ప్రేమలోకి దించడం గానీ, వలపు వల విసరడం గానీ చేసి.. తమకు కావాల్సిన సమాచారాన్ని రాబట్టుకుంటున్నారు. తమ సంబంధాలతో.. మేధో సంపత్తి, మిలటరీ టెక్నాలజీతో పాటు ఇతర రహస్య సమాచారాన్ని దొంగిలించడమే లక్ష్యంగా.. గూఢచర్యం చేస్తున్నారు. చైనా, రష్యా సిలికాన్ వ్యాలీనే సెలక్ట్ చేసుకోవడానికి ఓ రీజన్ ఉంది. ఇక్కడ.. సెమీ కండక్టర్ల నుంచి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ దాకా.. కీలకమైన టెక్నాలజీలన్నింటిని.. సిలికాన్ వ్యాలీ సెంటర్‌గా ఉంది. ఇలా.. మేధో సంపత్తి దొంగతనం ద్వారా అమెరికా ఆర్థిక వ్యవస్థకు.. ఏడాదికి కొన్ని వందల బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లుతోందని చెబుతున్నారు. చైనాకు చెందిన వారి వీసాలను రద్దు చేస్తున్న అమెరికా. హానీ ట్రాప్, సెక్స్ వార్‌ఫేర్ లాంటి గూఢచర్య పద్ధతులు.. టెక్ కంపెనీల్లో ఇంటర్నల్ టెన్షన్స్‌ని పెంచుతాయ్. సంస్థలకు తీవ్రమైన ఆర్థిక, జాతీయ భద్రతా నష్టాలను కలిగిస్తాయ్. ఇలాంటి ఎన్నో రిపోర్ట్స్, న్యూస్.. పబ్లిక్ డొమైన్‌లో ఉన్నప్పటికీ.. జనంలో చర్చ జరిగినప్పటికీ.. గూఢచర్యాన్ని ఆపడం కష్టమవుతుంది. ఎందుకంటే.. స్పై ఆపరేషన్లన్నీ.. చాలా సీక్రెట్‌గా జరుగుతుంటాయ్. దొంగిలించబడిన మేధో సంపత్తితో.. విదేశీ ప్రత్యర్థులు.. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఖర్చు లేకుండా.. దాదాపు ఒకే తరహా ఉత్పత్తులను తక్కువ ధరకు విక్రయిస్తారు. దీనివల్ల.. అమెరికన్ కంపెనీల మార్కెట్ వాటా తగ్గిపోతుంది.

# అమరావతి కేంద్రంగా మరో జిల్లా




విజయవాడ, (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటుతో పాటు పేర్ల మార్పుపై ప్రభుత్వం చేపట్టిన కసరత్తు చివరి దశకు వచ్చింది. ఈ అంశాలపై అధ్యయనం చేసేందుకు ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం మంగళవారం మధ్యాహ్నం సీఎం చంద్రబాబుతో సమావేశం కానుంది. ఈ కీలక భేటీలో జిల్లాల సరిహద్దులు, రెవెన్యూ డివిజన్లు, మండలాల ఏర్పాటు, పేర్ల మార్పుపై రాష్ట్రవ్యాప్తంగా అందిన అర్జీలు, వినతులపై చర్చిస్తారు. సీఎం చంద్రబాబు సూచనలు తీసుకుని మంత్రివర్గ ఉపసంఘం తుది నివేదికను రూపొందించనుంది. కొత్త జిల్లాలు, మండలాలు రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు సంబంధించిన ఈ నివేదికను నవంబరు 7వ తేదీన జరిగే ఏపీ కేబినెట్ భేటీలో చర్చించి ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. ఆ తరువాత ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, చివరగా గెజిట్‌ను విడుదల చేస్తారు. జనగణన ప్రక్రియ ఉన్న కారణంగ ఈ మొత్తం ప్రక్రియను డిసెంబరు 31వ తేదీ లోగానే పూర్తిచేయాలని కూటమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్రంలో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్, మండల, గ్రామ సరిహద్దులు, పేర్ల మార్పుపై ప్రభుత్వం ఏడుగురు మంత్రులతో ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఆగస్టు 13న తొలి సమావేశం నిర్వహించి, అనంతరం జిల్లాల వారీగా ప్రజలు, వివిధ వర్గాలు, ప్రజాసంఘాల నుంచి వినతులు స్వీకరించింది. ఇటీవల జరిగిన భేటీలో అందిన అన్ని అర్జీలపై చర్చించి, జిల్లాల అధికారుల నుంచి అభిప్రాయాలు సేకరించింది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో కొత్త జిల్లా ఏర్పాటుకు సీఎం చంద్రబాబు గతంలో ఇచ్చిన హామీ మేరకు రంపచోడవరం, చింతూరు డివిజన్లతోపాటు 4 విలీన మండలాలతో జిల్లా ఏర్పాటుకు ప్రతిపాదన సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం రంపచోడవరం నుంచి జిల్లా కేంద్రమైన పాడేరుకు 187 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. అలాగే, అమరావతి కేంద్రంగా పల్నాడు, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని కొన్ని నియోజకవర్గాలతో కొత్త జిల్లా ఏర్పాటు ప్రతిపాదన ఉంది. సచివాలయం, అసెంబ్లీ, కొత్త భవనాల నిర్మాణం పూర్తవుతున్న నేపథ్యంలో శాంతిభద్రతల నిర్వహణ, ప్రొటోకాల్ విధుల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని అమరావతిని కొత్త జిల్లా ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం ఆలోచిస్తోంది. వీటితో పాటు మదనపల్లె కేంద్రంగా జిల్లా ఏర్పాటుకు ఉన్న సాధ్యాసాధ్యాల నివేదికను కూడా సమర్పించనున్నారు. మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేస్తామని చంద్రబాబు గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అందులో భాగంగా మార్కాపురం కేంద్రంగా కనిగిరి, గిద్దలూరు, దర్శి, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాలతో జిల్లా ఏర్పాటుకు ఉపసంఘం సిఫార్సు చేసింది. అద్దంకి నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపే అంశంపై స్థానిక ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలపాలనే ప్రతిపాదన ఉంది. రామాయపట్నం పోర్టు ఏర్పాటు చేస్తున్నారు కనుక కందుకూరును శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో కొనసాగించాలా? లేక ప్రకాశం జిల్లాలో చేర్చాలా? అనే అంశంపై రేపు సమావేశంలో డిసైడ్ చేయనున్నారు.

అద్దంకి, మడకశిర సహా సుమారు 10 కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పరిపాలనా సౌలభ్యం మేరకు, ఒక నియోజకవర్గం రెండు, 3 రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఉంటే ఒకే నియోజకవర్గ పరిధిలోకి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆదోని మండలంలో జనాభా ఎక్కువగా ఉన్నందున, ఈ మండలాన్ని విభజించాలని ప్రజల వినతులపైనా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. మండపేట, కొత్తపేట, ఎస్.కోట సహా కొన్ని నియోజకవర్గాలను మరో జిల్లాకు మార్చాలనే ప్రతిపాదనలు ఉపసంఘం సీఎం దృష్టికి తీసుకెళ్లనుంది.

### న్యూఇయర్ కు ముందే ప్రకటన

న్యూఇయర్‌కు కొత్తగా ఆరు జిల్లాలు. తెలంగాణ నుంచి ఏపీ విడిపోయిన తర్వాత 13 జిల్లాలు ఉండేవి. దాన్ని జగన్ సర్కార్ 26 జిల్లాలుగా మార్చింది. జిల్లా కేంద్రాలు, సరిహద్దులు, జిల్లాల పేర్లపై వివాదం రగడ నలుగుతూనే ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీకి వివిధ జిల్లాల నుంచి ఎక్కువగా వినతులు వచ్చాయి. వాటిలో కొత్త జిల్లాల ఏర్పాటు వ్యవహారం ఉంది. దీనిపై చంద్రబాబు ప్రభుత్వం దృష్టి సారించిందని తెలుస్తోంది. ఇందుకు కారణాలు లేకపోలేదు. వచ్చే ఏడాది నుంచి కేంద్రప్రభుత్వం జనగణన చేపట్టనుంది. ఈ నేపథ్యంలో 2026 జనవరి ఒకటి నుంచి 2027 మార్చి చివరకు వరకు జిల్లాలు, మండలాలు, గ్రామాల సరిహద్దులు, పేర్ల మార్పుకు ఎలాంటి అవకాశం ఉండదు. ఈ పని చేసినా ఈ ఏడాది డిసెంబర్ 31లోగా చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఎన్నికల హడావుడి నెలకొననుంది, ఆ తర్వాత కొత్త జిల్లాల ఏర్పాటు చేయడం దాదాపు అసాధ్యం. ఉత్తరాంధ్ర-సీమలో ఒకొక్కటి. ఈలోగా ఆ పని చేయాలన్నది కూటమి ప్రభుత్వం ఆలోచన. దీని ఆధారంగా చకచకా అడుగులు వేస్తోంది. తెలంగాణ కంటే ఆంధ్రప్రదేశ్.. జనాభా, భౌగోళికంగా పెద్దది. ప్రస్తుతం 26 జిల్లాలు ఉన్నాయి. వీటిని 32 జిల్లాలుగా చేయాలని ప్లాన్ చేస్తోంది కూటమి సర్కార్. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్త జిల్లాలపై సాధ్యాసాధ్యాలపై దృష్టి సారించింది. ఇప్పటికే వివిధ జిల్లాల ప్రజల నుంచి వినతులు స్వీకరించింది కేబినెట్ సబ్ కమిటీ. కొన్ని జిల్లాలు విస్తీర్ణ పరంగా పెద్దదిగా ఉన్నాయి. జిల్లా కేంద్రాలకు రాకపోకలకు సుదూరంగా ఉండడం దీనికి కారణమైంది. వాటిపై ఇప్పుడు చంద్రబాబు సర్కార్ ఫోకస్ చేసింది. న్యూఇయర్ లోపు కొత్తగా ఆరు జిల్లాలను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఉమ్మడి శ్రీకాకుళం నుంచి పలాస, ప్రకాశం నుంచి మార్కాపురం, చిత్తూరు జిల్లా మదనపల్లె, నెల్లూరు నుంచి గూడూరు, కడప నుంచి రాజంపేట, గుంటూరు నుంచి అమరావతి కొత్త జిల్లాలుగా ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తోంది. దీనిపై కొన్నాళ్లు ప్రచారం సాగుతోంది కూడా. ఈ రెండు నెలల్లో మంత్రివర్గం ఉప సంఘం ఇచ్చే నివేదికను కేబినెట్‌లో పెట్టి చర్చించనుంది. ఈ రెండు నెలల్లో కొత్త జిల్లాల వ్యవహారానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని భావిస్తోంది. లేకుంటే మరో 15 నెలలు ఆగాల్సి వుంటుంది. ఈలోగా ఎన్నికలకు సమయం ముంచుకొస్తుంది. ఈ ఏడాది డిసెంబర్ మూడో వారానికి వాటిని పూర్తి చేయాలని ఆలోచన చేస్తోంది. వచ్చే ఏడాది జనవరి 26 నుంచి కొత్త జిల్లాలను అమల్లోకి తీసుకురావాలని భావిస్తున్నట్లు ప్రభుత్వం వర్గాలు చెబుతున్నారు

# బల్క్ డ్రగ్ ఫ్యాక్టరీపై చెరో దారి




విజయనగరం, (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28

నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్ కు రాజకీయ రంగు పులుముకుంటుంది. 48 రోజులుగా బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయొద్దు అంటూ రాజయ్యపేట మత్స్యకారులు తీవ్రస్థాయిలో ఆందోళన చేస్తుంటే పట్టించుకునే వారే కరువయ్యారు. ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా బతకడం కోసం మత్స్యకారులు బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా చేస్తున్న అలుపెరగని పోరాటానికి రాజకీయ పార్టీల మద్దతు కరువు అవుతోంది. అసలు నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటులో రాజకీయ పార్టీల ప్రమేయం ఏంటి? రాజయ్యపేట పరిసరాల్లో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట సహా పరిసర గ్రామాల్లో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు శరవేగంగా జరుగుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే ఏపీఐఐసీ రాజయ్యపేటలో 453 ఎకరాల భూమిని సమీకరించింది. ఆ భూమిని ప్రస్తుతం నిర్మాణానికి ఇవ్వడంతో వేగంగా పనులు జరుగుతున్నాయి. భూములను తీసుకున్న సమయంలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పలేదని, ఇతర పరిశ్రమల ఏర్పాటు మాత్రమే చేస్తామని చెప్పడంతో భూములు ఇచ్చామని, కానీ ఇప్పుడు ప్రాణాలు తీసే బల్క్ డ్రగ్ పార్క్ నిర్మాణం చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ 38 రోజులుగా రాజయ్యపేట గ్రామస్తులు ఆందోళన బాట పట్టారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో బల్క్ డ్రగ్ పార్క్ నిర్మాణానికి అంగీకారం. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో బల్క్ డ్రగ్ పార్క్ నిర్మాణానికి అంగీకారం తెలిపారు.. ప్రభుత్వ మారడంతో అధికారంలోకి వచ్చిన కూటమి బల్క్ డ్రగ్ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు పనులు కూడా వేగంగా జరిగేలాగా చర్యలు చేపట్టడంతో వివిధ సంస్థలు ముందుకొచ్చాయి. పరిశ్రమల స్థాపన జరుగుతుండడంతో అసలు విషయం బయటపడింది. ఇప్పటికే హెటిరో డ్రగ్ పరిశ్రమ వల్ల సముద్రంలో కాలుష్యం పెరిగిపోయి, మత్స్య సంపద పూర్తిగా నాశనం అయిపోవడంతో పాటు, సముద్ర తీరంలో ఉన్న మత్స్యకార గ్రామాల్లోని ప్రజలు ఊపిరితిత్తులు క్యాన్సర్ లాంటి వ్యాధులతో బాధపడుతూ ప్రాణాలు కోల్పోతున్నామని బల్క్ డ్రగ్ పార్క్ వద్దని ఆందోళన చేయడం మొదలుపెట్టారు. రాజయ్యపేట మత్స్యకారుల ఆందోళన ఇప్పుడు రాజకీయ రంగు పులుముకుంది. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం అనుమతులు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం అన్ని అనుమతులు ఇవ్వడంతో పాటు ఫైల్స్ ని క్షణాల్లో క్లియర్ చేస్తుండడంతో వివిధ డ్రగ్ కంపెనీలు కార్యాలయాలతో పాటు పరిశ్రమల ఏర్పాటు కూడా చేసేస్తున్నాయి. పాయికరావుపేట నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఆందోళన చేస్తున్న మత్స్యకారులతో మాట్లాడే ప్రయత్నం చేసిన విఫలమైంది. హోం మంత్రి వాహనాన్ని సైతం రాజయ్యపేట మత్స్యకారులు అడ్డుకున్నారు. అంతేకాకుండా జాతీయ రహదారిని నాలుగు గంటలకు పైగా దిగ్బంధించారు. జాతీయ రహదారి దిగ్బంధనం. ప్రభుత్వంతోపాటు పోలీసులు కూడా రాజయ్యపేట మత్స్యకారులు చేస్తున్న ఆందోళనను సీరియస్ గా తీసుకున్నారు . హోం మంత్రిని మత్స్యకారులు అడ్డుకున్న తర్వాత మళ్లీ మత్స్యకారులతో మాట్లాడే ప్రయత్నం చేయలేదు. జాతీయ రహదారిని దిగ్బంధించిన తర్వాత రాజయ్యపేట సహా 8 గ్రామాల్లో వేల మంది పోలీసులను కవాతు చేయిస్తూ మత్స్యకారులు భయం కలిగేలా చేస్తున్నారు అధికారులు. దీంతో మత్స్యకారులు చేస్తున్న బల్క్ డ్రగ్ పార్క్ వ్యతిరేక ఉద్యమం అధికార పార్టీ నుండి ప్రతిపక్షాల చేతుల్లోకి రోజురోజుకి వెళ్ళిపోతున్నట్లు కనిపిస్తుంది. ఆందోళనకు దిగి బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్. బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్, కమ్యూనిస్టు పార్టీల నాయకులు రాజయ్యపేట వెళ్లే ప్రయత్నం చేసినప్పుడు, పోలీసులు అడ్డుకోవడంతో ఆ ఉద్యమంలోకి వైసీపీ ఎంటర్ అయింది. నర్సీపట్నం మెడికల్ కాలేజీని పరిశీలించడానికి వచ్చిన మాజీ సీఎం జగన్ ను కలిసిన రాజయ్యపేట మత్స్యకారులు బల్క్ డ్రగ్ పార్క్ ని వ్యతిరేకిస్తున్నామని తమకు మద్దతుగా ఉండాలని కోరడంతో జగన్ సూచనలతో వైసిపి బల్క్ డ్రగ్ పార్కు వ్యతిరేకంగా రాజయ్యపేట గ్రామస్తులు చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలిపింది. ఛలో రాజయ్యపేటకు ఎలాంటి పర్మిషన్ లేదంటున్న పోలీసులు. వైసీపీ ఉత్తరాంధ్ర వైసీపీ నాయకులు చలో రాజయ్యపేటకు పిలుపును ఇవ్వడంతో బల్క్ డ్రగ్ పార్కు వ్యతిరేకంగా వైసిపి చేస్తున్న ఉద్యమం ఏ స్థాయిలో ముందుకు వెళ్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది? మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ సహా ఉత్తరాంధ్రలోని కీలకమైన వైసీపీ నాయకులు ఛలో రాజయ్యపేట వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఇప్పటికే పోలీసులు ఛలో రాజయ్యపేటకు ఎలాంటి పర్మిషన్ లేదు అని చెప్పడంతో వైసిపి నాయకులు ఏం చేస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఉత్తరాంధ్రలో డిపాజిట్లు కోల్పోయిన వైసీపీ. ఇప్పటికే ఉత్తరాంధ్రలో దాదాపుగా గత గత ఎన్నికల్లో డిపాజిట్లు కోల్పోయిన వైసీపీ రాజయ్యపేట బల్క్ డ్రగ్ పార్కును భుజాన వేసుకుని మద్దతుగా నిలబడి పోరాటం చేస్తే సముద్ర తీర ప్రాంతాల్లో నివాసం ఉండే మత్స్యకార వర్గాల మద్దతు కూడగట్టుకోవచ్చని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే వైసిపి చేలో రాజయ్యపేటకు పిలుపునిచ్చినట్లు అర్థమవుతుంది. వైసీపీ వేసిన ప్లాన్ మరికూటమి ప్రభుత్వం ఏ విధంగా ఎదుర్కొంటుందో వేచి చూడాలి.

# కునుకు లేకుండా చేస్తున్న నకిలీ మద్యం కేసు



తిరుపతి, (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28

: ఎవరైనా తప్పు చేయకపోతే నిశ్చింతగా ఉంటారు. తమ తప్పు లేదనుకుంటే దాని గురించి మాట్లాడరు. అయితే ఒకవేళ తప్పు చేసి దొరికిపోతామన్న వారు మాత్రం సందడి చేస్తుంటారు. ఇప్పుడు అటువంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నారు మాజీ మంత్రి జోగి రమేష్. నకిలీ మద్యం కుంభకోణంలో అసలు నిందితుడు అద్దేపల్లి జనార్ధన్ రావు మాజీ మంత్రి జోగి రమేష్ పేరు ప్రస్తావించిన నాటి నుంచి ఆయన చేస్తున్న హడావిడి అంతా కాదు. జోగి రమేష్ ప్రోత్సాహంతోనే తాము కల్తీ మద్యం తయారు చేసినట్లు అద్దేపల్లి జనార్ధన్ రావు స్పష్టం చేశారు. కానీ తనకు ఆయన ఎవరో తెలియదని బుకాయించారు జోగి రమేష్. కానీ అదే జనార్ధన్ రావుతో సన్నిహితంగా ఉన్న ఫోటోలు ఒక్కొక్కటి బయటకు రావడంతో జోగి రమేష్ లో ఆందోళన ప్రారంభం అయింది. అయితే ఇప్పుడు దేవుడి ఎదుట ప్రమాణాలతో బయటపడేందుకు జోగి రమేష్ ప్రయత్నిస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం లో నకిలీ మద్యం డంప్ వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ నేతృత్వంలోనే ఎక్సైజ్ శాఖ అక్కడ డంపును పట్టుకుంది. దాంతో తంబళ్లపల్లి టిడిపి ఇన్చార్జ్కు సంబంధం ఉందన్న ఆరోపణలు వచ్చిన గంటల వ్యవధిలోనే హై కమాండ్ ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది. ఆ మరుసటి రోజు ఇబ్రహీంపట్నంలో సాక్షి మీడియా వేదికగా చేసుకుని నకిలీ మద్యం డంపును బయట ప్రపంచానికి చూపించారు జోగి రమేష్. అయితే అదంతా ఒక వ్యూహం ప్రకారం చేసిందంటూ నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు బయట పెట్టడంతో ట్విస్ట్ మొదలైంది. అప్పటినుంచి జోగి రమేష్ హడావిడి ప్రారంభం అయింది. తనకు సన్నిహితుడు అద్దేపల్లి జనార్ధన్ రావు అని జోగి రమేష్ మరిచిపోయారు. తిరిగి ఆయన ఎవరు అంటూ ప్రశ్నించారు. తంబళ్లపల్లె కల్తీ మద్యం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న జనార్ధన్ రావు డంపు బయటపడే సరికి ఆఫ్రికాలో ఉన్నారు. అయితే తన పేరు బయట పెట్టడాన్ని సహించుకోలేక ఆయన తనకు తాను లొంగిపోయేందుకు వచ్చారు. గన్నవరం ఎయిర్పోర్ట్ లో ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే కల్తీ మద్యం తనతో తయారు చేయించి.. ఇప్పుడు వారు పక్కకు తప్పుకొని తనను కేసుల్లో ఇరికించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు జనార్ధన్ రావు. ఒక సెల్ఫీ వీడియో కూడా విడుదల చేశారు. వైసీపీ హయాంలో జోగి రమేష్ ప్రోత్సాహంతో ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం చేసిన విషయాన్ని కూడా వెల్లడించారు. ఇప్పుడు కూడా తంబళ్లపల్లెలో మద్యం తయారు చేయించి.. చంద్రబాబుతో పాటు లోకేష్ కు చెడ్డ పేరు తేవాలన్నదే ప్లాన్ అని బయటకు వెల్లడించారు అద్దేపల్లి జనార్ధన్ రావు. ఈ కేసులో ఇప్పుడు ప్రధాన నిందితుడిగా మాజీ మంత్రి జోగి రమేష్ మారిపోయే అవకాశం ఉంది. అప్పటి నుంచి తనకు ఆ అద్దేపల్లి జనార్ధన్ రావు ఎవరో తెలియదు అంటూ చెప్పుకొస్తున్నారు. కానీ అద్దేపల్లి జనార్ధన్ రావు మనవాడే అని స్వయంగా జోగి రమేష్ చేసిన వ్యాఖ్యలు.. చాలా సందర్భాల్లో ఆయనతో సన్నిహితంగా ఉన్న ఫోటోలు వెలుగులోకి వచ్చాయి. అయినా సరే తనకు జనార్ధన్ రావు తో సంబంధం లేదని.. దుర్గామాత వద్ద ప్రమాణం చేస్తానని చెప్పి ఈరోజు విజయవాడ వచ్చారు. తనకు సంబంధం లేదని ప్రమాణం చేశారు. తన సవాల్ ను చంద్రబాబు, లోకేష్ స్వీకరించలేదని చెప్పుకొచ్చారు.

# అప్రమత్తమైన విద్యుత్ శాఖ.


ఆలమూరు (కొత్తపేట) (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం మరింత తీవ్ర రూపం దాల్చి పెను తుఫాన్ గా మారనుంది. సోమవారం ఉదయం 9 గంటల నుండి వర్షాలు మొదలయ్యాయి. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, ఈ సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో బలమైల ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించడంతో ఏపీఎస్ డిసిఎల్ ఉన్నతాధికారులు, ఏడిఈ శ్రీధర్ ఆదేశాల మేరకు ఆలమూరు మండలంలో ఎలక్ట్రికల్ ఏఈ ప్రసాద్, లైన్ ఇన్స్పెక్టర్ సుబ్రమణ్యం, సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తమయ్యారు. విద్యుత్ తీగలపై ఉన్న కొమ్మలను ఇప్పటికే తొలగించారు. విద్యుత్ స్తంభాలతో పాటు క్రేన్లను కూడా అందుబాటులో ఉంచారు. విపరీతమైన గాలులు వీస్తున్నప్పుడు ఎవ్వరూ బయటకు రావొద్దు. చెట్లు కింద, కరెంటు స్తంభాలు వద్ద ఉండవద్దని, తడి చేతులతో స్విచ్లు వెయ్యవద్దని వారు హెచ్చరించారు.

# చంద్రబాబు పార్టీ అంశాలపై దృష్టి వార్నింగా... యాక్షనా...

విజయవాడ, (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటనను ముగించుకుని అమరావతికి చేరుకున్నారు. కృష్ణా జిల్లాలో నేతల మధ్య విభేదాలపై చంద్రబాబు ఫోకస్ పెట్టే అవకాశముంది. ప్రధానంగా తిరువూరు నియోజకవర్గం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిల మధ్య వివాదం రోడ్డున పడింది. ఒకరిపై ఒకరు బురద జల్లుకోవడంతో పార్టీని బాగా డ్యామేజీ చేసింది. విదేశాల్లో ఉన్నప్పుడే చంద్రబాబు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఫోన్ చేసి ఎవరినీ పిలిపించి మాట్లాడవద్దని, తాను వచ్చిన తర్వాత ఇద్దరి విషయంలో చర్యలు తీసుకుంటానని చెప్పారు. దీంతో చంద్రబాబు రాకతో ఎవరిపై చర్య చంద్రబాబు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. చంద్రబాబు స్టయిల్ ఆఫ్ యాక్షన్స్ దగ్గర నుంచి చూసిన వారికి ఎవరికైనా .. ఎవరిపైనా చర్యలు ఉండే అవకాశాలు ఉండవన్నది ఒక వాదన. ఆయన పార్టీ అధినేతగా ఇప్పటి వరకూ పార్టీ నుంచి సస్పెన్షన్ చేసిన నేతలు చాలా తక్కువ. పార్టీలు మారినప్పుడే వారిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు తప్పించి, ఇలాంటి వివాదాల విషయంలో ఆయన నేరుగా యాక్షన్ కు దిగే అవకాశం లేదన్నది పార్టీ వర్గాల నుంచి వినిపిస్తున్న టాక్. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై పార్టీ సస్పెన్షన్ వేటు వేయడానికి లైంగిక వేదింపులే కారణం తప్ప పార్టీ విషయంలో రచ్చ కెక్కడం మాత్రం కాదు. ఇప్పుడు తిరువూరు విషయంలోనూ ఇద్దరు నేతలకు హెచ్చరికలతో సరిపెడతారన్నది ఎక్కువ మంది నేతల అభిప్రాయంగా కనిపిస్తుంది. ఎందుకంటే ఇద్దరు నేతలు.. సామాజికవర్గం పరంగా చూస్తే గట్టి వారే. ఇటు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు దళిత వర్గానికి చెందినవారు. ఆయనపై చర్య తీసుకుంటే అది తప్పుడు సంకేతాలు వెళతాయని చంద్రబాబు భావించే అవకాశాలున్నాయి. ఇప్పటికే పలుమార్లు వివాదాల్లో చిక్కుకున్న కొలికపూడి శ్రీనివాసరావును హెచ్చరించి పంపారు తప్పించి చర్యలకు దిగకపోవడాన్ని



కొందరు ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు కూడా యాక్షన్ ఇలాగే ఉంటుందని అంటున్నారు. ఇక విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని కృష్ణా జిల్లాలో బలమైన సామాజికవర్గానికి చెందిన వారు కావడం, అందులోనూ ఆయన ఎంపీగా ఉండటంతో ఆయనకు కూడా హెచ్చరికలతో సరిపెడతారంటున్నారు. చంద్రబాబు కేవలం ప్రకటనల్లో మాత్రమే సస్పెన్షన్ అంటూ హెచ్చరిస్తారని, చేతలకు వచ్చేసరికి కమిటీ వేసి ఆ వివాదం సమసిపోయేలా చేయడంలో దిట్ట అని సీనియర్ నేతలే అంటున్నారు. మొత్తం మీద చంద్రబాబు దృష్టి పెట్టి తిరువూరు సమస్యకు చెక్ పెట్టే అవకాశాలున్నాయి. అంతే తప్ప యాక్షన్ కు దిగే అవకాశాలు మాత్రం లేవన్నది వాస్తవం

# రిజర్వ్డ్ నియోజకవర్గాలపై ఫోకస్..

విజయవాడ, (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28

ఆంధ్రప్రదేశ్ పాలిటిక్స్ లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా సరే.. రిజర్వ్ డ్ నియోజకవర్గాలపై అగ్రవర్ణాల ఆధిపత్యం కొనసాగుతుంది. అది వైసీపీ కావచ్చు. టీడీపీ కావచ్చు. మరేదైనా పార్టీ కావచ్చు. గత కొన్ని దశాబ్దాలుగా జరుగుతున్నదిదే. రాజ్యాంగం ప్రకారం రిజర్వ్ డ్ నియోజకవర్గాల్లో వారిని మాత్రమే అభ్యర్థిగా ఎంపిక చేయాల్సి ఉన్నందున వారిని తప్పనిసరి పరిస్థితుల్లో ఎంపిక చేస్తున్నారు. గెలిచిన తర్వాత అధికారంలో ఉన్న పార్టీకి చెందిన అగ్రకులానికి చెందిన నేతల ఆధిపత్యం ఆ నియోజకవర్గాల్లో ఉండటం, ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు నామమాత్రంగా మిగిలిపోవడం కొన్ని దశాబ్దాల నుంచి జరుగుతున్న తంతు ఇదే. దీనికి ఏ ఒక్క రాజకీయ పార్టీ మినహాయింపు కాదు. ఎన్నికల ప్రచారంలో మాత్రం ఎస్సీ, ఎస్టీ ఓట్ల కోసం వారి వెంట పరుగులు తీస్తారు. గెలిచిన తర్వాత మాత్రం అక్కడ వారిని నామమాత్రంగానే మిగిలేలా చేస్తారు నాడు వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో కర్నూలు జిల్లాలోని నందికొట్కూరులో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, కోడుమూరులో కోట్ల విష్ణువర్ధన్ రెడ్డి, పాడేరు, రంపచోడవరంలో అనంతబాబు కావచ్చు.. ఇలా అనేక చోట్ల నాడు ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు ఇబ్బందులు పడ్డారు. తమ గోడును అధినాయకత్వానికి చెప్పుకున్నా కూడా ఫలితం కనిపించ లేదు. జగన్ జోక్యం చేసుకున్నప్పటికీ, అక్కడ వారిదే ఆధిపత్యం కావడంతో ఎమ్మెల్యేలనే సర్దుకు పోవాలని బుజ్జగించి పంపారని చెబుతారు. నామినేటెడ్ పదవులు, కాంట్రాక్టులు, ఇతర విషయాల్లో అక్కడి అగ్రకులాలకు చెందిన నేతలు చెప్పిన మాటే చెల్లుబాటు అవుతుంది. అధికారులు కూడా వారి మాటలనే శిరోధార్యంగా భావిస్తారు. ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలను లెక్క చేయరు. ఇక టీడీపీ కూడా ఇందుకు మినహాయింపు కాదు. కొవ్వూరు నియోజకవర్గంలో జవహర్ కు టీడీపీకి చెందిన అక్కడ అగ్రకులానికి చెందిన నేతలు ఆధిపత్యం వహించారు. చివరకు ఆయనకు టిక్కెట్ దక్కకుండా చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో నాటి మంత్రి, ఎమ్మెల్యేగా ఎన్నికైన ఐఆర్ఎస్ అధికారి రావెల కిశోర్ బాబుపై అక్కడ కమ్మ సామాజికవర్గం నేతలు పట్టుబట్టి బయటకు పంపారు. ఎవరో ఒకరో ఇద్దరో తప్పించి ఎవరూ ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు వారిని కాదని ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. తాజాగా తిరువూరు నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలపై కూడా ఇదే కోవకు చెందినవిగా భావిస్తున్నారు. కొలికపూడి శ్రీనివాసరావుపై ఎంపీ కేశినేని చిన్ని ఆధిపత్యం చూస్తుంటే స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు కావస్తున్నా దీనికి మాత్రం తెరపడే అవకాశం కనిపించడం లేదన్న ఆవేదన అందరిలోనూ వ్యక్తమవుతుంది.

# మొంథా తుపాను.. దంచికొడుతున్న వర్షం

కోనసీమ (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28

మొంథా తుపాను ప్రభావంతో కోనసీమ జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షం కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పలు మండలాల్లో ఈదురు గాలులు వీస్తున్నాయి. సాయంత్రం నుంచి గాలుల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా అధికారులు ఆదేశించారు. సముద్ర తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వారు పేర్కొన్నారు.

=========================

# రెండు ఆర్టీసీ బస్సులు ఢీ.. ప్రయాణికులకు గాయాలు

చిత్తూరు (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28

పుంగనూరు గూడూరు పల్లె వద్ద రెండు ఆర్టీసీ బస్ లు ఎదురెదురు గా ఢీ కొన్నాయి. ఈ రోడ్డు ప్రమాదం లో పది మంది ప్రయాణికులకు గాయాలు అయ్యాయి. గాయపడిన ప్రయాణికులను 108 ద్వారా పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

# 48 వేల మందితో శృంగారం

న్యూయార్క్ , (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28

ఒక ప్రముఖ హాలీవుడ్ హీరో ఆ ధైర్యం చేసాడు. ఆయన మరెవరో కాదు, చార్లీ షీన్. హాలీవుడ్ లో ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో హీరో గా, క్యారక్టర్ ఆర్టిస్ట్ గా, విలన్ గా నటించి, ఎవర్ గ్రీన్ స్టార్ గా పేరు తెచ్చుకున్న ఈ నటుడు రీసెంట్ గా 'ఇంపల్సివ్' సంస్థ నిర్వహించిన పోడ్ క్యాస్ట్ లో తానూ 47 వేల మంది మహిళలతో శృగారం చేసానని చెప్పుకొచ్చాడుతన శరీరం లో ప్రవహించేది మనిషి రక్తం కాదని, టైగర్ బ్లడ్ అని, యువకుడిగా ఉన్నప్పుడు తన దూకుడుని ఎవ్వరూ తట్టుకోలేకపోయేవారని ఈ సందర్భంగా ఆయన చెప్పుకొచ్చాడు.

ఆరోజుల్లో నేను చేసే ఈ పని గురించి పెద్దగా ఆలోచించలేదని, అప్పటికి తనకు అంత పరిణీతి చెందిన వయస్సు కూడా కాదని, నేను తీసుకునే నిర్ణయాలకు ఎవ్వరూ అడ్డు చెప్పే సాహసం చేసేవాళ్ళు కాదని ఆయన చెప్పుకొచ్చాడు. నిజంగా ఒక మనిషికి అంత మందితో శృంగారం చేసే శక్తి ఉంటుందా?, దైవ సమానులకు కూడా ఇలా చేసారని మనం పురాణాల్లో కూడా చదువుకోలేదు. కచ్చితంగా ఇతను అటెన్షన్ పిచ్చి తోనే ఇలా మాట్లాడి ఉంటాడని సోషల్ మీడియా లో నెటిజెన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

# బ్యాంకుల ప్రారంభానికి తుఫాను అడ్డంకి

గుంటూరు, అక్టోబరు 28, భారీ తుఫాన్ ఏపీని భయపెడుతోంది. ప్రచండ వాయుగుండం తీరానికి దగ్గరవుతోంది. 13 కిలోమీటర్ల వేగంతో తీరం వైపు దూసుకొస్తోంది. వాయుగుండం ప్రభావంతో ఏపీవ్యాప్తంగా వర్షాలు ప్రారంభం అయ్యాయి. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు భారీ వర్షాలు దంచి కొడుతున్నాయి. ఏపీ ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. అన్ని జిల్లాలను అప్రమత్తం చేసింది. అయితే కీలకమైన కొన్ని కార్యక్రమాలను వాయిదా వేసింది ఏపీ ప్రభుత్వం. ముఖ్యంగా అమరావతి రాజధానిలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఒక కార్యక్రమం వాయిదా పడడం కాస్త ఇబ్బందికరమే. ఇప్పటివరకు అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున నిర్మాణాలు ప్రారంభం అయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ప్రారంభిస్తుందనగా తుఫాను ప్రభావంతో కార్యక్రమం నిలిచిపోయింది. అమరావతి రాజధాని లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నాలుగు ఎకరాల స్థలంలో ప్రధాన కార్యాలయం నిర్మాణానికి ముందుకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం వద్ద 12 కోట్ల రూపాయలకు భూమిని కొనుగోలు చేసింది. మరోవైపు ప్రధానమైన 12 బ్యాంకులు తమ ప్రాంతీయ కార్యాలయ భవనాలను ఒకే చోట నిర్మాణం చేపట్టాలని భావించాయి. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సమక్షంలో శంకుస్థాపన పనులు ప్రారంభమయ్యేలా చూడాలని అనుకున్నాయి. ఇది ఒక విధంగా చెప్పాలంటే కేంద్ర ప్రభుత్వం అమరావతి రాజధానికి పూర్తిగా భరోసా ఇచ్చినట్టు అవుతుంది. బ్యాంకు కార్యాలయాలు అంటే కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తాయి. అందునా రిజర్వ్ బ్యాంకు అమరావతిలో భవన నిర్మాణానికి దిగిందంటే.. ఇక రాజధానిని ఎవరు కదిలించలేరన్న ధీమా వచ్చేది. ఈ బ్యాంకుల ద్వారా అమరావతికి తమ మద్దతు సంపూర్ణ స్థాయిలో ఉందని కేంద్రం సంకేతాలు పంపింది. అయితే తుఫాను పుణ్యమా అని ఈ కార్యక్రమం వాయిదా పడింది. అమరావతిలో రిజర్వు బ్యాంకు తో పాటు 12 ప్రధాన బ్యాంకుల కార్యాలయాల నిర్మాణం పనులను వేడుకగా ప్రారంభించి సరికొత్తగా సంకేతాలు పంపాలని చూసింది కేంద్ర ప్రభుత్వం. ఇది పూర్తిగా కేంద్రం ఆధీనంలో జరుగుతున్న కార్యక్రమం. కానీ అమరావతికి చంద్రబాబు సర్కార్ ఎనలేని ప్రాధాన్యమిస్తున్న దృష్ట్యా.. ఇప్పటికీ అమరావతిపై వైసీపీ విషం చిమ్ముతూనే ఉంది. దాని దూకుడుకు కళ్లెం వేయాలంటే కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు గా ఉన్న బ్యాంకింగ్ వ్యవస్థలను ప్రారంభించి.. సరైన సమాధానం చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. గాని దానికి తీవ్ర తుఫాను అడ్డంకిగా నిలిచింది.

# అద్దెకు పాకిస్తాన్ సైన్యం...



లాహోర్, (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28,

ఆర్థికంగా సంక్షోభంలో కూరుకుపోయిన దాయాది దేశం పాకిస్తాన్.. ఇప్పుడు కొత్త వ్యాపారం మొదలు పెట్టింది. ఇప్పటికే ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్ తమ దేశంలోని రేర్ ఎర్త్ మినరల్స్ పట్టుకుని విదేశాల్లో పర్యటిస్తున్నారు. అమెరికాతో ఒప్పందం కూడా చేసుకున్నారు. ఇక ఇప్పుడు సైన్యంతో మునీర్ పత్తేపారం మొదలు పెట్టారు. తమ సైన్యాన్ని కూడా డబ్బున్న దేశాలకు అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకోవాలని చూస్తున్నాడు. ఈ క్రమంలోనే ఇటీవల పాకిస్తాన్?సౌదీ అరేబియా రక్షణ ఒప్పందం అంతర్జాతీయ వేదికల్లో చర్చకు దారితీసింది. పైకి ఇది పరస్పర భద్రతా కూటమిలా కనిపించినా, అంతర్గతంగా ఇది సైన్య అద్దె ఒప్పందంగా మారిపోయిందని వ్యూహ నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రకారం, పాక్ సుమారు మారింది. 25 వేల మంది సైనికులను సౌదీ భూభాగానికి పంపాలనుకుంటోంది. ఇదిలా చేయడానికి ప్రతిగా సౌదీ, పాకిస్తాన్‌కు 88 వేల కోట్ల పాకిస్తాన్ రూపాయలు చెల్లించనుంది. పాకిస్తాన్ ప్రస్తుతం అత్యంత క్లిష్టమైన ఆర్థిక పరిస్థితిలో ఉంది. ఐఎంఎఫ్ సహాయ ప్యాకేజీలతో కూడా వృద్ధి సాధ్యం కాలేదు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ఖజానా ఖాళీ అయిపోవడం, అంతర్జాతీయ రుణదాతల ఒత్తిడి వలన, ఇస్లామాబాద్ 'సైన్యాన్ని ఆదాయ వనరుగా' ఉపయోగించుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఒకప్పుడు సైన్యాన్ని దేశ రక్షణ కోసం ఉపయోగించిన పాక్, ఇప్పుడు ఆర్థిక ఆదాయానికి సైనికులను ప్రత్యేక కాంట్రాక్టు విభాగాల్లా వాడబోతుంది. ఇది ప్రపంచ రక్షణ చరిత్రలో కొత్త ఉదాహరణగా చెప్పవచ్చు. సౌదీ అరేబియా ఈ ఒప్పందం ద్వారా తన భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని చూస్తోంది. ఇరాన్ ఉద్రిక్తతలు, యెమెన్ సరిహద్దు ఘర్షణలు, హజ్ సీజన్ భద్రత వంటి సందర్భాల్లో అనుభవజ్ఞులైన పాక్ సైన్యం అవసరమవుతుంది. తద్వారా సౌదీకి స్వీయ రక్షణ శక్తిని పెంచుకోవడమే కాకుండా, అంతర్గత భద్రతను కూడా పాక్ మద్దతుతో బలోపేతం చేసుకోవాలనుకుంటోంది.

పాక్ ప్రభుత్వానికి ఈ ఒప్పందం ద్వారా తాత్కాలిక ఆర్థిక ఊతం లభించినా, దీర్ఘకాల వ్యూహాత్మక పరువు నష్టం కలుగుతుందనే అభిప్రాయం వ్యాపిస్తోంది. సైన్యాన్ని అద్దెకు ఇవ్వడం జాతీయ రక్షణ భావాన్ని బలహీనపరుస్తుంది. విదేశీ యుద్ధాల్లో పాల్గొన్నప్పుడు పాక్ అంతర్జాతీయ నిష్పాక్షికత కోల్పోతుంది. సౌదీ?ఇరాన్ సంబంధాలు మళ్లీ ఉద్రిక్తమైతే పాక్ సైన్యం ఇరుక్కుపోవచ్చు. ఇదంతా చూస్తుంటే పాక్‌ను ఓ రక్షణ కాంట్రాక్టర్ దేశంగా మలచే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. 1980లలో సోవియట్?ఆఫ్ఘన్ యుద్ధం సమయంలో కూడా పాక్, అమెరికా సూచనలతో మత ఉగ్రవాదులకు శిక్షణ కేంద్రంగా మారింది. ఇప్పుడు అదే దేశం మరోసారి విదేశీ యుద్ధాల కోసం సైన్యాన్ని అద్దెకు పెట్టడం అది ఎంతవరకు బయటపడగలదన్న ప్రశ్నను తెస్తోంది. సౌదీతో జరిగిన ఈ రక్షణ ఒప్పందం పాకిస్తాన్ ఆర్థిక పునరుద్ధరణకు తాత్కాలిక ఉపశమనం ఇస్తుందేమో కానీ, దీని భద్రతా స్వతంత్రతను ప్రశ్నించే దశకు తీసుకువెళ్తుంది. సైనిక బలం ఒక దేశ ఆస్తి, కానీ దానిని "అద్దె వ్యవస్థ"గా మార్చడం అంతర్జాతీయ స్థాయిలో పాక్ ప్రతిష్టను దెబ్బతీసే అవకాశం ఉంది.

===============

# కడపలో ఐటీ క్లస్టర్ పార్క్...

కడప, (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28

ఏపీని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. అన్ని ప్రాంతాల అభివృద్దే ధ్యేయంగా ప్రణాళికలు రచిస్తోంది. ఈ క్రమంలోనే కడపలో ఐటీ పార్కు ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఈ విషయాన్ని కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి రెడ్డి వెల్లడించారు. కడపలో ఐటీ క్లస్టర్ పార్కు ఏర్పాటు కోసం ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని.. ఇప్పటికే భూమిని కూడా గుర్తించినట్లు మాధవిరెడ్డి తెలిపారు. గుర్తించిన భూమిలో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై స్థానిక కలెక్టర్‌ను ఆదేశించినట్లు వివరించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు ఏపీ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే కంపెనీలకు ప్రోత్సాహకాలు అందించడంతో పాటుగా పరిపాలనా పరమైన అనుమతులు కూడా వేగంగా మంజూరయ్యేలా చూస్తోంది. ఈ క్రమంలోనే ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకువస్తున్నాయి. దీంతో ఆర్థిక రాజధాని విశాఖపట్నం ఐటీ, ఏఐ హబ్‌గా రూపుదిద్దుకుంటోంది. అయితే ఇదే సమయంలో రాయలసీమ జిల్లాల్లో అభివృద్ధిపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలోనే వైఎస్సార్ కడప జిల్లాల ఐటీ క్లస్టర్ పార్కు ఏర్పాటుకు ప్రణాళికలు రచిస్తోంది. కడపలో ఈ ఐటీ క్లస్టర్ పార్కు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రెడ్డెప్పగారి మాధవిరెడ్డి వెల్లడించారు. ప్రతిపాదిత ఐటీ క్లస్టర్ పార్కు ఏర్పాటుకు కావాల్సిన భూమిని జిల్లా యంత్రాంగం ఇప్పటికే గుర్తించిందని వివరించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తోందని మాధవి రెడ్డి వెల్లడించారు. ఇందులో భాగంగా విశాఖపట్నాన్ని ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రయత్నాల్లో ఉన్నట్లు వివరించారు. అలాగే తిరుపతి. శ్రీసిటీ, కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్‌లను ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. కర్నూలు, అనంతపురం సహా మిగతా రాయలసీమ జిల్లాల్లో డిఫెన్స్ , సోలార్ ఎనర్జీ, డ్రోన్ టెక్నాలజీకు సంబంధించిన కంపెనీలు పెట్టుబడులు పెట్టనున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లి నియోజకవర్గంలోనూ ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందన్నారు. అలాగే రాష్ట్రంలో ఎంపిక చేసిన నియోజకవర్గాలలో ఐటీ పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

# తొక్కిసలాట కుటుంబాలకు అండగా విజయ్

చెన్నై, అ(భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28

కరూర్ ప్రాంతంలో జరిగిన తొక్కిసలాట తర్వాత టీవీ కె పార్టీ అధినేత విజయ్ తీవ్రమైన ఒత్తిడి ఎదురుకున్నారు. అధికార డిఎంకె రకరకాలుగా విమర్శలు చేయడంతో ఆయన కొద్ది రోజులపాటు ఇంటికి మాత్రమే పరిమితమయ్యారు. ఈ నేపథ్యంలో టీవీకే పార్టీ సుప్రీంకోర్టు దాకా వెళ్లడం.. డీఎంకే పార్టీ ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం పట్ల అనుమానాలు వ్యక్త చేయడంతో.. సుప్రీంకోర్టు కల్పించుకుంది. ఈ కేసును విచారించే బాధ్యతను సిబిఐకి అప్పగిస్తూ తీర్పు చెప్పింది. దీంతో డిఎంకె కు షాక్ తగిలింది. డీఎంకేకు ఇప్పుడు విజయ్ మరో షాక్ ఇచ్చారు. కరూర్ ప్రాంతంలో జరిగిన తొక్కిసలాటలో 41 చనిపోయిన నేపథ్యంలో.. ఈ ఘటన జరిగిన నెల రోజుల తర్వాత బాధిత కుటుంబాలను టీవీ కే పార్టీ అధినేత విజయ్ కలిశారు. మహాబలిపురం ప్రాంతంలోని ఓ రిసార్ట్ లో 50 గదులను బుక్ చేశారు. ఆ తర్వాత బాధిత కుటుంబాలను ప్రత్యేక బస్సులలో అక్కడికి తీసుకెళ్లారు. బాధిత కుటుంబ సభ్యులతో విజయ్ ప్రత్యేకంగా మాట్లాడారు. వారి కుటుంబ పరిస్థితులను తెలుసుకున్నారు. స్వయంగా వారు చెబుతున్న వివరాలను విజయ్ నోట్ చేసుకున్నారు. విజయ్ వెంట పార్టీ ప్రధాన కార్యదర్శులు బుస్సీ ఆనంద్ కుమార్, అర్జున్ ఉన్నారు. పార్టీపరంగా అండగా ఉంటామని వారికి హామీ ఇచ్చారు. పిల్లల చదువులు.. వైద్య ఖర్చులు.. ఇతర విషయాలలో కూడా పార్టీ మీకు సపోర్ట్ గా ఉంటుందని వారికి భరోసా కల్పించారు. 41 మంది కుటుంబాలతో కలిసి విజయ్ భోజనం కూడా చేశారు. జరిగిన సంఘటన దురదృష్టకరమని విజయ్ వారితో వాపోయారు. ప్రజల కోసమే తాను పార్టీ పెట్టానని.. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అడుగులు వేశానని.. ప్రజల భద్రత తన మొదటి ప్రాధాన్యత అని విజయ్ పేర్కొన్నారు. అయితే అనూహ్యంగా జరిగిన ఈ



సంఘటన తనను ఎంతో బాధించిందని బాధిత కుటుంబాలతో విజయ్ వాపోయారు. ఈ సందర్భంగా విజయ్ కన్నీటి పర్యంతమయ్యారు."నాకు తీవ్రమైన దుఃఖం కలుగుతున్నది. తీవ్ర ఆవేదనలో నేను కనిపిస్తున్న. గడిచిన నెల రోజుల నుంచి నేను మానసికంగా సిద్ధంగా లేను. మిమ్మల్ని కలుసుకునే అవకాశం కోసమే ఎదురు చూస్తున్నాను. నాకు అన్ని విధాలుగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అన్ని జాగ్రత్తలు తీసుకున్న తర్వాతే మిమ్మల్ని ఇక్కడిదాక తీసుకొచ్చాను. నాకు ఇంతకుమించి వేరే ప్రత్యామ్నాయం లేదు. అందువల్లే మీతో ఇక్కడ ఒక వేదిక ఏర్పాటు చేసుకొని మాట్లాడాల్సి వస్తోంది. మీకు కన్నీటిని తుడిచే సామర్థ్యం లేకపోవచ్చు గాని.. భరోసా కల్పించే ధైర్యం మాత్రం ఉందని" విజయ్ వారితో పేర్కొన్నాడు. కరూర్ ఘటన జరిగిన తర్వాత మృతుల కుటుంబాలకు 20 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని విజయ్ ప్రకటించాడు. త్వరలోనే ఆ కుటుంబాలకు చెక్కులు ఇస్తారని తెలుస్తోంది. మరోవైపు తమిళనాడు ప్రభుత్వం కూడా పరిహారం ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ ఘటనపై ప్రస్తుతం సిబిఐ విచారణ మొదలైంది.

# వందల కోట్ల నుంచి 15 కోట్లకు... పడిపోయిన గులాబీ విరాళాలు

హైదరాబాద్, (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28

బెంగాల్లో మమతకు.. తమిళనాడులో స్టాలిన్ కు, ఏపీలో చంద్రబాబుకు.. అంతకుముందు జగన్మోహన్ రెడ్డికి ఎవరికీ చేతకాలేదు. వాళ్ల వల్ల కాలేదు.. వాస్తవానికి కుటుంబ పార్టీలలో.. కనివిని ఎరుగని స్థాయిలో ట్రెండ్ సృష్టించారు కేసీఆర్. అధికారంలో ఉన్నప్పుడు తన పార్టీని ఏకంగా జాతీయస్థాయిలో నిలబెట్టాలని ప్రయత్నం చేశాడు. గాలి మోటార్ లో దేశ మొత్తం తిరిగాడు. అసలు ప్రతిపక్ష కూటమికి తానే ఫండింగ్ చేస్తానని చెప్పాడు. అటువంటి కెసిఆర్ ఇప్పుడు ఫామ్ హౌస్ కు పరిమితమయ్యాడు. బిడ్డను పార్టీ నుంచి బయటికి పంపించాడు. అసెంబ్లీ ఎన్నికల్లో దారుణమైన ఫలితాలు.. పార్లమెంట్ ఎన్నికలు 0 ఫలితాలు.. అంతే ఇప్పుడు కారు పార్టీని దేకే వాడు లేడు. ఈ మాట అంటున్నది మేం కాదు. ఎన్నికల సంఘానికి స్వయంగా భారత రాష్ట్ర సమితి ఇచ్చిన రిపోర్టు. 2023 -2024 కాలానికి భారత రాష్ట్ర సమితికి ఏకంగా 580.52 కోట్లు విరాళాల రూపంలో వచ్చాయి.. ఇందులో ఎలక్టోరల్ బాండ్ల ద్వారానే భారత రాష్ట్ర సమితికి 495.52 కోట్లు వచ్చాయి. ఇందులో ప్రడెంట్ ఎలక్టో రల్ ట్రస్టు ద్వారా ఏకంగా 85 కోట్లు లభించాయి. 2022 -23 సంవత్సరానికి సంబంధించి భారత రాష్ట్ర సమితికి 683.06 కోట్లు వచ్చాయి. ఇందులో బాండ్ల రూపంలో 529 కోట్లు, ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచి 90 కోట్లు.. వివిధ వ్యక్తుల నుంచి 64.3 కోట్లు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని ఫలితాలు.. పార్లమెంట్ ఎన్నికల్లో 0 ఫలితాలు రావడంతో కారు పార్టీ పరిస్థితి దారుణంగా మారిపోయింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత వచ్చిన ఉప ఎన్నికలో కారు పార్టీ దారుణంగా బోల్తా పడింది. దీనికి తోడు ఆ పార్టీ నుంచి కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఆ పార్టీని పెద్దగా పట్టించుకునే వారు లేకుండా పోయారు. 2024 -25 లో పార్టీకి 15,09,08,141 మాత్రమే వచ్చాయని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు.. ఇప్పుడు గులాబీ పార్టీ అధికారంలో లేకపోవడంతో.. కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదు. అజ్ఞాత వ్యక్తులు విరాళాలు ప్రకటించడం లేదు.

భారత శక్తి

బుధవారం 29 అక్టోబరు 2025

# హై సెక్యూరిటీ స్మార్ట్ హైవే... మీరు ఏఐ నిఘాలో ఉన్నారు

హైదరాబాద్, (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28దేశంలో అత్యంత రద్దీగా ఉండే రహదారుల్లో ఒకటైన హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి త్వరలో 'హై సెక్యూరిటీ స్మార్ట్ హైవే'గా రూపుదిద్దుకోనుంది. ప్రస్తుతం ఉన్న నాలుగు వరుసల రోడ్డును ఆరు వరుసలుగా విస్తరించడంతోపాటు అత్యంత ఆధునిక సాంకేతికతతో డిజిటల్ రోడ్డుగా మార్చనున్నారు. తెలంగాణ పరిధిలోని మల్కాపూర్ అందోల్ మైసమ్మ ఆలయం వద్ద నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ కనకదుర్గమ్మ గుడి వరకు వరకు దాదాపు 231.32 కిలోమీటర్ల మేర ఈ విస్తరణ జరగనుంది. ఈ భారీ విస్తరణ ప్రాజెక్టు కోసం సుమారు రూ. 10,391.53 కోట్లు నిధులు అవసరమవుతాయని సమగ్ర ప్రాజెక్టు నివేదికలో అంచనా వేశారు. ఇందులో నిర్మాణ వ్యయం కోసం రూ. 6,775.47 కోట్లు, ఇతర అవసరాల కోసం రూ. 3,616.06 కోట్లు కేటాయించారు. డీపీఆర్ రూపకల్పన దాదాపు పూర్తికావడంతో, వచ్చే ఏడాది ఏప్రిల్ లేదా మే నెలలో పనులు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. రహదారి భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ఈ రోడ్డును పూర్తిస్థాయిలో స్మార్ట్ హైవేగా తీర్చిదిద్దనున్నారు. దీనికోసం హైవేపై ప్రతి కిలోమీటర్‌కు రెండు వైపులా ఒకటి చొప్పున మొత్తం 231 అత్యాధునిక 360 డిగ్రీల సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తారు. ఈ కెమెరాలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో అనుసంధానం చేస్తారు. స్పీడ్ డిటెక్షన్, రాంగ్ రూట్ వంటి నిబంధనల అతిక్రమణతో పాటు ప్రమాదాలు వంటివి జరిగితే వెంటనే లొకేషన్, కిలోమీటర్ నంబర్‌తో సహా వీడియో వివరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు పంపుతాయి. దీని పర్యవేక్షణకు ప్రత్యేక మానిటరింగ్ కేంద్రాలను హైవేపై ఏర్పాటు చేస్తారు. ఈ వ్యవస్థను రాష్ట్ర పోలీసు, రవాణా శాఖకు అనుసంధానం చేయడం వల్ల రోడ్డుపై నిరంతరం 24 గంటలు నిఘా ఉంటుంది. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నట్టు గుర్తించిన 38 చోట్ల ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయనున్నారు. అలాగే 17 బ్లాక్‌స్పాట్‌ల వద్ద రోడ్ ఓవర్‌బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. రహదారికి ఇరువైపులా వాహనాలు కిందికి పడిపోకుండా బారికేడ్లు ఏర్పాటు చేస్తారు. సోలార్ వీధి దీపాలు ఏర్పాటు చేయడంతోపాటు, వర్షపు నీటిని ఒడిసిపట్టేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. భవిష్యత్తులో రోడ్డును తవ్వకుండా ఉండేందుకు వీలుగా మంచినీటి సరఫరా, గ్యాస్ పైప్‌లైన్లు, ఆప్టికల్ ఫైబర్ కేబుల్ లైన్లు వంటి అన్ని మౌలిక వసతులను నిర్మాణ సమయంలోనే ఏర్పాటు చేస్తున్నారు. ఈ స్మార్ట్ హైవే విస్తరణ వాణిజ్య, వ్యాపార కార్యకలాపాలకు గణనీయమైన ఊతమివ్వనుంది. ఈ రహదారి దాదాపు 50 ఇండస్ట్రియల్ పార్కులు, 20 ఎకనామిక్ నోడ్స్, 4 నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ లకు అనుసంధానం కానుంది. ఇది రెండు మేజర్ రైల్వే స్టేషన్లు, రెండు విమానాశ్రయాలకు కూడా అనుసంధానంగా మారనుంది. ప్రస్తుతం ఈ రోడ్డుపై రోజుకు 43,742 వాహనాలు తిరుగుతుండగా.. 2048 నాటికి ఈ సంఖ్య 1,71,251కి పెరుగుతుందని అంచనా. ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ నుంచి విజయవాడకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది.

# రేవంత్ రెడ్డిపై ఆర్టీఐ ఆయుధం

## ప్రయోగిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్,(భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28

తెలంగాణ రాష్ట్రంలో మంత్రుల మధ్య వివాదాలు రోజుకో తీరుగా మారుతున్నాయి. ఓ మంత్రి తన సహచర మంత్రిని దున్నపోతు అని ఇటీవల విమర్శించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఆయన ఇంటికి వెళ్లి క్షమాపణ కూడా చెప్పిన విషయం తెలిసిందే. దానిని మర్చిపోకముందే ఇద్దరు మంత్రుల మధ్య కాంట్రాక్టుల విషయంలో వివాదాలు జరిగాయి. ఈ నేపథ్యంలోనే ఓ మంత్రి ఓ ఎస్ డి ని పోలీసులు అదుపులోకి తీసుకోవడానికి వచ్చారు. అది కాస్త వివాదంగా మారింది. పైగా ఆ మంత్రి కుమార్తె తెరమీదకి వచ్చి అడ్డగోలుగా విమర్శలు చేసింది. ఏకంగా ముఖ్యమంత్రిని ఉద్దేశించి తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసింది. ఓ సిమెంట్ కంపెనీలో వాటాల విషయంలో గొడవలు కూడా జరిగాయని.. తుపాకీ ఎక్కుపెట్టి బెదిరించారని ఆ మంత్రి కుమార్తె సంచలన ఆరోపణలు చేసింది. ఈ పరిణామాలు సహజంగానే ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాయి. దీంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంచార్జి కల్పించుకొని ఆ మంత్రితో ముఖ్యమంత్రికి క్షమాపణ కూడా చెప్పించారు. ఇదంతా జరిపిన తర్వాత ఇప్పుడు మరొక విషయం వెలుగులోకి వచ్చింది. గులాబీ పార్టీ అనుబంధ సోషల్ మీడియా గ్రూపులలో.. సోషల్ మీడియా హ్యాండిల్స్ లో దీని గురించి విపరీతంగా ప్రచారం నడుస్తోంది. ఈ ప్రకారం ఓ మంత్రి ఆర్టిఐ అస్త్రాన్ని ఉపయోగించుకుంటున్నారు. తన అనుచరులతో ఆర్టిఐ ద్వారా ప్రభుత్వంలో జరుగుతున్న కేటాయింపులు.. నిధుల ఖర్చు.. ఇతర వ్యవహారాల గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా కెసిఆర్ ప్రభుత్వంలో భూముల కేటాయింపు.. పెట్టిన ఖర్చు.. ఇతర వ్యవహారాల గురించి తెలుసుకుంటున్నట్టు సమాచారం. మంత్రి అనుచరులు భారీగా ఆర్టిఐ దరఖాస్తులు చేస్తున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. తన శాఖ నుంచి మొదలు పెడితే ముఖ్యమంత్రి పర్యవేక్షించే శాఖల వరకు వీటిని కూడా మంత్రి వదిలిపెట్టడం లేదని సమాచారం. అయితే కొన్ని శాఖల సిబ్బంది వివరాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో మంత్రి స్వయంగా వారికి ఫోన్ చేసి.. వివరాలు ఇవ్వకపోతే మందలిస్తున్నట్టు తెలుస్తోంది. వాస్తవానికి కెసిఆర్ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై అసలు విషయాలు తెలుసుకోవడానికి ఆ మంత్రి ఆర్టీఐ దరఖాస్తులు చేయిస్తుంటే.. గులాబీ మీడియా మాత్రం మరో విధంగా దీనిని డైవర్ట్ చేస్తోంది. తెలంగాణ మంత్రివర్గంలో మరో ముసలం మొదలైందని.. అందువల్లే ఇలాంటి పనిని ఆ మంత్రి చేస్తున్నారని ఆరోపించడం మొదలుపెట్టింది. సహజంగానే కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఈ విషయంలో నిశ్శబ్దాన్ని పాటిస్తోంది. ఇన్ని జరుగుతున్నా కూడా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా నిశ్శబ్దంగా ఉండడం పట్ల ప్రజల్లో రకరకాల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# కోనసీమ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు

కోనసీమ (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28

మోంత తుఫాన్ ప్రభావంతో కోనసీమ జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. కోనసీమ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి నుంచి వాన జోరుగా కురుస్తుంది. వర్షం కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరా అంతరాయం కలిగింది. ప్రతీ గ్రామంలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసారు. సముద్ర తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తుఫాను ఎదుర్కొనేందుకు జిల్లా అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. అవసరమైతే తప్ప ప్రజలు ఎవరూ బయటికి రావద్దని అధికారులు సూచించారు.

========================

## కాంగ్రెస్ రివర్స్ పాలసీ..

# భూముల వేలం వేస్తే తప్ప ప్రభుత్వం నడవదా?

హైదరాబాద్, (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28ా ఉన్న సమయంలో కోకాపేట నియోపొలిస్ స్థలాలను బీఆర్ఎస్ ప్రభుత్వం వేలం వేసినప్పుడు వ్యతిరేకించారు. బావి అవసరాలకు స్థలాలు ఉంచకుండా ఇష్టం వచ్చినట్లుగా వేలం వేయడం ఏమిటని ఆదోళనలు చేశారు. హైకోర్టుకు కూడా వెళ్లారు. తాము వచ్చాక ల్యాండ్ ఆక్షన్స్ రద్దు చేస్తామని కూడా హెచ్చరించారు. కానీ సీఎంగా రేవంత్ బాధ్యతలు చేపట్టిన భూముల వేలం మరింత ఊపందుకుంది. ప్రభుత్వానికి అసరమైన నిధులు భూముల ద్వారానే వస్తాయని అనుకుంటున్నారు. తెలంగాణలో అత్యంత ఖరీదైన భూముల్ని వేలం వేయకూడదన్నది రేవంత్రెడ్డి పాలసీ. కానీ అది ప్రతిపక్ష నేతగా ఉన్నపుడే. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అనుకూలంగా బీఆర్ఎస్ ప్రభుత్వం భూములు అమ్ముతోందని..ఆ భూముల్లో హైరైజ్ భవనాలకు అనుమతులు ఇచ్చి అధికార దుర్వినియోగం, పర్యావరణ నిబంధనలు ఉల్లంఘన చేస్తోందని తీవ్రంగా విమర్శించేవారు. ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్.. అంటే.. అపార్టుమెంట్లు ఎన్ని అంతస్తులు ఉండాలన్నదానిపై నియంత్రణ లేకపోవడం పైనా రేవంత్ విమర్శలు గుపపించేవారు. హైరైజ్ అపార్ట్‌మెంట్లు "పర్యావరణ వ్యవస్థ , మౌలిక సదుపాయాలపై ప్రతికూల ప్రభావం చూపుతాయి." అనే అభిప్రాయంతో ఉండేవారు. "3,000 చదరపు గజాల టవర్‌లో 500 కార్లు, 1,000 బైక్‌లు ఉంటాయి. ఇవన్నీ రోడ్లపైకి వస్తే ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌కు ఏమవుతుంది?" అని ఓ టీవీ చానల్ తో చెప్పిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. సాధారణంగా ముఖ్యమంత్రి కాక ముందు రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనలపై అవగాహన ఉన్న వారు.. భూముల అమ్మకాన్ని పరిమితం చేస్తారని.. ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ పరిమితులు పెట్టి హైరైజ్‌లపై పరిమితులు విధిస్తారని అనుకున్నారు. కొన్నాళ్లు హై రైజ్‌లకు అనుమతులు ఇవ్వకపోవడంతో అదే జరుగుతుందని అనుకున్నారు. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. భూముల వేలం చురుగ్గా సాగుతోంది. అత్యధిక ఫ్లోర్లు ఉన్న అపార్టుమెంట్లకు అనుమతులు ఇస్తున్నారు. రాయదుర్గంలో భూమల వేలంలో ఎకరానికి రూ. 177కోట్ల చొప్పున వచ్చాయి. గతంలో నియోపొలిస్‌లో రూ. వంద కోట్లకు అమ్ముడు అయితే రేవంత్ విమర్శలు చేశారు. కానీ ఇలా అమ్ముడు కావడం రికార్డు అని కాంగ్రెస్ ప్రభుత్వ వర్గాలు ప్రచారం చేస్తున్నాయి. రాయదుర్గంలో లభించిన ఆదాయంతో తెలంగాణ ప్రభుత్వం మరింత ఉత్సాహంగా ఇతర భూమలను వేలం వేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. అత్యంత ఖరీదైన భూములుగా మారిన కోకాపేట నియోపొలిస్ ప్రాంతంలో ఉన్న 25 ఎకరాలను వేలం వేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ వేలం ద్వారా ప్రభుత్వ ఖజనాకు సుమారు రూ.3,000 కోట్ల ఆదాయం సమకూర్చాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రాంతంలో గత ప్రభుత్వం




రెండు దశల్లో ఇక్కడి భూములను వేలం వేసింది. అప్పట్లో రూ.5,300 కోట్లు వచ్చాయి. ఈ వేలం ఫేజ్-3గా జరగనుంది. నవంబర్ మొదటి వారంలో లేదా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల తర్వాత ఊఓఅం నోటిఫికేషన్ జారీ చేయనుంది. అనుకున్న ప్రకారం జరిగితే, నవంబర్ చివరి వారంలో ఈ-వేలం ప్రక్రియ పూర్తవుతుంది. కంచ గచ్చిబౌలి ల్యాండ్స్ వేలం విషయంలో రేగిన దుమార సంగతి అందరికీ తెలుసు. మరో వైపు చాలా కొద్ది ప్రదేశంలో అత్యంత ఎత్తున నిర్మించే ఆకాశహర్మ్యాలకు గత ప్రభుత్వంలో కంటే ఎక్కువగా అనుమతులు ఇస్తున్నారు. నేషనల్ బిల్డింగ్ కోడ్ ప్రకారం, ఎకరానికి 30 నుంచి 100 నివాస యూనిట్లు మాత్రమే అనుమతించవచ్చు. మహానగరాల్లో 200 వరకు అనుమతిస్తారు. కానీ హైదరాబాద్‌లో ఏడున్నర ఎకరాల్లో 3,500 యూనిట్లు నిర్మిస్తున్నారు. హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నియోపోలిస్ ప్రాంతాల్లో ఒక కిలోమీటరులో 60కి పైగా టవర్లు నిర్మిస్తున్నారు. ఇందులో వేల కొద్దీ ప్లాట్లు ఉంటున్నాయి. ఈ కారణంగా ట్రాఫిక్ ఉదయం, సాయంత్రం 2-3 కిలోమీటర్ల దూరానికి అరగంట నుంచి గంట సమయం పడుతోంది. తాగునీరు, డ్రైనేజీ, ఇతర మౌలిక సదుపాయాలపై విపరీత ఒత్తిడి పెరిగిందన్న నివేదికలు ఉన్నాయి.

అయితే అత్యధిక ఆదాయం వస్తోందని ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకుంటోంది. ఇటీవలి కాలంలో హెచ్ఎండీతో పాటు, తెలంగాణ హౌసింగ్ బోర్డు ఎక్కడ ఖాళీ స్థలాలు ఉంటే అక్కడ వేలం వేసేందుకు వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. కొన్ని చోట్ల అత్యాశకుపోయి అత్యధిక ధర నిర్ణయించడంతో ఒక్క ప్లాట్ కూడా అమ్ముడుకాని సందర్భాలు ఉన్నాయి. అయినా ప్రభుత్వం మాత్రం వెనక్కి తగ్గడం లేదు. ప్రభుత్వ పథకాలు అమలు చేయాలంటే.. భూముల అమ్మకం తప్పదని.. హై రైజ్ భవనాలను ప్రోత్సహించక తప్పదని అనుకుంటున్నారు. కానీ ముఖ్యమంత్రి అధికారంలోకి రాక ముందు చెప్పిన మాటలకు..ఇప్పుడు తీసుకుంటున్న నిర్ణయాలకు పొంతన లేకపోవడం ప్రజల్ని ఆశ్చర్య పరుస్తోంది.

# హైదరాబాద్, వరంగల్ లో రూకో ఆయిల్ యూనిట్లు వాడేసిన నూనెతో డీజిల్

వరంగల్, (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28

మీరు రోజూ వంటలో వాడే నూనె ఒకసారి వేయించడానికి వాడాక దాన్ని ఏం చేస్తారు? పారబోస్తారా? లేక పదేపదే వాడుతుంటారా? పదే పదే వాడితే అనారోగ్య సమస్యలు.. పారబోయాలంటే మనసు ఒప్పుకోదు. ఇకపై ఆ టెన్షన్ లేదు. పూరీలు వేయించిన నూనెతో లారీలు నడుస్తాయి.. బజ్జీలు, వడలు చేసిన నూనెతో బస్సులు, బైకులు వడివడిగా పరుగులు పెడతాయి. అదెలా అనుకుంటున్నారా...? నమ్మలేకపోతున్నారా? నిజమండీ బాబు! ఇదేదో కట్టుకథ కాదు... ప్రజల ఆరోగ్యాన్ని కాపాడి, దేశానికి ఇంధన భద్రతను అందించే లక్ష్యంతో భారత ప్రభుత్వం చేపట్టిన ఒక అద్భుతమైన ఉద్యమం. ఆహార భద్రత సంస్థ ప్రవేశపెట్టిన ఈ వినూత్న కార్యక్రమం వెనుక ఉన్న అద్భుతమైన సైన్స్, దాని వల్ల మనకు కలిగే లాభాలు ఏంటో తెలుసుకుంటే మీరు ఖచ్చితంగా ఆశ్చర్యపోతారు. ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడంతో పాటు, ఇంధన భద్రతను పెంచే లక్ష్యంతో ఈుూాంఎ చేపట్టిన వినూత్న కార్యక్రమమే 'ఖీజఆ' రుకో అంటే.. ఒకసారి వాడి, పదేపదే వినియోగానికి పనికిరాని వంట నూనెను సేకరించి, దానిని బయోడీజిల్‌గా మార్చటం. ఈ 'ఈట్ రైట్' పథకాన్ని ట్రిపుల్ 'ఇ' నినాదంతో సమర్థవంతంగా అమలు చేస్తోంది. ఒకసారి వేడి చేసిన నూనెను పదేపదే వంట కోసం వాడితే, అందులో టోటల్ పోలార్ కాంపౌండ్స్ అనే విష పదార్థాలు అధికమవుతాయి. నిబంధనల ప్రకారం.. నూనెలో టీపీసీ స్థాయి 25 శాతం దాటితే అది వినియోగానికి అనర్హం. ఇలాంటి నూనెను వాడటం వల్ల ప్రజల్లో అధిక రక్తపోటు , కాలేయ వ్యాధులు, గుండె జబ్బులు, అల్జీమర్స్, చివరికి క్యాన్సర్‌ల వంటి తీవ్ర అనారోగ్యాలు వచ్చే ప్రమాదం ఉందని శాస్త్రీయ అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. ఈ దుష్ప్రభావాలను నియంత్రించేందుకు, వాడేసిన నూనెను ఆహార సరఫరా గొలుసు నుంచి శాశ్వతంగా తొలగించే లక్ష్యంతో 2018లో 'రుకో' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇది ప్రస్తుతం దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల్లో అమలులో ఉంది. తెలంగాణలో 'రుకో' కార్యక్రమంపై ఇటీవల కాలంలో అవగాహన పెరుగుతోంది. వైద్యారోగ్యశాఖ



పరిధిలోని ఆహార భద్రత తనిఖీ విభాగం, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో ఏజెన్సీలను నియమించారు. హైదరాబాద్‌లో దాదాపు 500 రెస్టారెంట్ల నుంచి వేల లీటర్ల వాడిన నూనెను సేకరించి బయోడీజిల్ ప్లాంట్లకు తరలిస్తున్నారు. ప్రస్తుతానికి హైదరాబాద్, వరంగల్ ప్రాంతాల్లో రెండు నుంచి మూడు బయోడీజిల్ పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ పథకంలో రెస్టారెంట్లు, ఇతర ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లకు లాభం కూడా ఉంది. లైసెన్స్‌డ్ ఏజెన్సీలు వాడిన నూనెను రెస్టారెంట్ల నుంచి లీటరుకు రూ.65 చొప్పున చెల్లించి కొనుగోలు చేస్తున్నాయి. హైదరాబాద్‌లో ఏజెన్సీ నిర్వాహకుడు ఫణీంద్రగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కనీసం 50 లీటర్ల నూనె ఉంటే ఏజెన్సీ వారే వచ్చి తీసుకువెళతారు. ఆరోగ్యాన్ని కాపాడటం, పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడం, విలువైన ఇంధనాన్ని ఉత్పత్తి చేయడం అనే త్రిముఖ లక్ష్యాలతో 'రుకో' ఒక అద్భుతమైన కార్యక్రమంగా నిలుస్తోంది. హైదరాబాద్‌లోని రెస్టారెంట్ల వారు ఈ పథకంలో చేరడానికి జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారి భానును 83283 78502 నంబరులో సంప్రదించవచ్చునని ఫణీంద్రగౌడ్ తెలిపారు.

# జనగామలో పగటి వేషగాళ్లు కోతుల కట్టడికి చింపాంజీలు

వరంగల్ (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28

కోతుల బెడద నుండి విముక్తి కోసం మున్సిపల్ అధికారులు మెదడుకు పదును పెడుతున్నారు..ఇంతకు మించిన మార్గం లేదని సరికొత్త ఆలోచనలతో కోతులను భయపెట్టి తరిమేందుకు వింత వింత వేషాలు వేయాల్సి వస్తుంది..ఈ మున్సిపల్ అధికారులు ప్రత్యేకంగా కోతులను తరిమేసేందుకు సిబ్బందిని నియమించి వారికి చింపాంజీ వేషం వేసి పట్టణమంతా తిప్పుతున్నారు.. చింపాంజీ వేషధారణతో కోతులను తరిమేసి తాత్కాలిక ఉపశమనం పొందుతున్నారు.. మున్సిపల్ సిబ్బంది పగటి వేషాలు, చింపాంజీ వేషధారణ అక్కడ పట్టణమంతా హాట్ టాపిక్ గా మారింది.. ఇప్పటివరకు మనుషులను భయపెట్టే చింపాంజీలని మాత్రమే చూశాం.. కానీ ఇక్కడ మాత్రం కోతులను భయపెట్టేందుకు మున్సిపల్ సిబ్బంది పగటివేషాలు వేయాల్సి వచ్చింది.. చింపాంజీ మాస్కుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి మాస్కులు ధరించాల్సిన దుస్థితి ఏర్పడింది.. చింపాంజీ వేషాలు వేసుకున్న జనగామ మున్సిపల్ సిబ్బంది కోతులను పరుగులు పెట్టిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడేందుకు నానా తంటాలు పడుతున్నారు. జనగామ పట్టణం చుట్టూ గుట్టలు ఎక్కువగా ఉండటంతో కోతుల బెడద విపరీతంగా పెరిగిపోయింది. వేలాది కోతులు పట్టణ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.. ఇళ్లలోకి చొరబడి రక్కి గాయపరుస్తున్నాయి.. ఒంటరిగా తిరగలేని పరిస్థితి నెలకొంది.. ఈ నేపథ్యంలో ప్రజల నుండి ఫిర్యాదులు వెల్లువెత్తాయి.. కోతుల నుండి మా ప్రాణాలు కాపాడండి మొర్రో అని వేడుకుంటున్నారు.. వానరసేనల దాడుల నుండి ప్రజల ప్రాణాలను రక్షించేందుకు జనగామ మున్సిపల్ శాఖ అధికారులు ఇంతకు మించిన మార్గం కనిపించలేదు.. వినూత్న ప్రయోగం సత్ఫలితాలను ఇస్తుంది.. మున్సిపల్ కమిషనర్ కు వచ్చిన ఆలోచనతో కోతులను భయపెట్టేందుకు చింపాంజీ రూపంలో సిబ్బందికి వేషాలు వేయించారు.. ప్రత్యేకంగా నిధులు వెచ్చించి చింపాంజీ మాస్క్ లు తెప్పించారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ కార్మికులు ఇలా చింపాంజీ వేషాలు ధరించి కోతులను పరుగులు పెట్టిస్తున్నారు..

# మొంతా తుఫాన్ నేపథ్యంలో గుడివాడ విపత్తు స్పందన & అగ్నిమాపక శాఖ ముందస్తు సన్నాహకాలు

## ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం: అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ ఆంజనేయులు

మొంతా తుఫాన్ నేపథ్యంలో గుడివాడ విపత్తు స్పందన ఢ అగ్నిమాపక శాఖ ముందస్తు సన్నాహకాలు చేపట్టింది. గుడివాడ అగ్నిమాపక శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డిస్టిక్ ఫైర్ ఆఫీసర్ ఆంజనేయులు నేతృత్వంలో మంగళవారం ఉదయం సన్నాహక కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా అత్యవసర వేళల్లో వెలుగును అందించే ఆస్కా లైటింగ్ యంత్రాన్ని అధికారులు పరీక్షించారు. ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు అవసరమైన యంత్ర, సహాయక పనిముట్లను బృందాల వారీగా సిబ్బంది సిద్ధం చేసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ ఆంజనేయులు మీడియాతో మాట్లాడుతూ... తుఫాను సమీపిస్తున్న వేళ ప్రజలకు సహాయంగా గుడివాడలో ఎనిమిది బృందాలను సిద్ధం చేసామన్నారు. ఈ బృందాలు ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ప్రజలకు సమస్యలు తలెత్తితే ప్రభుత్వ టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందిస్తే వేగవంతంగా ఘటన స్థలానికి చేరుకునేలా సిద్ధంగా ఉన్నట్లు ఆంజనేయులు పేర్కొన్నారు. తుఫాన్ విపత్తు వివరాలను ప్రభుత్వ బులిటెన్ ద్వారా ఎప్పటికప్పుడు గుర్తింపు పొందిన చానల్స్, మీడియా సంస్థల ద్వారా



సమాచారం అందిస్తుందని, సోషల్ మీడియాలో వ్యాప్తి అవుతున్న నకిలీ పోస్టులను ప్రజలు నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజలు కూడా ప్రభుత్వ సూచనలు పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని, ప్రజల సంక్షేమానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు అగ్నిమాపక శాఖ అన్ని విధాలుగా సహాయంగా ఉంటుందని ఈ సందర్భంగా ఆంజనేయులు ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఓ మహబూబ్ సుభాని, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తుఫాన్ నేపథ్యంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పర్యటన

విశాఖపట్నం అక్టోబరు 28,తుపాను నేపథ్యంలో విశాఖ జిల్లా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు రుషికొండ, సీతకొండ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా అధికారులు, పార్టీ శ్రేణులు నిరంతరం అప్రమత్తతతో సహాయ క చర్యలకు సిద్ధంగా సూచించారు. బీచ్ లలోకి సందర్శకులను వెళ్లని వ్వకుండా కట్టడి చేయాలన్నారు. రాళ్లు రోడ్డుపైకి పడే కొండ ప్రాంతాల పై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ప్రభుత్వం అన్ని రకాలు గా ప్రజలకు అండగా ఉంటుందని, తుపాను తీవ్రత ఎక్కువగా ఉన్నం దున అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని తెలి పారు.

# పునరావాస కేంద్రాలను పరిశీలించిన ప్రజాప్రతినిధులు

కాకినాడ (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28

మొంథా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ తో కలిసి సందర్శించారు. కాకినాడ రూరల్,నియోజవర్గంలోని పగడాలపేట ఉప్పలంక ప్రాంతంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, వైద్య శిబిరం వంటి అంశాలపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు.

# ఇందిరమ్మ ఇండ్లకు...ఇసుక గండం

-వర్షాల కారణంగా... ఇసుక దొరకడం కష్టంగా మారింది
-ఆన్లైన్ బుకింగ్ ఎప్పుడొస్తుందో తెలియదు
-బ్లాక్ లో ట్రాక్టర్ ఇసుక 7000 నుండి 10,000 వరకు
-సమస్యలన్నీ తెలిసి కూడా నిర్మాణానికి లబ్ధిదారులను తొందర పెడుతున్న అధికారులు
సూర్యాపేట జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లపై ప్రత్యేక కథనం

సూర్యాపేట జిల్లా ప్రతినిధి, (కందుకూరి యాదగిరి)అక్టోబర్ 28: సూర్యాపేట జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక గండం పట్టుకుంది. ఎప్పుడైతే ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను నిర్మాణం చేసుకోమని ఆదేశాలు జారీ చేసిందో అప్పటినుండి వారంలో రెండు రోజులైనా వర్షాలు కురుస్తున్నాయి. అసలే వర్షాకాలం కావడంతో జిల్లాలో ప్రధానంగా ఇసుక లభించే మూసి నది వర్షాల కారణంగా హైదరాబాదు నుండి మొదలుకొని హాలియా వరకు వరద ఉధృతి రావడంతో మూసి నదికి సమీపంలో ఉన్న గ్రామాలు రోడ్లు ఇసుక రవాణా చేసే ప్రాంతాలకు పలు సమస్యలు తలెత్తుతున్నాయి. ఇసుక రవాణా చేసే వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడం ఇసుక సమస్యకు ప్రధాన కారణంగా చెప్పొచ్చు. దీంతో లబ్ధిదారులు గృహాలను నిర్మించుకోవాలంటే నానా సమస్యలు పడాల్సిన పరిస్థితి వస్తోంది. ప్రభుత్వం ఇసుక ఉచితంగానే ఇస్తున్నామని చెబుతున్నప్పటికీ అది ఇంటికి చేరేవరకు సుమారుగా 4000 వరకు ఖర్చు వస్తుందని అది అనుకున్న సమయంలో రాకపోవడం లబ్ధిదారులకు ఏం చేయాలో తోచని అయోమయ స్థితిలో పడ్డారు. కొందరు ముగ్గులు పోసి ఇసుక కోసం ఎదురు చూస్తుంటే ఇంకొందరు బేస్మెంట్ లెవెల్ గోడల వరకు స్లాబ్ లెవెల్ వరకు ఇలా ఇసుక దొరికినప్పుడల్లా ఇండ్ల నిర్మాణాలు చేపడుతున్నారు.

బ్లాక్ లో 7000 నుండి 10,000 వరకు

ఇదిలా ఉంటే జిల్లాలో ఇసుక దందాకు అలవాటు పడిన వాళ్ళు గతంలో డంపింగ్ యార్డ్ లలో ఇసుక పోసుకొని అదును చూసి ప్రస్తుతం గుట్టుచప్పుడు కాకుండా బ్లాకులో ట్రాక్టర్ 7000 నుండి 10,000 వరకు వికరిస్తున్నారు.చేసేది ఏమీ లేక పోతే పోనీ అనుకొని కొందరు లబ్ధిదారులు పైన చెప్పిన విధంగా డబ్బులు వెచ్చించి బ్లాక్లో కొంటున్నారు. రెండు వేలకు ట్రాక్టర్ ఇసుక తెప్పించుకున్న రోజుల నుండి బ్లాకులో 10000 పెట్టి కొనాలంటే లబ్ధిదారులు ఇబ్బందులు



పడుతున్నారు. ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు అధికారులు పట్టి పట్టనట్లుగా ఉండకుండా సమస్య ఎలా పరిష్కరించాలో ఆలోచించి లబ్ధిదారులకు ఇసుకను సమయానికి అందించే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు

సరిపోను ఇసుక ఒకేసారి పంపించాలి

లబ్ధిదారులను ఇన్ని సమస్యలు పెట్టే బదులు ఆయా లబ్ధిదారులకు ఎంత ఇసుక పడుతుందో అంత ఒకేసారి ప్రభుత్వం అధికారులు ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని ఇసుకను రవాణా చేయించాలని కోరుతున్నారు. లేదా ఎవరైనా కాంట్రాక్టర్లను ఏర్పాటు చేసి పూర్తిగా 5 లక్షల లోపు ఎంతైతే అంత ఇంటి నిర్మాణం చేపట్టి ఇస్తే సమస్య ఉండదు కదా అని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇచ్చినట్టే ఇచ్చి ఇన్ని సమస్యలు ఎందుకు పెట్టాలి అని బాధపడుతున్నారు.

ఆన్లైన్లో ఎప్పుడు వస్తుందో?

ఆన్లైన్లో బుక్ చేస్తే ఇసుక ఎన్ని రోజులకు వస్తది అసలు వస్తుందో?లేదో? తెలియని అయోమయ పరిస్థితిలో లబ్ధిదారులు ఉన్నారు.

చేతివాటం ప్రదర్శిస్తున్న సిబ్బంది?

ఇదిలా ఉంటే జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల నుండి క్రింది స్థాయి సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వినపడుతున్నాయి.ఇంటి నిర్మాణ స్థాయిని బట్టి బిల్లులు రావాలంటే ఫోటోలు తీసుకొని పోయే సమయంలో వచ్చిన క్రింది స్థాయి సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా నూతనకల్లు మండలంలో ఈ సమస్య ఎక్కువగా ఉందని తెలుస్తోంది.ఈ విషయంపై ఉన్నత స్థాయి అధికారులు దృష్టి సారించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. చేతులు తడిపితే నిర్మాణం ఎలా ఉన్నా ఫోటోలు తీసుకొని ఆన్లైన్లో చేస్తున్నారని అంటున్నారు.అన్ని కరెక్ట్ గా ఉన్నాయి మేమెందుకు ఇవ్వాలి అని ప్రశ్నించిన వారికి ఏదో ఒక వంక పెట్టి గవర్నమెంట్ రూల్స్ ప్రకారంగా నిర్మించలేదని ఇది పై స్థాయి అధికారులు తమపై సీరియస్ అవుతారని రకరకాల కారణాలు చెబుతూ అలాంటి వారిని ఇబ్బందులు పెడుతున్నారని సమాచారం అందుతుంది.

వీలైనంత తొందరగా ఇండ్ల నిర్మాణం ప్రారంభించుకోవాలి

కాగా లబ్ధిదారులు వీలైనంత తొందరగా ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించుకోవాలని లేనిపక్షంలో ప్రభుత్వం తర్వాత తీసుకోబోయే చర్యలకు బాధపడాల్సిన పరిస్థితి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఏ సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని అంటున్నారు. జిల్లాలో 4 కాన్స్టెన్సీలు మున్సిపాలిటీలలో మొదటి విడత రెండవ విడత మొత్తం 12,868 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా అందులో 7981 మందికి ఇల్లు ఇవ్వడం జరిగిందని అధికారులు చెబుతున్నారు. ఇందులో ముగ్గు పోసుకున్న వారి సంఖ్య 5301 మంది ఉండగా బేస్మెంట్ లెవెల్ 1800 మంది గోడ నిర్మాణాల లెవెల్ 339 మంది స్లాబ్ లెవెల్ 793 నిర్మించుకున్నారు. ఇక పూర్తిస్థాయి లో నిర్మించుకున్నది 50 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇందుకు గాను ఇప్పటివరకు విడుదల చేసిన నిధులు 51 కోట్ల 60 లక్షలు అని అధికారుల నుండి సమాచారం అందింది.

ఏది ఏమైనా జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఇసుక సమస్య లేకుండా చూడాలని లబ్ధిదారులు వాపోతున్నారు.ఈ విషయంలో ప్రత్యేకంగా కలెక్టర్ చొరవ చూపాలని కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో అవకాతవకలు రాకుండా చూసుకోవాలి- జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28: మంగళవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి కొనుగోలు కేంద్రాల తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు.సదా శివనగర్ మండల కేంద్రం, రామారెడ్డి మండలంలోని ఉప్పల్ వాయి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వాతావరణ శాఖ సూచనల మేరకు తుఫాను ప్రభావం వలన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలో అన్ని వరి కొనుగోలు కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లను చేయాలనీ, రైతులు నష్టపోకుండా, ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లతో పాటు అవసరమైన సౌకర్యాలు వెంటనే వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి అధికారులను ఆదేశించారు.రానున్న రోజుల్లో వర్ష ప్రభావంతో అవసరమైతే వరి కోతలు జరపకుండా రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కాగా, కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు ధాన్యం పంపిన వెంటనే దిగుమతి చేసుకునేలా పర్యవేక్షణ జరపాలని అన్నారు. కేంద్రాల వద్ద వడ్ల కాంటాలను పరిశీలించి, వాతావరణం బాగలేనందున కాంట వేసిన బస్తాలు సంరక్షించుకోవాలని సెంటర్ ఇంఛార్జీకి, సంఘ కార్యదర్శికి సూచించారు. కొనుగోలు కేంద్రాలను రైతుల తమ పంటను తీసుకోవచ్చేటప్పుడు నాణ్యత ప్రమాణాలు, తేమ శాతం ,తదితర పాటించాలని , వర్షం వచ్చే అవకాశాలు ఎక్కువగా



ఉన్నందున వడ్ల కుప్పలు వర్షానికి తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అలాగే రైస్ మిల్లు వద్ద వడ్ల సంచులు దించుకున్న వెంటనే, రిసిప్ట్ పొంది వెంటనే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయవలసిందిగా సెంటర్ ఇంఛార్జీకి సూచించారు.జిల్లాలో మొత్తం 427 కేంద్రాలు, 233 ఫాక్స్ కేంద్రాలు, 193 ఐకెపి, గ్రేడ్ ఎ రకం రూపాయల క్వింటాలుకు 2389, సాధారణ రకం క్వింటాలుకు 2369ఈ కార్యక్రమంలో డిప్యూటి కలెక్టర్ రవితేజ, డిఆర్ఓ మదన్ మోహన్, డిసిఓ రామ్మోహన్, క్లస్టర్ ఆఫీసర్ లక్ష్మణ్, డిఎం, డిసిఎస్ఓ, (సిఎస్) ఏఓ, ఏఇఓ సంఘ కార్యదర్శులు, సెంటర్ ఇంఛార్జీలు పాల్గొన్నారు.

## "పుణ్య కార్యాలకు పరమ పవిత్ర మాసం కార్తికం"

### ప్రముఖ ప్రవచనకర్త, ఆధ్యాత్మిక విశ్లేషకులు: బ్రహ్మశ్రీ చౌడూరి నరసింహారావు

హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి,అక్టోబర్ 28:సనాతన హైందవ ధర్మంలో హిందువులకు ఈ కార్తిక మాసం అత్యంత పవిత్రమైనదని, ఈ మాసం అన్ని పుణ్య కార్యాలకు నెలవైనదని, ప్రతిరోజూ పండుగ వాతావరణం కనిపిస్తుందని, స్నానాలకు, దానాలకు, అర్చనలకు ఎంతో ప్రత్యేకమని, శరణు ఘోషలతో అయ్యప్ప స్వామి దీక్షలకు ఎంతో పవిత్ర కాలమని, తెలుగు నెలలలో ఎనిమిదవ మాసమైన కార్తిక మాసానికి సమానమైన మాసం ఏదీ లేదని ప్రముఖ ప్రవచన కర్త, ఆధ్యాత్మిక విశ్లేషకుడు బ్రహ్మశ్రీ చౌడూరి నరసింహారావు అభిప్రాయపడ్డారు. ఈ మాసంలో దాదాపుగా అన్ని పుణ్య తిథుతులను తమ ప్రవచనంలో ప్రస్తావిస్తూ.. చౌడూరి నరసింహారావు చంద్రుడు పూర్ణుడై కృత్తికా నక్షత్రంతో కూడి ఉండుటచే ఆ పౌర్ణమికి కార్తిక పౌర్ణమి గా, మాసాన్ని కార్తిక మాసంగా పేర్కొనవచ్చు అన్నారు. ఈ కార్తికం లో హరిహరుల దేవాలయాల్లో, అంబిక మందిరాల్లో, మఠాల్లో ఇలా అన్నిచోట్ల ఆయా దేవి దేవతలకు అభిషేకాలు పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. అన్ని దేవాలయాలు మఠ మందిరాలు దీప కాంతులతో వెలుగులీనే మాసం కార్తీక మాసమని, ఈ మాసంలో చేసే వన భోజనాలకు విశేషమైన ప్రాధాన్యత ఉన్నదని, ఈ వన భోజనాలు అనే పదంలో వనం అంటే అమర కోషంలో 'మాట' అని ఉన్నదని, షడ్రసోపేతమైన భోజనాలను చేస్తూ, మంచి మాటలను వింటూ, మనసులో వైరాగ్య భావాన్ని పెంచుకుంటూ జీవించాలని చెప్పే తాత్వికచింతనతో కూడినది వనభోజనాలని, మామిడి, తులసి, ఉసిరి వృక్ష సముదాయాల్లో వనభోజనాలు నిర్వహిస్తారని, వనభోజనాల గురించి వేదవ్యాసుడు చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా ఉదాహరిస్తూ ప్రవచన కర్త కార్తిక వైశిష్ట్యాన్ని గురించి గంటన్నర పాటు సుదీర్ఘంగా ప్రసంగించారు. సభ్యులంతా వారి ప్రసంగాన్ని కరతాళ ధ్వనులతో అభినందించారు. కార్తిక మాసం సందర్భంగా తొలి కార్తిక సోమవారం నాడు వనస్థలిపురం శారదా నగర్ లోని శ్రీ పంచముఖ వీరాంజనేయ స్వామి దేవాలయ కమిటీ మరియు వనస్థలిపురం భక్త సమాజం సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బ్రహ్మశ్రీ చౌడూరి నరసింహారావు 'కార్తిక వైశిష్ఠం' పై కీలకమైన ప్రవచనం చేశారు. ప్రవచనానికి ముందు శ్రీ పంచముఖ వీరాంజనేయ స్వామి దేవాలయం కమిటీ సభ్యులు శ్రీ సుబ్బారావు మరియు శ్రీ యజ్ఞ భగవాన్ లు ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చౌడూరి నరసింహారావు ను పుష్పమాలాలం కృతులను చేశారు. ప్రవచనానంతరం ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చౌడూరి నరసింహారావు దంపతులకు పుష్పమాలతో, శాలువాతో నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో శ్రీ పంచముఖ వీరాంజనేయ స్వామి దేవాలయ కమిటీ సభ్యులు శ్రీ సుబ్బారావు, శ్రీ జగన్నాధ రావు, కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డ్ సభ్యులు శ్రీ సిరిపురం అప్పారావు, తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మచార్య శ్రీ సుగ్గున శ్రీరాములు, విశ్వహిందూ పరిషత్ గోరక్షా విభాగం కేంద్ర కార్యకారిణి శ్రీ టి. యాదగిరి రావు, ఆధ్యాత్మిక వేత్త శ్రీ యజ్ఞ భగవాన్, వనస్థలిపురం భక్త సమాజం అధ్యక్షులు, కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు శ్రీ సి హెచ్. వి. ఆర్. కె. మూర్తి, శ్రీ పంచముఖ వీరాంజనేయ దేవాలయ అర్చకులు శ్రీ చిట్టా ప్రగడ రాజశేఖర్ మరియు మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా వనస్థలిపురం భక్త సమాజం అధ్యక్షులు శ్రీ సి హెచ్ ఆర్ కె మూర్తి వందన సమర్పణతో సభ ముగిసింది.



## గన్నవరం ఎయిర్ పోర్టు లో అగ్ని ప్రమాదం

గన్నవరం (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28
గన్నవరం ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్లో మంగళవారం అగ్నిప్రమాదం సంభవించింది. ఎయిర్పోర్ట్ లోని కస్టమ్స్ అధికారుల గదిలో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో సాఫ్ వేర్ బాక్సులు, ఇమ్మిగ్రేషన్ గదిలోని స్ప్లిట్ ఏసీ, కస్టమ్స్ అధికారుల లగేజీ బ్యాగులు మంటల్లో దగ్ధమయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన ఎయిర్ పోర్ట్ ఫైర్ సిబ్బంది, మంటలను అదుపులోకి తేవడంతో పెను ప్రమాదం తృటిలో తప్పింది.
==========================

## జోగిపేటలో భారీ వర్షం.. తడిసి ముద్దయిన ధాన్యం

సంగారెడ్డి (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28
ఆందోల్ మండల్ జోగిపేట మార్కెట్ యార్డులో నిన్న రాత్రి కురిసిన భారీ అకాలవర్షానికి ఆరబెట్టిన రైతన్నల వరి ధాన్యం తడిసి భారీ నష్టం వాటిల్లింది. సమయానికి టాపర్లు అందక భారీగా నష్టపోయామని రైతన్నలు అంటున్నారు. నోటికి వచ్చిన ధాన్యం కాస్త అకాల వర్షానికి నీటి పాలైంది అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతన్నల కష్టం తెలుసుకొని సరైన మద్దతు ధర ఇచ్చి ఆదుకోవాలన్నారు.
==========================

## మేడారంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి సీతక్క

త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు

ములుగు(భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28
ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో మంత్రి సీతక్క పర్యటించారు.మేడారం సమ్మక్క సారలమ్మ లను ములుగు ఎస్పీ శబరిష్ తో కలసి మంత్రి సీతక్క దర్శించుకున్నారు.మేడారంలో జరుగుతున్న జరుగుతున్న దేవాలయ నిర్మాణ విస్తరణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. మహా జాతరకు సమయం దగ్గర పడుతుండడంతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని మంత్రి సీతక్క అన్నారు. పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. అనంతరం అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. సీతక్క మాట్లాడుతూ జంపన్న వాగు వద్ద భక్తుల కు బాథింగ్ గాట్స్ పనులను పూర్తి చేయాలని, జాతర ప్రాంగణంలో పారిశుధ్య పనుల పై అధికారులు దృష్టి సారించాలని మంత్రి అన్నారు. పార్కింగ్ , రోడ్డు భద్రత , జాతరలో ట్రాఫిక్ నియంత్రణ పై పోలీస్ అధికారులు దృష్టి సారించాలని ములుగు ఎస్పీ శబరిష్ తో మంత్రి చర్చించారు.

## నవోదయ కోచింగ్ సెంటర్లపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్

ఎమ్మిగనూరు (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28ఎమ్మిగనూరు పట్టణంలో అక్రమంగా నిర్వహిస్తున్నటువంటి నవోదయ కోచింగ్ సెంటర్లపై విచారణ జరిగి నెలలు గడుస్తున్న పట్టించుకోని డిఇఓ పై చర్యలు తీసుకుని నవోదయ కోచింగ్ సెంటర్లను మూసివేయాలంటూ ఈరోజు విద్యార్థి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కర్నూల్ కలెక్టర్ గారికి ఫిర్యాదు చేయడం జరిగింది కావున కలెక్టర్ దీనికి స్పందించి డీఈఓ గారిని పిలిచి ఆయన పైన ఆగ్రహానికి గురి కావడం జరిగింది మీరు పది రోజుల్లో గా ఆ నవోదయ కోచింగ్ సెంటర్లలో ఎంతమందివిద్యార్థులు ఉన్నారో వారు ఏ ఏ పాఠశాలలో చదువుతున్నారో ఆయా పాఠశాల హెచ్ఎం లకు ఎంఈఓ ల ద్వారా నోటీసులు జారీ చేయమని అదేవిధంగా అక్రమంగా నడుపుతున్న ఆ కోచింగ్ సెంటర్ యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయమని ఆమె ఆదేశించడం జరిగింది ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు ఆఫ్రిది ఉదయ్ శేఖర్ రఘునాథ్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రాణాలతో వ్యాపారం చేస్తూ నా విక్టరీ,టాపర్, విన్నర్, గురు, సాయివిజ్ఞాన్, వి.వి,ఆజాద్ తదితర నవోదయ కోచింగ్ సెంటర్లు విద్యార్థుల ప్రాణాలను హరించి వేస్తున్నారు అని కాకుండా ఈ కోచింగ్ సెంటర్లలో విద్యార్థులను చాలా మానసికా ఉల్లాసాన్ని దూరం చేసి తమ స్వలాభం కోసం తమ జేబులను నింపుకోవడానికి విద్యార్థుల ను ఇబ్బంది పెడుతూన్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఇవే కాకుండా విద్యార్థులకు సరైన వసతి మరియు నాణ్యమైనభోజనం కల్పించకపోయిన విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుండి 70 వేల నుండి 80 వేల వరకు వసూలు చేస్తూ విద్యార్థులు తల్లిదండ్రులను మోసం చేయడం జరుగుతుందని మరియు పాఠశాల సమయంలో పాఠశాలల్లో ఉండాల్సిన విద్యార్థులు ఈ కోచింగ్ సెంటర్ లో ఉండడం జరుగుతుందని ఇది ప్రభుత్వా నియమ నిబంధనల ప్రకారం బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి అని ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాలు చేస్తూ ఉంటే వారు మాత్రం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం సరికాదు అని వారు హెచ్చరించారు ఇకనైనా అధికారులు స్పందించి ఈ కోచింగ్ సెంటర్ల దందాను మరియు కోచింగ్ సెంటర్లను సీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు లేనిపక్షంలో మరిన్ని ఉద్యమాలకు పూనుకుంటామని వారు హెచ్చరించారు

## రాచకొండ జోన్ పరిధిలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

సైకిల్ ర్యాలీలలో ఉత్సాహంగా పాల్గొన్న పోలీసు అధికారులు

రాచకొండ (భారత శక్తి ప్రత్యేక ప్రతినిధి) అక్టోబర్ 28:పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఐపిఎస్ ఆదేశాల మేరకు రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్, యాదాద్రి భువనగిరి, మల్కాజిగిరి, మహేశ్వరం జోన్ ల డీసీపీల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీలు నిర్వహించారు. ఈ వారం రోజుల్లో రాచకొండలో బ్లడ్ డొనేషన్ క్యాంప్ లు, ఎస్ఏ రైటింగ్ కాంపిటీషన్, షార్ట్ ఫిలిం కాంపిటీషన్, ఫోటోగ్రఫీ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ ర్యాలీలలో పోలీసులతో పాటు ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారికి డయల్ -100, రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలు, పోక్సో చట్టం, మరియు సీసీ కెమెరాల ఉపయోగాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అక్టోబర్ 21 నుండి ఈనెల వరకు 31 వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసులకి పది రోజులపాటు సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నారని అధికారులు తెలిపారు.


అలాగే రోడ్డు భద్రత గురించి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని, హెల్మెట్ లేకుండా డ్రైవ్ చేయవద్దని, లైసెన్స్, రిజిస్ట్రేషన్ లేని వాహనాలను నడపవద్దని సూచించారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలను నడపకూడదని హెచ్చరించారు. ప్రమాదం జరిగినప్పుడు బాధితులకు ప్రథమ చికిత్స అందించడం గురించి, అలాగే గ్రామాల్లో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు.సైబర్ నేరాల గురించి ప్రజలను అప్రమత్తం చేస్తూ, ఎవరైనా మోసాలకు గురైనప్పుడు వెంటనే 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు విద్యార్థులు ఉత్సావంతంగా పాల్గొని పోలీసులకు నివాళులు అర్పించారు.

## అల్లకల్లోలంగా నరసాపురం తీరం

నరసాపురం అక్టోబరు 28,
మొనీధ తుఫాన్ ప్రభావంతో పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం సముద్రతీరం అల్లకల్లోలంగా మారింది మొగల్తూరు మండలం పేరుపాలెం నరసాపురం మండలం పి యం లంక వద్ద అలలు ఎగిసి పడుతున్నాయి. పేరుపాలెం బీచ్ ని పోలీసులు మూసివేశారు బీచ్ లో అవుట్ పోస్ట్ ఏర్పాటు చేశారు పీఎం లంక సముద్రం తీరం వద్ద కూడా ఎవరిని అనుమతించడం లేదు. ఈ రెండు మండలాల్లో ప్రస్తుతానికి 16 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈరోజు సాయంత్రనీ సముద్ర తీరాన నివాసం ఉంటున్న ప్రజల్ని ఈ పునరావసం కేంద్రాల వద్దకు తరలించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు ఇప్పటికే అన్ని పునరావాస కేంద్రాల వద్ద ప్రత్యేక అధికారులను నియమించి మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నియమించిన స్పెషల్ ఆఫీసర్ ప్రసన్న వెంకటేష్ జిల్లా అధికారులతో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

## రసాయన శాస్త్రంలో ఆర్.శ్రీనివాసరెడ్డికి పీహెచ్ డీ

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 28:



హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి ఆర్. శ్రీనివాసరెడ్డి డాక్టరేట్ కు అర్హత సాధించారు. 'రిలుజోల్, 2-(4-అమినోఫెనిల్) బెంజోథియాజోల్, సీరం అల్బుమిన్, డీఎన్ఏల పరస్పర చర్యపై'పై అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధన జీవసంబంధమైన స్థూల అణువులతో బెంజోథియాజోల్ అనలాగ్ ల పరమాణు పరస్పర చర్యలను అర్థం చేసుకోవడానికి విలువైన సహకారాన్ని అందిస్తోంది. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బిజయ కేతన్ సాహూ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.డాక్టర్ రెడ్డి అధ్యయనం రిలుజోల్, 2-(4-అమినోఫెనిల్) బెంజోథియాజోల్ ద్వారా డీఎన్ఏ, హ్యూమన్ సీరం అల్బుమిన్ (హెచ్ఎస్ఏ)లో ప్రేరేపించిన బైండింగ్ లక్షణాలు, థర్మోడైనమిక్ పారామితులు, నిర్మాణాత్మక మార్పులను అన్వేషించినట్టు తెలియజేశారు. మాలిక్యులర్ డాకింగ్ సిమ్యులేషన్ ల ద్వారా ప్రయోగాత్మక పరిశీలనలకు మరింత మద్దతు లభించింది. ఈ పరిశోధన ఫలితాలు హేతుబద్ధమైన ఔషధ రూపకల్పన, ఔషధ పంపిణీ వ్యవస్థలు, మెరుగైన జీవసంబంధ కార్యకలాపాలతో కొత్త హైబ్రిడ్ ఉత్పన్నాల అభివృద్ధిలో సంభావ్య అనువర్తనాలను కలిగి ఉన్నాయి.ఈ సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం, పలు ఇతర విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు డాక్టర్ శ్రీనివాసరెడ్డిని అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కాకినాడ జిల్లాలో తుఫాన్ ప్రభావం అధికం

కాకినాడ అక్టోబరు 28,
మొంథా తుఫాను ప్రభావం కాకినాడ జిల్లాలో అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో కాకినాడ కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా ప్రత్యేక అధికారి కృష్ణ తేజ, జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులతో జిల్లా ఇన్చార్జి మంత్రి నారాయణ సమీక్ష సమావేశం నిర్వహించారు..
ఈసమావేశంలో రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు, అమలాపురం కాకినాడ ఎంపీలు హరీష్ మాధురి, తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, కాకినాడ, పెద్దాపురం ఎమ్మెల్యేలు వనమాడి,కొండబాబు, నిమ్మకాయల చినరాజప్ప, పాల్గొన్నారు..
=======================

## తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో విప్ బొమ్మిడి నాయకర్ పర్యటన

మొగల్తూరు (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28
పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం మొగల్తూరు మండలాల్లో తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ పర్యటించారు . మొగల్తూరు మండలం పేరుపాలెం నరసాపురం మండలం పీఎం లంక గ్రామాలలో ఏర్పాటు చేసిన తుఫాన్ పునరావస కేంద్రాలను ఆయన సందర్శించారు. అనంతరం సముద్ర తీరానికి వెళ్లి ఎగిసిపడు సముద్ర కెరటాలను పరిశీలించారు ఈ సందర్భంగా నాయకర్ మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో 16 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు 15వేల మంది సముద్ర తీర ప్రాంత ప్రజల్ని కేంద్రాలకు తరలిస్తున్నామన్నారు తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉన్నందన్న అధికారులకు ప్రజలు సహకరించి సురక్షిత ప్రాంతాలలో ఉండాలని కోరారు

## 15 ఏళ్ళ బాలికపై సామూహిక అత్యాచారం

విజయవాడ అక్టోబరు 28, ఎన్టీఆర్ జిల్లాలోని చందర్లపాడు మండలంలో దారుణ ఘటన వెలుగు చూసింది. 15 ఏళ్ల బాలికపై నలుగురు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. చిన్న పిల్లలతో ఆడుకుంటున్న బాలికకు నలుగురు వ్యక్తులు జామకాయల ఆశ చూపి ఓ ఇంట్లోకి తీసుకెళ్లి ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. దీంతో బాలిక బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం: ఏఐసీసీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి -మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి



సూర్యాపేట, భారత్ శక్తి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 28:సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రైవేట్ ఆస్పత్రులలో పలు వ్యాధులతో చికిత్స పొందిన సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన వారికి 18 లక్షల రూపాయిలు విలువగల 35 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతోమంది అభాగ్యులు సకాలంలో చికిత్స పొందలేక ప్రైవేట్ ఆస్పత్రిలలో అప్పులు చేసి,ఖర్చు పెట్టుకున్న బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ కొండంత అండగా ఉందని ఆయన అన్నారు. పేదలకు ఖరీదైన శస్త్ర చికిత్సలను అందించడానికి ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందన్నారు.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రజా ప్రభుత్వం హయాంలో ఆరోగ్య శ్రీ పరిమితిని పది లక్షలకు పెంచారని తెలిపారు. సూర్యాపేట నియోజకవర్గంలో 200లకు పైగా ఎల్ఓసి లను సహాయ నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా సహాయ నిధులు మంజూరు చేపించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నల్గొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ,యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, కోతి గోపాల్ రెడ్డి, చింతమల్ల రమేష్, తూముల సురేష్, ధరావత్ వీరన్న నాయక్, నాగుల వాసు,అబ్దుల్ రహీం, అనంతుల యాదగిరి,సిద్ధిక్, రావుల రాంబాబు, సాయి నేత, ఆలేటి మాణిక్యం,లక్ష్మీ మకట్ లాల్, తదితరులు పాల్గొన్నారు.

## అప్రమత్తతతో సహాయక చర్యలపై దృష్టి సారించండి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



వై ఎస్ ఆర్ కడప,అక్టోబర్ 28(భారత శక్తి) : మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండడంతో రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి మట్టంపై అప్రమత్తంగా ఉంటూ సహాయక చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశారు .మొంథా తుఫాను వర్షాల పరిస్థితులను ఎదుర్కొనే సహాయక చర్యలు, సంసిద్ధతపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జేసీ అదితి సింగ్, జిల్లా స్థాయి అధికారులతో మంగళవారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పంట నష్టం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, అత్యవసర సహాయక చర్యలపై తగు సూచనలు చేశారు.ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారీవర్షాల కారణంగా జిల్లాలో అన్ని నదులు, రిజర్వాయర్లలో నీటి మట్టం పెరిగిందని, ఇంకా వరదనీరు పెరిగే అవకాశాలు ఉండడంతో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. రిజర్వాయర్లు, చెరువులపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం అన్ని ప్రాజెక్టులకు అధికంగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో అక్కడి ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను కూడా అప్రమత్తం చేయాలని, చెరువులకు గండ్లు పడకుండా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు నిరంతర నిఘా ఉంచాలన్నారు. ముందు జాగ్రత్తగా రిజర్వాయర్లు, చెరువులు, నదీ తీరప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. పరిస్థితులను బట్టి లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన సహాయక చర్యలను సిద్ధం చేసుకోవాలన్నారు. రెవెన్యూ డివిజన్ల వారీగా కంట్రోల్ రూములు,తాత్కాలిక పునరావాస కేంద్రాల ఏర్పాటు చేయడం జరిగిందని వరద సహాయక చర్యల కోసం ప్రత్యేక రక్షణ సిబ్బంది, రెస్క్యూ టీము, ఫైర్ సిబ్బంది, బోట్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జనరేటర్లు, మంచినీటి ప్యాకెట్లు, ఆహార ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ముందస్తుగా వైద్య సహాయక శిబిరాలను, అత్యవసర మందులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి జిల్లాలోని అన్ని ఏరియా ఆసుపత్రులు, పీహెచ్ సిలలో సకాలంలో డాక్టర్లు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అందుబాటులో ఉండాలని, బాలింతలు,గర్భిణీలను సురక్షితమైన ప్రాంతాల్లో ఉంచి ప్రత్యేక సంరక్షణ అందివ్వాలన్నారు. అన్ని గ్రామ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు.తాగునీరు కలుషితం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వర్షాకాలంలో అంటూ వ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రజారోగ్య భద్రతపై దృష్టి సారించాలన్నారు. గ్రామ, సచివాలయ కార్యదర్శులు సహాయక చర్యలను సిద్ధంగా ఉండాలన్నారు.వ్యవసాయ,ఉద్యానవన పంటల సాగు చేసే రైతులను అప్రమత్తం చేయాలని పంట నష్టం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై రైతులను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడా పాడి సంరక్షణకు, పశు నష్టం జరగకుండా పశు సంవర్ధక సహాయకులు బాధ్యత వహించాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయం అయితే వెంటనే దానిని పునరుద్ధరించేలా చర్యలు చేయపట్టాలన్నారు. పోలీసు, రెవెన్యూ, ఫైర్, విపత్తుల నిర్వహణ, రెస్క్యూ టీమ్ సిబ్బంది సమన్వయం తో ముందుకెళ్లాలన్నారు. ఇరిగేషన్ అధికారులు ఎప్పటికప్పుడు ప్రాజెక్టుల్లో నీటిమట్టంపై సమాచారం అందివ్వాలన్నారు. తెప్పలు, గాలి ట్యూబులు, మరబోట్లు లాంటి విపత్తు నిర్వహణ సహాక ఏర్పాట్లను సిద్ధంగా ఉంచాలన్నారు. తుఫాను ప్రభావం కారణంగా అధికంగా గాలులు వేయటం ద్వారా చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయే అవకాశాలు ఉన్నాయని విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అధిక వర్షాలు కురవడం వలనరిజర్వాయర్లు, నదులు, వాగులు, వంకలు, చెరువులు ఉప్పొంగే అవకాశాలు ఉన్నందున.. పరివాహక ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ అవసరమైన సహాయక చర్యలను అందించేందుకు సంబందిత సిబ్బందితో 24 గంటలు సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లా అధికారులు మొదలు నియోజకవర్గ, మండల, సచివాలయ, గ్రామ స్థాయి వరకు ప్రతి అధికారి సిబ్బంది వారి వారి ప్రధాన కార్య స్థానాలలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అన్ని రెవెన్యూ డివిజన్ల పరిధిలో పోలీసు, అగ్నిమాపక సిబ్బందితో పాటు రెస్క్యూ టీమ్ ను కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు.అత్యవసర సహాయ సమాచార నిమిత్తం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని కంట్రోల్ రూంతో పాటు కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవో కార్యాలయాల్లో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్ నెంబర్లను సద్వినియోగం చేసుకునేలా ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.

## రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలి: జిల్లా ఎస్పీ నరసింహ

సూర్యాపేట, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 28:
ప్రయాణాల సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రజలు జాగ్రత్త పడాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారుల నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించి గత నెలలో జరిగిన నేరాల స్థితిగతులను సమీక్షించారు. అనంతరం కేసు దస్త్రాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు సలహాలు అందించారు.నేర నిరూపణలో సిబ్బంది సాంకేతిక సామర్థ్యం కలిగి ఉండాలి, పిర్యాదులపై త్వరగా స్పందించి సంఘటనా స్థలానికి త్వరగా చేసుకోవాలి, రాత్రిళ్ళు పెట్రోలింగ్ పటిష్టంగా ఉండాలి, కేసులు పెండింగ్ లేకుండా వేగంగా దర్యాప్తు చేయాలి, కేసుల్లో నేరస్తులకు త్వరగా శిక్షలు పడేలా పని చేయాలి, పోక్సో కేసుల్లో, మహిళా సంభంద కేసుల్లో వేగంగా దర్యాప్తు చేసి కోర్టులతో సమన్వయంగా పని చేసి నేరస్తులకు శిక్షలు పడేలా కృషి చేయాలి. పోలీసు పని విభాగాల్లో సమర్థవంతంగా పని చేయాలి, పోలీసు వేగవంతమైన సేవలు అందించినప్పుడే ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని అన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో ఒక్క ప్రాణం కూడా పోకుండా సిబ్బంది పని చేయాలని ఈ సందర్భంగా దిశా నిర్దేశం చేశారు. నిత్యం తనిఖీలు నిర్వహిస్తూ వాహన దారులను ప్రజలను రోడ్డు భద్రత పట్ల అప్రమత్తం చేయాలని సూచించారు. నేరాల నివారణలో ప్రజలను




భాగస్వామ్యం చేస్తూ ఎక్కువ మొత్తంలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ప్రజలను, వ్యాపారులను ప్రోత్సహించాలి అని తెలిపినారు.ప్రయాణ సమయంలో ప్రజలు వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ప్రమాదాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వాహనాలపై నిలబడి ప్రయాణం, ఎక్కువ మంది ప్రయాణం చేయడం ప్రమాదమని గుర్తు చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు అక్రమ రవాణాలకు పాల్పడితే అలాంటి వారిని ఉపేక్షించమని హెచ్చరించారు.
లిపని విభాగాల నిర్వహణలో అధికారులకు రివార్డ్స్ అందించడం జరిగింది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ పని విభాగాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ గత నెలలో కేసుల దర్యాప్తు, ఇన్వెస్టిగేషన్ లో బాగా పని చేసిన కోదాడ పట్టణ ఇన్స్పెక్టర్ శివశంకర్ ను, సూర్యాపేట టూ టౌన్ ఎస్సై శివతేజ ను, అనంతగిరి ఎస్సై నవీన్ కుమార్ లను ఎస్పి అభినందించి రివార్డ్ అనించారు.
లిపోలీసు వాహనాల నాణ్యతను, కండిషన్ ను తనిఖీ చేసిన ఎస్పి నరసింహ బాధితులకు వేగవంతంగా పోలీసు సేవలు అందించడంలో పోలీసు వాహనాలు కీలకం అని ఎస్పి తెలిపినారు, పోలీసు వాహనాలను తనిఖీ చేశారు. ప్రజలకు సేవలు అందించే అవహనాలు పూర్తి కండిషన్ లో ఉండాలని వాటిని ఎక్కువ కాలం ఉపయోగించాలి ఎప్పటికప్పుడు నాణ్యత పరిశీలించుకోవాలి, సర్వీసింగ్ చేయించాలని డ్రైవర్లకు ఎస్పి సూచించారు. పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయాలని పోలీస్ మోటార్ ట్రాన్స్పోర్ట్ అధికారిని ఎస్పి గారు ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్, డిసిఆర్బి డిఎస్పి రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ హరిబాబు, ఇన్స్పెక్టర్లు శివశంకర్, ప్రతాప్ లింగం, రామకృష్ణా రెడ్డి, చరమందరాజు, నాగేశ్వరరావు, నరసింహారావు, రాజశేఖర్, వెంకటయ్య, సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఎస్సై లు, ఐటి కోర్ సిబ్బంది,డిసిఆర్బి సిబ్బంది ఉన్నారు.

## సదా శివనగర్ లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమునకు భూమి పూజ నిర్వహించిన జిల్లా కలెక్టర్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28: కామారెడ్డి జిల్లా సదా శివనగర్ మండల కేంద్రములో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమునకు భూమి పూజ, రామారెడ్డి మండలం ఉప్పల్ వాయి గ్రామంలోని ఇందిరమ్మ లబ్ధిదారుడి ఇంటి నిర్మాణం చేపడుతున్న తీరును జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు.ఇందిరమ్మ ఇంటి లబ్దిదారుడు అరటి మంగలక్ష్మీ లింబాద్రి నిర్మించుకుంటున్న ఇళ్లు దాదాపుగా ముగింపు దశలో ఉందని 20 రోజుల్లో పూర్తి చేసుకొని గృహప్రవేశానికి రెడీ అవుతుందన్నారు.లబ్ధిదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి ఇంటి నిర్మాణ పురోగతిని ఆరా తీసి, నాణ్యత ప్రమాణాలు పాటించి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆన్నారు.అంతకు ముందు సదా శివనగర్ లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమునకు మార్కవుట్ చేసిన లబ్ధిదారుని ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసి, ఇంటి నిర్మాణం త్వరగా పూర్తి చేసుకోవాలని అన్నారు.అలాగే మార్కావుట్ కానీ వాటిని వంద శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన లబ్దిదారులకు సొంతింటి కలను నెరవేర్చడం లో, పేద ప్రజలకు శాశ్వత నివాసం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్దిదారుల మోములో వెలుగులను నింపుతుందని లబ్ధిదారు అరటి మంగలక్ష్మీ లింబాద్రి సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి నిర్మూలనకు అందరూ కృషి చేయాలి : కలెక్టర్ ప్రావీణ్య




సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 28:
ఉద్యోగులు,నిజాయితీ, నిష్పక్ష పాతః ముగా , బాధ్యతాయుత భావనలతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అన్నారు.సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న విజిలెన్స్ అవగాహన వారోత్సవాల లో భాగంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాల్గొని, అధికారులతో కలిసి విజిలెన్స్ ప్రతిజ్ఞ చేయించి, విజిలెన్స్ అవగాహన పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ ం వృత్తికి విలువతెచ్చేది నైతికత అని , విధినిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాతత, నిజాయితీ విలువలను కాపాడడం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి యొక్క బాధ్యత అని అన్నారు. పారదర్శకత తో మంచి పాలన సాధ్యమవుతుందని, సమగ్రతతో సేవలందించడం ద్వారా ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవచ్చని ఆమె సూచించారు.ప్రతి శాఖాధికారి తన కార్యాలయంలో అవగాహన కార్యక్రమాలు, ప్రతిజ్ఞా కార్యక్రమాలు నిర్వహించి సిబ్బందిలో బాధ్యత, సమగ్రత విలువలను పెంపొందించాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో సి హెచ్ శ్రుత కీర్తి, ఎస్పి, రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్, ఆర్‌సీపురం యూనిట్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి , సతీష్ రెడ్డి, డీఎస్పి, వివిధ శాఖల అధికారులు, ఆర్‌సీపురం యూనిట్‌కు చెందిన విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్

సూర్యాపేట, భారత శక్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 28:
జిల్లాలో 48 గంటల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యపు రాశులపై రెండు రోజులు పాటు టార్పలిన్ పట్టాలు కప్పే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ నిర్వాహకులను,ఆదేశించారు.అదేవిధంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.మంగళవారం ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం, ఎన్ డి సి ఎం ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే అర్వపల్లి, వేల్పుచర్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు.ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ మెంథా తుఫాన్ ప్రభావం జిల్లాలో ఉన్నందున రెండు రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి పొలాలు కోయకుండా రైతులు సహకరించాలని, అలాగే ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరిన ధాన్యపు రాశులపై నిర్వాహకులు టార్పాలిన్ పట్టాలు ఉంచాలని సూచించారు.డి ఎస్ ఓ మోహన్



బాబు, డి ఎం రాము, తహసీల్దార్ శ్రీకాంత్,ఏ ఎస్ ఓ శ్రీనివాస్ రెడ్డి,ఆర్ ఐ శ్రీకాంత్ రెడ్డి, ఏ ఓ గణేష్, ఎ ఈ ఓ సత్యం, ఏ పి ఎం రాంబాబు, సెంటర్ ఇంచార్జి విజయ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.


## ప్రజలకు సుపరిపాలన అందించాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్




సూర్యాపేట, భారత శక్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 28:
ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు ప్రజలకు సుపరిపాలన అందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన విజిలెన్స్ అవగాహన వారోత్సవంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు సరియైన రీతిలో ప్రజలకు చేరే విధంగా అధికారులు పారదర్శకతతో,బాధ్యతగా విధులు నిర్వహించి నియమ నిబంధనలు పాటిస్తూ అర్హులైన వారిని మాత్రమే గుర్తించాలని కలెక్టర్ సూచించారు.విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ శాఖ క్షేత్రస్థాయిలోఅధికారులు విధి నిర్వహణలో ఏమైనా తప్పు చేసిన, లబ్ధిదారుల ఎంపికలో ఏమైనా అవకతవకలు జరిగిన లోతుగా విచారించి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.అధికారులు భాద్యతతో నిజాయితీగా,నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మంచిగా సేవ చేయాలని కోరారు.విజిలెన్స్ అవగాహన వారోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబర్ 27 నుండి నవంబర్ 2 వరకు నిర్వహించ బడుతుందని తెలిపారు.విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ శాఖ టో ల్ ఫ్రీ నెంబర్ 14432 గురించి ప్రజలకు తెలియజేయాలని సూచించారు.తదుపరి విజిలెన్స్ పోస్టర్ ను ఆవిష్కరించి అధికారులచే ప్రతిజ్ఞ చేపించారు.ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కె సీతారామరావు,విజిలెన్స్ అధికారులు దశరథ,రాంబాబు, జిల్లా అధికారులు హాజరైనారు.

## ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్

-విద్యార్థుల ప్రతిభకు ఫిదా
-చక్కని విద్యను అందిస్తున్న ఉపాధ్యాయులకు ప్రశంస




సూర్యాపేట,భారత శక్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 28:
ఆయనకు చదవంటే ప్రాణం. విద్యార్థులు అంటే ఇష్టం.ఆయన మన సూర్యాపేట జిల్లా బాస్ అయితేనెం విద్యార్థులు కనబడగానే తానొక ఉపాధ్యాయుడిగా మారిపోతాడు.ఆయనే మన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ .ఆయన ఎక్కడికి వెళ్లినా తప్పనిసరిగా ఒక పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటిస్తే కానీ తృప్తి చెందడు.చదువే అన్నింటికీ మూలమని ప్రగాఢంగా విశ్వసించే జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రతిరోజు తన పర్యటనలో భాగంగా ఒక పాఠశాలలను సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు తానే ఒక ఉపాధ్యాయుడిగా మారతారు.ఇందులో భాగంగానే మంగళవారం ఆయన సూర్యపేట జిల్లా, జాజిరెడ్డిగూడెం మండలం, రామన్నగూడెం ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. వెంటనే 4,5 తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. వారితో ఇంగ్లీషు చదివించి తెలుగులో అర్థాలను అడిగి తెలుసుకున్నారు. అంతటితో ఆగకుండా గణితంలో సంకలనం, వ్యవకలనం, గుణాంకాలను బోర్డు పై లెక్కలు చేయించి వారితోనే సమాధానాలు రాబట్టారు. ఒక ఉపాధ్యాయుడి మాదిరిగా ప్రతి విద్యార్థి నోట్ బుక్స్ తీసుకొని పరిశీలించారు. విద్యార్థులు ప్రతి ఒక్కరు సరైన సమాధానాలు చెప్పడం, చక్కగా రాయడం, మంచి ప్రతిభను చూపించడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ సంతోషంతో విద్యార్థులకు బహుమతులను అందజేశారు.ఉపాధ్యాయులంటే ఇలా ఉండాలి.ఉపాధ్యాయుల పనితీరు విద్యార్థులు చదువులోనే కనిపిస్తుంది. ఎప్పటికీ ఇలాగే బోధించండి. మంచి పేరు తెచ్చుకోండి" అని ఉపాధ్యాయులు ధర్మయ్య, నీరజ, సుధారాణి, వెంకన్న లను అభినందించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధిస్తుండడం పట్ల దానివల్ల విద్యార్థులు బాగా చదువుతూ ఉండడం పట్ల ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు.అభివృద్ధికి చదువే కారణం అని ప్రగాఢంగా విశ్వసించే జిల్లా కలెక్టర్ ప్రతి విద్యార్థికి కింది తరగతి నుండే చదవడం, రాయడం రావాలని, అలాగే గణితం, ఇంగ్లీష్ లాంటి సబ్జెక్టుల్లో కనీస పరిజ్ఞానం కలిగి ఉండాలని అప్పుడే ఉన్నత తరగతుల్లో ఆయా సబ్జెక్టులపై పూర్తి పట్టు సాధిస్తారని అంటారు. ఇందులో భాగంగానే ప్రతి పాఠశాలలో తాను వెళ్లినప్పుడు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించడం, ఉపాధ్యాయులకు ఆ విధంగా బోధించేలా చర్యలు తీసుకోవాలని సూచించడం చేస్తున్నారు .బాగా చదివే పిల్లలను ప్రశంసించడమే కాకుండా, నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేసి వారు ఇంకా బాగా చదివే విధంగా ప్రోత్సహిస్తున్నారు.ఆయన వెంట డి ఎస్ ఓ మోహన్ బాబు, డి ఎం రాము, తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ ఐ శ్రీకాంత్ రెడ్డి, ప్రధాన ఉపాధ్యాయులు ధర్మయ్య, ఉపాధ్యాయనీలు నీరజ, సుధారాణి, వెంకన్న తదితరులు ఉన్నారు.

## ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28: రామారెడ్డి తహసిల్దార్ కార్యాలయాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా భూ భారతి రెవెన్యూ సదస్సులలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.
అలాగే, (ఎస్ఐఆర్) ఎన్నికల నిబంధనల మేరకు శనివారం లోగా సమయానికి పూర్తిచేయాలని, ఎటువంటి లోపాలు లేకుండా నిబంధనల ప్రకారం క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు.
ఎస్.ఐ.ఆర్ అమలు కోసం చేపడుతున్న కసరత్తు గురించి మండలాల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. 2002 ఓటరు జాబితాలో 2025 ఓటరు జాబితాను జాగ్రత్తగా సరిచూసుకుని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్ణీత నమూనాలో వివరాలు రూపొందించాలని, తప్పిదాలకు తావు లేకుండా మ్యాపింగ్ పూర్తి చేయాలని అన్నారు. బీ ఎల్ ఓ సూపర్వైజర్లు ఒక్కో పోలింగ్ స్టేషన్



వారిగా బీ ఎల్ ఓ లతో స్వీయ పర్యవేక్షణలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పకడ్బందీగా జరిపించాలని అన్నారు.
ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మదన్ మోహన్, తహసిల్దార్ ఉమలత, రెవెన్యు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.







ఎల్బీనగర్, అక్టోబర్ 28 (భారత శక్తి ): పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం చైతన్యపురి సిఐ కె. సైదులు తన సిబ్బందితో పాటు ఓమ్ని హాస్పిటల్ సిబ్బంది, స్థానికులతో కలిసి పోలీస్ ఫ్లాగ్ డే ర్యాలీ నిర్వహించారు.చైతన్యపురి పోలీస్ స్టేషన్ నుండి ఓమ్ని చౌరస్తా, మోడల్ డైరీ చౌరస్తా, కొత్తపేట్ చౌరస్తా వరకు నిర్వహించారు.ఈ ర్యాలీలో దాదాపు 70 మంది పాల్గొని అమరులైన పోలీసులకు జోహార్లు అర్పించారు.

## రాక్ టౌన్ సొసైటీ ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలి

–తప్పుల తడకగా ఉన్న ఓటర్ల జాబితాను పారదర్శకంగా ఉండేలా సవరించాలి..



ఎల్బీనగర్,అక్టోబర్ 28 (భారత శక్తి): ఎల్బీనగర్ నియోజకవర్గంలోని రాక్ టౌన్ కాలనీలో నవంబర్ 16న జరుగనున్న కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ ఎన్నికలను సక్రమంగా జరపాలని సొసైటీ సభ్యులు, సీనియర్ జర్నలిస్టు మామిడి సోమయ్య సొసైటీ ఎన్నికల అధికారిని కోరారు. సొసైటీ ఓటర్ల జాబితాను పరిశీస్తే...పూర్తిగా తప్పుల తడకగా ఉందని, వెంటనే జాబితాను సవరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం సాయంత్రం స్థానిక సొసైటీ కార్యాలయంలో సొసైటీ ఎన్నికల అధికారికి వినతిపత్రం అందజేశారు. సొసైటీలో దాదాపు 863 మంది ఓటర్లు ఉండగా వీరిలో చాలా మంది బోగస్ ఓటర్లు ఉన్నట్లు తెలుస్తుందని, వందకు పైగా ఓటర్లకు సంబంధించిన చిరునామాలు గానీ, ఫోన్ నెంబర్లు గానీ లేవని ఆయన ఆరోపించారు. అంతే కాకుండా స్థానిక అడ్రస్ లో లేని ఓపెన్ ప్లాట్ యజమానులైన ఓటర్లను గుర్తించేందుకు ఎటువంటి ఆధారం లేకుండా బోగస్ ఓటర్లు ఓట్లు వేసే అవకాశం ఉందని, అలాంటి ఓటర్ల స్థానికతను నిరూపించే గుర్తింపు పత్రాలను ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. తప్పుల తడకగా ఉన్న ఓటర్ల జాబితాను సవరించి సొసైటీ ఎన్నికలు సక్రమంగా, సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన వారిని కోరారు.




ఎల్బీనగర్, అక్టోబర్ 28 (భారత శక్తి ) పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా సరూర్ నగర్ సిఐ వి. సైదిరెడ్డి తన సిబ్బందితో కలిసి మంగళవారం దిల్ సుఖ్ నగర్, పి అండ్ టి కాలనీలలో కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.పోలీసు అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప ఎన్నిక ప్రచారంలో ఏఎంసీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 28 (భారత శక్తి):
జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నిక సందర్భంగా రహమత్ నగర్ డివిజన్లో ముస్లిం సోదరులతో కలిసి మజీద్ ప్రాంతాలలో ప్రచారం నిర్వహించిన టీజీఎంఎఫ్సీ చైర్మన్ ఉబేదుల కొత్వాల్, టీజీఎంబీసీ చైర్మన్ జూపోతు జైపాల్, రహమత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ సీఎన్.రెడ్డి, గడ్డిఅన్నారం ఏఎంసీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి,రహమత్ నగర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ భవన్ శంకర్, పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పోలింగ్ బూత్ సభ్యులు, కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# జీవో 118 బాధిత కాలనీల వాసుల సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం : మధుయాష్కి గౌడ్

– బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ శివారు కాలనీలలో పర్యటన
– కాలనీవాసులతో కలిసి సీసీ కెమెరాలను ప్రారంభించిన మధుయాష్కి గౌడ్



ఎల్బీనగర్ :భారత శక్తి బి ఎన్ రెడ్డి నగర్ డివిజన్లో జీవో నం. 118 బాధిత కాలనీవాసులకు రిజిస్ట్రేషన్ల సమస్య పరిష్కారం మూడు నెలల్లో లభించనుందని.. ఇప్పటికే ఈ విషయంపై రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని కలిసి పరిష్కారం పై చర్చించినట్లు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ లోని సౌభాగ్యనగర్, బృందావన్ మిడోస్, ఏపీఆర్ క్రిస్టల్ విల్లాస్, జక్కిడి రామస్వామి కాలనీ, శ్రీనివాస కాలనీ తదితర కాలనీలలో ఈరోజు మధుయాష్కీ పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి గారు ఎంపీగా ఉన్నప్పుడు విడుదల చేసిన నిధులతో సౌభాగ్య నగర్ కాలనీలో ఏర్పాటుచేసిన సిసి కెమెరాలను మధుయాష్కి గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు మాట్లాడి తమ సమస్యలను వివరించారు. డ్రైనేజీ ట్రంక్ లైన్, రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని, వరద నీటి సమస్యలను తీర్చాలని కోరారు.

అనంతరం సౌభాగ్య నగర్ కాలనీలో వివిధ కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మధుయాష్కి మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికలకు ముందు నియోజకవర్గంలో అన్ని సమస్యలు పరిష్కారం అయ్యాయని గోడలకు పోస్టర్లు అంటించిన ఎమ్మెల్యే ఓట్లు వేయించుకున్నాడని, కానీ కాలనీలలో రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలు ఎక్కడివక్కడే ఉన్నాయని పేర్కొన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా ఎల్బీనగర్ నియోజకవర్గం లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎల్బీనగర్ నియోజకవర్గం లో రూ. 200 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్లోని శివారు కాలనీలకు డ్రైనేజీ రోడ్ల సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి గారి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక నిధులు మంజూరు చేయిస్తామని పేర్కొన్నారు. బి.యన్.రెడ్డి ప్రాంతంలో డబల్ టాక్స్ లు వస్తున్న విషయం పైన కూడా త్వరలో పరిష్కారం లభించనుందని, ఇప్పటికే జిహెచ్ఎంసి ఉన్నత అధికారులతో మాట్లాడినట్లు వివరించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల అనంతరం అధికారులతో రివ్యూ మీటింగ్ పెట్టించి శివారు కాలనీలో వాసులకు సమస్య లు తీరుస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జలమండలి డిజిఎం రాజగోపాల్ తో బి.ఎన్.రెడ్డి నగర్ శివారు కాలనీలో వాసులకు డ్రైనేజీ లైన్ల సమస్య పరిష్కారం పై చర్చించి పలు సూచనలు చేశారు. డ్రైనేజీ నూతన లైన్ల నిర్మాణానికి ప్రతిపాదన సిద్ధం చేసి తనకు చెప్పాలని.. సీఎంతో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తారని వివరించారు.

కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర్ రెడ్డి , బానోతు సుజాత నాయక్ , మాజీ కార్పొరేటర్ ముద్దగోని లక్ష్మీప్రసన్న గారు, పీసీసీ కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్ , డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు మకుటం సదాశివుడు గారు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుడ్డా సత్యనారాయణ, కాంగ్రెస్ నేతలు గణేష్ రెడ్డి గారు, విద్యా రెడ్డి , వినయ్ పటేల్ , ఎస్సీ సెల్ అధ్యక్షులు బోడ రాజశేఖర్ గారు, నారాయణ గౌడ్, కొత్త శ్రీధర్ గౌడ్, సౌభాగ్య నగర్ కాలనీ అధ్యక్షులు నందకిషోర్, ఆంజనేయులు, బృందావన్ మెడోస్ కాలనీ అధ్యక్షులు శశికాంత్, వేణు , ఏపిఆర్ క్రిస్టల్ విల్లాస్ సత్యనారాయణ, గాయత్రి నగర్ బ్యాంక్ కాలనీ అధ్యక్షులు భావన శ్రీనివాస్, మాజీ అధ్యక్షురాలు సరస్వతి, గాయత్రి నగర్ ఫేస్ 1 అధ్యక్షులు డాక్టర్ విజయ్ కుమార్, గాయత్రి నగర్ ఫేస్ – 2, అధ్యక్షులు చందు నాయక్, గాయత్రి నగర్ పేస్ –3 అధ్యక్షులు రాజు నాయక్, శ్రీనివాస కాలనీ అధ్యక్షులు చిత్తరంజన్, వెంకటేశ్వర కాలనీ అధ్యక్షులు కృష్ణ, రాంబాబు, భవాని ఎన్క్లేవ్ అధ్యక్షులు ప్రశాంత్, మహాలక్ష్మి కాలనీ అధ్యక్షులు యాదగిరి, జక్కిడి కాలనీ అధ్యక్షులు యాదిరెడ్డి, జక్కడి రాంరెడ్డి కాలనీ అధ్యక్షులు నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

# ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ జాతీయ సమైక్యతకు ప్రతీక: జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

– సర్దార్ వల్లభాయ్ పటేల్ భావితరాలకు స్ఫూర్తిదాయకం
– సర్దార్ ఏ 150 యూనిట్ మార్చ్ పోస్టర్ విడుదల చేసిన కలెక్టర్




సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 28:సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా సంగారెడ్డిలో నిర్వహించబోయే "మేరా యువభారత్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టర్ తన ఛాంబర్ లో సర్దార్ ఏ 150 యూనిటీ మార్చ్ పోస్టర్ను విడుదల చేశారు .ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడారు .దేశసమైక్యతకోసం పోరాడిన మహనీయుడు, ఉక్కుమనిషి వల్లభాయ్ పటేల్ ఆశయసాధన మనందరి లక్ష్యం అని , భారతదేశాన్ని ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ గా తీర్చిదిద్దడంలో ప్రతి పౌరుడు తన వంతు సాయం చేయాలని పిలుపునిచ్చారు. దేశం ముందు , ఆ తర్వాతే ఏదైనా అనే ఆలోచనతో యువత ముందుకు రావాలని అన్నారు. సంగారెడ్డి జిల్లా పరిధిలోని అన్ని కళాశాలల్లో ఉపన్యాసాలు, వ్యాసరచన, రంగోలి వంటి పోటీలు నిర్వహించాలని సూచించారు. ఎన్ఎస్ఎస్, ఎన్సిసి, పోలీస్, విద్య, వైద్య తదితర ప్రభుత్వ శాఖలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. అంతకుముందు సంగారెడ్డి జిల్లా యువజన సంక్షేమ శాఖ కార్యాలయములో – అక్టోబర్ 31 తేదీ నుండి నవంబర్ 25 వ తేదీ వరకు నిర్వహించబోయే సర్ధార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలపై ఉమ్మడి మెదక్ జిల్లా మేరా యువభారత్ అధికారి రంజిత్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ దేశసమైక్యతకోసం పోరాడిన మహనీయుడు, ఉక్కుమనిషి వల్లభాయ్ పటేల్ ఆశయసాధన మనందరి లక్ష్యంగా ఆయన 150వ జయంతని అధికారికంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని , ఏక్ భారత్ – ఆత్మనిర్భర్ భారత్‌సస పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబోతున్నామని అన్నారు .ఇందులో భాగంగా ఏక్తా ర్యాలీ (సర్దార్ఏ150 యూనిటీ మార్చ్ పేరుతో పాదయాత్ర ,కలిసినడుద్దాం.విజయవంతంచేద్దాం, – ఈ ఏక్తా ర్యాలీ కార్యక్రమం లో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు .నిర్వహించబోయే కార్యక్రమాలు ఈనెల 31 న సర్దార్ పటేల్ విగ్రహాలకు నివాళులు, కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా లోని ఐ. బి గెస్ట్ హౌస్ నుండి నుంచి పోతరెడ్డి చౌరస్తా, వరకు ఎక్త మార్చ్ , కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలో ఈ ఎకతా మార్చ్ నిర్వహిస్తున్నారు. – అక్టోబర్ 31 నుంచి నవంబర్ 25 వరకు ఈ ఎక్తా యాత్రలు నిర్వహించబోతున్నామని తెలిపారు . సంగారెడ్డి లో నిర్వహించబోయే మేరా యువ భారత్ ఎక్తా ర్యాలీ లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు . ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడాల అధికారి కశిం బేగ్, జిల్లా కార్యక్రమ అధికారి కిరణ్ కుమార్, ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్లు రాజు గౌడ్, పాపయ్య, నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి ఉద్యోగి నిజాయితీగా ఉండాలి

## రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



రంగారెడ్డి జిల్లా, అక్టోబర్ 28 (భారత శక్తి):
ప్రతి ఉద్యోగి నిజాయితీగా ఉండాలని, ప్రతి శాఖ ద్వారా చేపట్టే కార్యక్రమాలను ప్రజలకు ఎటువంటి లోపం లేకుండా బాధ్యతతో, అవినీతిరహితంగా, పారదర్శకంగా సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో రీజినల్ విజిలెన్స్, ఎన్ ఫోర్స్ మెంట్ వారి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్' సందర్భంగా జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అధికారులు, సిబ్బందితో 'సమగ్రత ప్రతిజ్ఞ' చేయించారు.అలాగే సెంట్రల్ విజిలెన్స్ అవర్నెస్ ఆర్గనైజేషన్ పోస్టర్స్ జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరుగుతుందని అన్నారు. ఇందులో భాగంగా విజిలెన్స్ వారోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి శాఖ ఉద్యోగి బాధ్యత విజిలెన్స్ అందరి బాధ్యత, ప్రభుత్వ ఉద్యోగులుగా సర్వీస్ లో చేరినప్పుడు కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం పని చేయాల్సి ఉంటుంది. ప్రతి శాఖ ఉద్యోగి తన శాఖ పరిధిలో చేయాల్సిన సేవలు అందించాలని అన్నారు. ప్రజలకు సేవలు పొందే హక్కు ఉందని, ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు అవినీతి లేకుండా ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా సుపరిపాలన అందించాలని అన్నారు. జిల్లా కేంద్రం నుండి గ్రామం వరకు ప్రతి ప్రభుత్వ ఉద్యోగి మంచి సేవలు అందించాలని సూచించారు. జిల్లా ప్రభుత్వ అధికారులు, కలెక్టరేట్ సిబ్బందితో విధి నిర్వహణలో నిజాయితీతో కూడిన సేవలను అందించడం, పారదర్శకతను పాటించడం, బాధ్యతాయుతంగా వ్యవహరించడం, ప్రభుత్వ సహాయం కోసం వచ్చే వారి హక్కులను కాపాడుతూ, న్యాయ సూత్రాలకు అనుగుణంగా సేవలను అందించడానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు వనజాత, హరీష్, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, జిల్లా ఆడిట్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సుశిందర్ రావు, రీజినల్ విజిలెన్స్ ఇన్ఫోర్స్మెంట్ ఆఫీసర్, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తరాది వారి ఛట్ పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, అక్టోబర్ 28 (భారత శక్తి):
కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం ఆవరణలో "ఉత్తర్ భారతి నాగరిక్ సంఘ్" ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించిన ఛట్ పూజ కార్యక్రమంలో మంగళవారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉత్తర భారతీయ సోదర సోదరీమణులు ఆచరిస్తున్న ఛట్ పూజ దేశం యొక్క సమగ్ర సాంస్కృతిక ఐక్యతకు ప్రతీక అని అన్నారు.సూర్యుని ఆరాధించే ఈ పూజలో భక్తులు నది తీరాల వద్ద ఉపవాస దీక్షలు, పండ్ల నైవేద్యాలు సమర్పించడం ద్వారా కృతజ్ఞతలు తెలిపే పవిత్ర సంస్కారం ఉందని పేర్కొన్నారు.సూర్య దేవుడు, ఉషోదయ పూజ, అష్టమి పర్వదినాల విశిష్టతను గుర్తుచేస్తూ భక్తుల ఆరోగ్యం, సుఖశాంతి, కుటుంబ సుభిక్షత, రాష్ట్ర అభ్యున్నతి కోసం ప్రార్థించారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో నివసిస్తున్న ఉత్తర భారతి ప్రజలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు కావాల్సిన సహాయాన్ని అందిస్తామని సుధీర్ రెడ్డి భరోసా ఇచ్చారు. తెలంగాణ అభివృద్ధిలో వారి పాత్ర ప్రశంసనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం మాజీ ధర్మకర్త ఛాతిరి మధుసాగర్, ఉత్తర్ భారతి నాగరిక్ సంఘ్ అధ్యక్షుడు ఎన్.కే.సింగ్, అమరదీప్ సింగ్,నంద కిషోర్ సింగ్,ఆదిత్య సింగ్, సంఘ్ పరివార్ కుటుంబ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## రాచకొండ జోన్ పరిధిలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

సైకిల్ ర్యాలీలలో ఉత్సాహంగా పాల్గొన్న పోలీసు అధికారులు

రాచకొండ, అక్టోబర్ 28 (భారత శక్తి):పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఆదేశాల మేరకు రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఎల్బీనగర్,యాదాద్రి భువనగిరి, మల్కాజిగిరి, మహేశ్వరం జోన్ల డీసీపీల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీలు నిర్వహించారు. ఈ వారం రోజుల్లో రాచకొండలో బ్లడ్ డొనేషన్ క్యాంపులు, ఎస్ఏ రైటింగ్ కాంపిటీషన్, షార్ట్ ఫిలిం కాంపిటీషన్, ఫోటోగ్రఫీ కాంపిటీషన్ నిర్వహించారు. ఈ ర్యాలీలలో పోలీసులతో పాటు ప్రజలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారికి డయల్ -100, రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలు, పోక్సో చట్టం, మరియు సీసీ కెమెరాల ఉపయోగాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అక్టోబర్ 21 నుండి ఈనెల వరకు 31 వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసులకి పది రోజులపాటు సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నారని అధికారులు తెలిపారు.అలాగే రోడ్డు భద్రత గురించి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని, హెల్మెట్ లేకుండా డ్రైవ్ చేయవద్దని, లైసెన్స్, రిజిస్ట్రేషన్ లేని వాహనాలను నడపవద్దని సూచించారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలను నడపకూడదని హెచ్చరించారు. ప్రమాదం జరిగినప్పుడు బాధితులకు ప్రథమ చికిత్స అందించడం గురించి, అలాగే గ్రామాల్లో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు.సైబర్ నేరాల గురించి ప్రజలను అప్రమత్తం చేస్తూ, ఎవరైనా మోసాలకు గురైనప్పుడు వెంటనే 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, విద్యార్థులు ఉత్సావంతంగా పాల్గొని పోలీసులకు నివాళులు అర్పించారు.

## తన్నీరు సత్యనారాయణ పార్థివదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 28 :హైదరాబాద్ కోకాపేట్ క్రిన్స్ విల్లాస్ లో మాజీ మంత్రివర్యులు హరీష్ రావు తండ్రి, తన్నీరు సత్యనారాయణ పార్థివ దేహానికి పూలు వేసి నివాళులు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అర్పించారు. ఈ సందర్భంగా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

## కామారెడ్డి పట్టణ ఎస్టీ మోర్చా కార్యవర్గ ఎన్నిక

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 28: కామారెడ్డి ఎమ్మెల్యే శ్రీ కాటిపల్లి వెంకటరమణా రెడ్డి ఆదేశాల మేరకు కామారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయంలో మంగళవారం కామారెడ్డి పట్టణ బీజేపీ ఎస్టీ మోర్చా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బీజేపీ ఎస్టీ మోర్చా పట్టణ అధ్యక్షుడు వినోద్ గా ప్రకటించడం జరిగింది.

ఉపాధ్యక్షులుగా, కె. రాములు, కె. ప్రవీణ్, కె. ప్రశాంత్, రాథోడ్ అనిల్, బి. నవీన్, ప్రధాన కార్యదర్శులుగా, కె. నవీన్, కార్యదర్శిలుగా, బి. రవి, బి. సంజు, కె. ఆనంద్, కె. రవీందర్, క్యాషియర్ గా, కె. గంగాధర్ లను నియమిస్తున్నట్టు తెలియజేశారు. పట్టణ బీజేపీ ఎస్టీ మోర్చా నూతన కార్యవర్గాన్ని పట్టణ బీజేపీ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్ శాలువాలతో సన్మానం చేయటం జరిగింది. బీజేపీ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పని చేస్తూ పార్టీ పటిష్టతకు అందరం కలిసి ముందుకు సాగాలని అన్నారు.






# 'డెకాయిట్' కొత్త రిలీజ్ డేట్ ఇదే

అడివి శేష్ హీరోగా తెరకెక్కుతున్న రొమాంటిక్ యాక్షన్ మూవీ 'డెకాయిట్' . తాజాగా కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. 2026 ఉగాదిని పురస్కరించుకుని మార్చి 19న ఈ సినిమాని విడుదల చేయనున్నారు. సంబంధిత పోస్టర్‌ను అడివి శేష్ సోషల్ మీడియాలో పంచుకుంటూ.. 'ఈసారి మామూలుగా ఉండదు. ముందుకు వెళ్లడమే తప్ప వెనక్కి చూడాల్సిన అవసరం లేదు' అని క్యాప్షన్ పెట్టారు. షానీల్ డియో దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. బాలీవుడ్ దర్శక, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆయన నటిస్తున్న తొలి తెలుగు చిత్రమిదే. విభిన్న ప్రేమకథతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో తొలుత హీరోయిన్‌గా శ్రుతిహాసన్ ఎంపికైన సంగతి తెలిసిందే. కానీ, ఆమె స్థానంలో ఇప్పుడు మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. డిసెంబరు 25న విడుదల చేయనున్నట్టు చిత్ర బృందం గతంలో వెల్లడించగా.. ఇప్పుడు వాయిదా వేసింది.



# మొన్న 'ఓజీ'.. నేడు 'కాంతార'..: ఓటీటీల కొత్త స్ట్రాటజీ..

జయాపజయాలతో సంబంధం లేకుండా నెల రోజులు తిరగక ముందే కొత్త సినిమాలన్నీ ఓటీటీలో వచ్చేస్తున్నాయి. 'ఆల్‌టైమ్ ఇండస్ట్రీ హిట్' అంటూ పోస్టర్లు పడిన కొద్దిరోజులకే 'ఓటీటీలో స్ట్రీమింగ్‌కు రెడీ' అనే ప్రకటనతో ప్రేక్షకులు సైతం ఆశ్చర్యపోతున్నారు. దీని వెనుక ఓటీటీలు కొత్త స్ట్రాటజీ అనుసరిస్తున్నాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇంతకీ అదేంటి? ఇటీవల విడుదలై బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకున్న చిత్రాలన్నీ నెల రోజుల్లోపే ఓటీటీకి వచ్చేశాయి. 'లిటిల్ హార్ట్స్' థియేటర్‌లో మంచి విజయాన్ని అందుకుంది. ముఖ్యంగా యూత్‌కు బాగా కనెక్ట్ అయింది. ఇక సోషల్‌మీడియా వేదికగా వీడియోలు, మీమ్స్‌తో ఒక ట్రెండ్ నడిచింది. 'ఓజీ' రాక, దసరా పండగ నేపథ్యంలో సినిమాను ఓటీటీకి తీసుకొచ్చేశారు. ఆ స్ట్రాటజీ ఫలించింది. తక్కువ సమయంలోనే 100 మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్‌తో రికార్డు సృష్టించింది. ఆ తర్వాత 'మిరాయ్' వంతు వచ్చింది. తేజ సజ్జా నటించిన ఈ ఫాంటసీ అడ్వెంచర్ ఫిల్మ్ కూడా నెల తిరగకుండానే ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చేసింది. దీపావళి పండగకు కుటుంబ ప్రేక్షకులను అలరించడానికంటూ దీనిని కూడా స్ట్రీమింగ్‌కు తీసుకొచ్చారు. అందుకు తగినట్లుగానే భారత్ సహా వివిధ దేశాల్లో టాప్ ట్రెండింగ్‌లో నిలిచింది.

మొన్న 'ఓజీ'.. నేడు 'కాంతార'

పవన్ కల్యాణ్ అభిమానులకు మంచి ట్రీట్ ఇచ్చిన మూవీ 'ఓజీ'. సెప్టెంబరు 25న వచ్చిన ఈ మూవీ అక్టోబరు 23న స్ట్రీమింగ్‌కు వచ్చేసింది. థియేటర్‌లో మంచి రన్‌లో ఉండగానే ఓటీటీకి తెచ్చేశారు. ఇప్పుడు 'కాంతార: చాప్టర్1'ది అదే పరిస్థితి. ఇప్పటివరకూ ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రూ.800 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. మంచి థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే మూవీగా రిషబ్‌శెట్టి దీన్ని తీర్చిదిద్దారు. రూ.1000 కోట్ల మార్కును చేరుకుంటుందని అందరూ అనుకుంటున్న తరుణంలో ఓటీటీ స్ట్రీమింగ్ తేదీని ప్రకటించారు. కర్ణాటకలో ఇప్పటికీ థియేటర్‌లో మంచి ఆక్యుపెన్సీతో నడుస్తోంది. ఈ క్రమంలో ఓటీటీ డేట్ రావడంతో థియేటర్‌కు వెళ్లి చూసే వారి సంఖ్య గణనీయంగా పడిపోనుందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఓటీటీల కొత్త స్ట్రాటజీ..

'దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకో'వాలంటారు. ప్రస్తుతం ఓటీటీల పరిస్థితి చూస్తే అలాగే ఉంది. చాలా సినిమాలు విడుదలకు ముందే డీల్స్ పూర్తి చేసుకుంటున్నాయి. అగ్ర కథానాయకుల సినిమాలకైతే భారీ మొత్తం చెల్లించి హక్కులు దక్కించుకుంటున్నాయి. దీంతో జయాపజయాలతో సంబంధం లేకుండా అగ్రిమెంట్ ప్రకారం స్ట్రీమింగ్‌కు తీసుకొచ్చేస్తున్నాయి. ఇటీవల విడుదలైన సినిమాలే అందుకు ఉదాహరణ. ఇందుకు కారణం.. విజయవంతమైన చిత్రాలకు అటు థియేటర్స్‌తో పాటు, ఇటు సోషల్‌మీడియాలోనూ మంచి బజ్ ఉంటోంది. ప్రస్తుతం ఎంత పెద్ద సినిమా అయినా నాలుగు వారాలకు మించి థియేటర్‌లో ఆడటం లేదు. హీరోల అభిమానులు, యూత్, థియేటర్‌లోనే సినిమా చూడాలనుకునేవాళ్లు మొదటి రెండు వారాల్లో చూసేస్తున్నారు. మూవీ బాగుందని టాక్ వస్తే, రెండో వారం నుంచి కుటుంబ ప్రేక్షకులు వీళ్లకు జత కలుస్తున్నారు. లార్జర్ దేన్ లైఫ్ మూవీస్‌కు తప్ప చాలా వరకూ నాలుగో వారానికి ఆక్యుపెన్సీ తగ్గిపోతోంది. సరిగ్గా అలాంటి సమయంలోనే ఓటీటీలోకి తీసుకొస్తుండటంతో థియేటర్ మూవీ చూడలేకపోయిన వాళ్లు వెంటనే ఓటీటీలో చూసేస్తున్నారు. కోట్లు పెట్టి కొన్న సినిమాకు ఆదరణ ఉండటంతో ఓటీటీలకూ కలిసొస్తోంది. ఇదే సూత్రాన్ని విజయవంతమైన చిత్రాలకూ అమలు చేస్తుండటంతో ఓటీటీల్లో వాటికి మరింత ఆదరణ లభిస్తోంది. రెండు మూడు రోజుల్లో మిలియన్ల కొద్దీ స్ట్రీమింగ్ మినిట్స్‌ను సొంతం చేసుకుంటూ టాప్ ట్రెండింగ్‌లో నిలుస్తున్నాయి

. స్ట్రీమింగ్ విషయంలో దక్షిణాది చిత్రాలు నాలుగు వారాలకే ఓటీటీకి వస్తుండగా, బాలీవుడ్ మూవీస్ మాత్రం 8 వారాల తర్వాతే ఓటీటీలో వస్తుండటం గమనార్హం.ఇటీవల విడుదలైన సినిమాల్లో 'కొత్తలోక: చాప్టర్1' ఒక్కటి మినహాయింపు. ఎలాంటి అంచనాలు లేకుండా ఆగస్టు 28న విడుదలైన ఈ మూవీ ఇప్పుడు అక్టోబరు 31న స్ట్రీమింగ్‌కు వస్తోంది. అంటే సినిమాను 8 వారాల పాటు హోల్డ్ చేశారు. మరి ఇది ముందుగానే జరిగిన అగ్రిమెంటా? లేక నిర్మాణ సంస్థ వినతి మేరకు ఆపారా? అన్నది తెలియదు కానీ, అత్యధిక వసూళ్లు సాధించిన తొలి మలయాళీ చిత్రంగా 'లోక' రికార్డు సృష్టించింది. ఎట్టకేలకు ఓటీటీలోకి వస్తోంది.

# 'మీర్జాపూర్'లోకి సోనాల్ చౌహాన్



%'లెజెండ్', 'పండగ చేస్కో', 'సైజ్ జీరో' లాంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైంది సోనాల్ చౌహాన్. తాజాగా ఆమె 'మీర్జాపూర్: ది ఫిల్మ్' చిత్రంలో భాగమైనట్లు సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించింది చిత్రబృందం. "అద్భుతమైన ఆటను మార్చే ప్రయాణంలో భాగం కావడం చాలా సంతోషంగా ఉంది. 'మీర్జాపూర్: ది ఫిల్మ్'లో చేరడానికి చాలా ఉత్సాహంగా ఉన్నాను. నన్ను మీర్జాపూర్ ప్రపంచంలోకి తీసుకువచ్చినందుకు దర్శకుడికి, నిర్మాతలకి ధన్యవాదాలు" అనే వ్యాఖ్యని జోడించింది సోనాల్. గుర్మీత్ సింగ్ దర్శకత్వంలో ఫర్హాన్ అక్తర్, రితేశ్ సిధ్వానీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్, దివ్యేందు, శ్వేతా త్రిపాఠి నటించిన మీర్జాపూర్ ఫ్రాంచైజీ మూడు సీజన్లలో చాలామంది అభిమానుల్ని సంపాదించుకుంది. దర్శకుడు గుర్మీత్ సింగ్ ఇప్పుడీ హిట్ వెబ్‌సిరీస్‌ని సినిమాగా రూపొందిస్తున్నాడు. ఈ సినిమాలో పాత తారాగణంతో పాటు కొత్తగా జితేంద్ర కుమార్, రవి కిషన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మీర్జాపూర్ ప్రాంతంలో అధికార పోరాటాలు, నేరస్థుల అండర్ వరల్డ్ కథకు కొనసాగింపుగా ఈ సినిమా తీసుకురానున్నట్లు తెలుస్తోంది. క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.

## ఆడియన్స్ అలా చేస్తే

# బాధ అనిపిస్తుంది: రష్మిక



ప్రస్తుతం రష్మిక 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమా ప్రచారంలో బిజీగా ఉన్నారు. నవంబర్ 7న ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మీడియా సమావేశాల్లో పాల్గొంటూ జోష్ పెంచుతున్నారు. తనకెంతో ఇష్టమైన 'డియర్ కామ్రేడ్' గురించి మాట్లాడారు. అలాగే విజయ్‌తో ఎంగేజ్‌మెంట్ పైనా స్పందించారు. సినిమా రిలీజ్ అయినప్పుడు కాకుండా కొన్నేళ్ల తర్వాత దాన్ని ప్రశంసిస్తే ఉపయోగం లేదని ఆమె అన్నారు. విజయ్ దేవరకొండ, ఆమె జంటగా నటించిన ప్రేమకథా చిత్రం 'డియర్ కామ్రేడ్' . భరత్ కమ్మ దర్శకుడు. 2019లో విడుదలైన ఈ చిత్రం అనుకున్న స్థాయిలో అలరించలేకపోయింది. ఈ సినిమా తమకెంతో ప్రత్యేకమని విజయ్, రష్మిక ఎన్నో సందర్భాల్లో వెల్లడించారు. తాజాగా రష్మిక దీనిపై స్పందిస్తూ.. అప్పుడు ఆదరణ దక్కలేదని.. కానీ, ఇప్పుడు యూట్యూబ్‌లో అందరూ దీని గురించే మాట్లాడుకుంటున్నారని అన్నారు.

"డియర్ కామ్రేడ్'ను థియేటర్‌లో ఆడియన్స్‌తో పాటు చూశాను. కానీ, మేం ఆశించిన ఫలితం రాలేదు. నా దృష్టిలో ఇప్పటికీ అది ఒక గొప్ప చిత్రమే. ఆ సినిమాకు సంబంధించిన టాక్ బయటకు వచ్చిన తర్వాత కూడా 'దీన్ని ప్రేక్షకుల్లోకి తీసుకువెళ్లడానికి మనం ఇంకా ప్రయత్నిద్దాం' అని చిత్ర బృందానికి చెప్పాను. కానీ, అది ఫలించలేదు. ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు ఆ సినిమా గురించి మాట్లాడుకుంటున్నారు. సోషల్ మీడియాలో, యూట్యూబ్‌లో 'డియర్ కామ్రేడ్' గురించి పోస్ట్‌లు పెడుతున్నారు. ఇది ప్రేక్షకులకు నచ్చుతుందని నేను అప్పుడు చెబితే ఎవరూ వినలేదు. ఒక సినిమా కోసం దర్శకనిర్మాతలు ఎంతో కష్టపడతారు. దానికి తగిన ఫలితం రాకపోతే నిజంగా బాధగా ఉంటుంది. ఆ సమయంలో ఆదరించకుండా రెండు, మూడేళ్ల తర్వాత దాన్ని ప్రశంసిస్తే బాధగా ఉంటుంది" అని తెలిపారు.ఎప్పుడు చెప్పాలో అప్పుడే చెబుతా: రష్మిక

తాజాగా ఓ ప్రెస్‌మీట్‌లో రష్మికను ఓ అభిమాని విజయ్‌తో నిశ్చితార్థం గురించి అడిగారు. దానికి ఆమె ఆసక్తికర సమాధానం ఇచ్చారు. 'ఎప్పుడు చెప్పాలో అప్పుడే చెబుతాను. ఈ విషయంలో మీకు ఏమనిపిస్తుందో అదే నిజం' అని అన్నారు.

## వారికంటే తక్కువ పారితోషికం...

# ఆ విషయంలో బాధపడను: ప్రియమణి



ఇండస్ట్రీలో వేతన అసమానత గురించి ఇప్పటికే పలువురు నటీనటులు ఇంటర్వ్యూల్లో వారి అభిప్రాయాన్ని తెలిపారు. తాజాగా నటి ప్రియమణి ఈ అంశం గురించి మాట్లాడారు. తన సొంతం అనుభవాల గురించి ప్రస్తావించారు. తన సహనటుల కంటే తక్కువ పారితోషికం పొందిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. కానీ, ఈ విషయం తనను బాధించదని చెప్పారు.


"నేనెప్పుడూ పారితోషికానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. మన స్టార్‌డమ్ ఆధారంగా దాన్ని అందిస్తారు. దాన్ని దృష్టిలో పెట్టుకోనే దర్శకనిర్మాతలను అడుగుతాను. నాతో పాటు నటించిన వారికంటే నేను తక్కువ రెమ్యూనరేషన్ తీసుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అయినా ఎప్పుడూ బాధ పడలేదు. నా పాత్ర నిడివి, నా నటన ఆధారంగా దాన్ని అందిస్తారని అవగాహన ఉంది. నేను అర్హురాలిని అని భావిస్తే డిమాండ్ చేస్తాను. అనవసరంగా రెమ్యూనరేషన్ పెంచాలని కోరను" అని చెప్పారు.

దక్షిణాది, ఉత్తరాదిలలో షూటింగ్ టైమింగ్స్ గురించి ప్రియమణి ప్రస్తావించారు.

"రెండు ప్రాంతాల్లో చిత్రీకరణ టైమింగ్ భిన్నంగా ఉంటుంది. సౌత్‌లో ఉదయం 8 గంటలకు షూటింగ్ ప్రారంభిస్తామని షెడ్యూల్ ఇస్తే.. కచ్చితంగా ఆ సమయానికి ప్రారంభిస్తారు. కానీ, నార్త్‌లో ఆ సమయానికి నటీనటులు ఇంటినుంచి బయల్దేరుతారు" అని ప్రియమణి తెలిపారు.

ప్రస్తుతం వరుస ప్రాజెక్ట్‌లతో ఆమె బిజీగా ఉన్నారు. ఇటీవలే 'ఆఫీసర్ ఆన్ డ్యూటీ', 'ది గుడ్ వైఫ్'లతో ప్రేక్షకులను పలకరించారు. కోలీవుడ్ అగ్ర కథానాయకుడు విజయ్ ప్రధాన పాత్రలో రానున్న 'జన నాయగన్'లో నటిస్తున్నారు. దీనితో పాటు 'ది ఫ్యామిలీ మ్యాన్' మూడో సీజన్‌లోనూ కనిపించనున్నారు.

# 'పోకిరి' అంటే ఇంకా ఇష్టం



'ఇంతకుముందు ఎప్పుడూ చేయని ఒక విభిన్నమైన పాత్రతో... తెలుగు పరిశ్రమలో తిరిగి అడుగుపెట్టడం ఎంతో ఆనందంగా ఉంది" అన్నారు శిల్పా శిరోద్కర్. తెలుగుతోపాటు, హిందీలోనూ నవంబరు 7న విడుదల కానున్న 'జటాధర' సినిమాలో ఆమె ఓ కీలక పాత్రని పోషించారు. సుధీర్‌బాబు కథానాయకుడిగా నటించిన చిత్రమిది. సోనాక్షి సిన్హా కథానాయిక. సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ కథతో... దర్శకులు వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కించారు. ఈ సినిమా విడుదలను పురస్కరించుకుని ప్రముఖ నటి శిల్పా శిరోద్కర్ సోమవారం విలేకర్లతో ముచ్చటించారు.

"తెలుగు చిత్ర పరిశ్రమ నాకు కొత్త కాదు. మూడు దశాబ్దాల కిందట 'బ్రహ్మ' సినిమాలో నటించా. ఆ చిత్రం ఘన విజయం సాధించింది. కానీ చిత్రంగా ఆ తర్వాత నాకు అవకాశాలే రాలేదు. దాంతో హిందీలోనే నా ప్రయాణం కొనసాగింది. సుదీర్ఘ విరామం తర్వాత 'జటాధర'తో అవకాశం వచ్చింది. ఇందులో నేను పోషించిన శోభ పాత్ర ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. తనకి డబ్బంటే అత్యాశ. అందుకోసం ఏం చేసిందనేది ఆసక్తికరం. శక్తిమంతమైన శోభ పాత్ర నటిగా నాకెన్నో సవాళ్లని విసిరింది. మేకప్‌కి చాలా సమయం పట్టేది. నటన పరంగానూ కొత్త విషయాల్ని నేర్పించిందీ చిత్రం. నా నట ప్రయాణానికీ ఓ కొత్త దిశని చూపిస్తుందని నమ్ముతున్నా".

"అతీంద్రియ శక్తుల నేపథ్యంతోపాటు, థ్రిల్లింగ్ ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడిన కథ. చూస్తున్నంతసేపూ ఓ కొత్త అనుభూతిని, థ్రిల్‌ని పంచింది. నాకు అతీంద్రియ శక్తులు, చేతబడులపై నమ్మకం లేదు కానీ, దేవుడిని నమ్ముతాను. దైవిక అంశాలు ఈ కథలో కీలకం. సుధీర్, నేను బంధువులమే అయినా, సెట్‌లోకి అడుగు పెట్టాక మేమంతా నటులమే. ప్రతి ఒక్కరూ ఎంతో ప్రొఫెషనల్‌గా మెలుగుతూ ఈ సినిమా చేశారు".

"తెలుగు సినిమా అత్యుత్తమ దశలో ఉంది. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందింది. ఈ దశలో ఇక్కడ నా పునః ప్రయాణం ఆరంభం కావడం మంచి పరిణామం. హైదరాబాద్ నాకు రెండో ఇల్లు లాంటిది. మా అక్క నమ్రత, బావ మహేశ్ ఇక్కడే ఉంటారు కదా. నేను తరచూ వచ్చి వెళుతుంటా. 'జటాధర' తర్వాత తెలుగులో మరిన్ని మంచి అవకాశాలు వస్తే ఆనందంగా స్వీకరిస్తా. మహేశ్ మా సినిమా ట్రైలర్‌ని విడుదల చేయడంతో నాకు తెలుగుకు ఘనంగా స్వాగతం పలికినట్టు అనిపించింది. నాకు స్వతహాగా రొమాంటిక్ కామెడీ చిత్రాలంటే ఇష్టం. మహేశ్ నటించే ప్రతి సినిమా నాకు ఇష్టమే. అందులో 'పోకిరి' అంటే ఇంకా ఇష్టం".



# అసలు శ్రేయస్‌కు ఏమైంది?

## శ్రేయస్ అయ్యర్ మళ్లీ బ్యాట్ పట్టేది అప్పుడే

ఆస్ట్రేలియాతో సిడ్నీ వేదికగా టీమ్‌ఇండియా తలపడిన మూడో వన్డేలో వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ () క్యాచ్ అందుకునే ప్రయత్నంలో తీవ్ర గాయానికి గురైన విషయం తెలిసిందే. అయితే ఈ ఘటనలో అతడి ప్లీహానికి గాయమైంది. క్యాచ్ పట్టుకునే క్రమంలో శ్రేయస్ ఎడమవైపు పక్కటెముకలు నేలను బలంగా తాకడంతో ఈ పరిస్థితి ఎదురైంది. ప్రస్తుతం సిడ్నీలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రేయస్ అయ్యర్ పరిస్థితి నిలకడగా ఉందని, వేగంగా రికవరీ అవుతున్నాడని బీసీసీఐ ) సెక్రటరీ దేవ్‌జిత్ సైకియా ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే అతడి గాయం చాలా సున్నితమైనది కావడంతో, ఇప్పుడప్పుడే మైదానంలోకి దిగే పరిస్థితి మాత్రం కనిపించడం లేదు.

అసలు ప్లీహం అంటే..

ప్లీహం అనేది పిడికిలి పరిమాణంలో ఉండే మృదువైన అవయవం. ఎడమవైపున పక్కటెముకల కింద ఉంటుంది. ఇది రెండు ప్రధాన విధులను నిర్వహిస్తుంది. ఇన్ఫెక్షన్లతో పోరాడుతుంది. అలాగే పాత లేదా దెబ్బతిన్న ఎర్ర రక్త కణాలను తొలగించి రక్తాన్ని ఫిల్టర్ చేస్తుంది. దీనిలో అనేక చిన్న చిన్న రక్త నాళాలుంటాయి. ఇది శరీరంలోని అత్యంత సున్నితమైన అవయవాల్లో ఒకటి. అందుకే ఎడమవైపున కింద పడటం, పక్కటెముకలకు గాయం తగిలినపుడు ప్లీహంలో చీలిక వస్తుంది. అయితే ఈ గాయం కొన్నిసార్లు ప్రాణాపాయానికీ దారితీస్తుంది. అది ప్లీహానికి ఎంత దెబ్బతగిలింది. ఎంత రక్తస్రావం అవుతుందన్న దాని మీద ఆధారపడి ఉంటుంది. దెబ్బతిన్న ప్లీహం పరిస్థితిని అంచనా వేయడానికి వైద్యులు సిటీ స్కాన్ మీద ఆధారపడతారు. ప్లీహానికి చిన్న గాయమైతే.. అది తనంతటతానే మరమ్మతు చేసుకుంటుంది. కానీ గాయం తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు అంతర్గత రక్తస్రావానికి దారి తీస్తుంది. అప్పుడు అత్యవసరంగా శస్త్రచికిత్స చేయాల్సిన పరిస్థితి రావొచ్చు.

అది చాలా కీలక సమయం..

ప్లీహానికి గాయమైన తర్వాత తొలి 24 నుంచి 48 గంటలు చాలా కీలకం. ఈ దశ దాటిన తర్వాత వారి ఆరోగ్యం మెరుగ్గా ఉంటే.. డాక్టర్లు వారిని కదలడానికి, ఆహారం తీసుకోవడానికి అనుమతిస్తారు. అలాగే రోజూ స్కానింగ్‌లతో ప్లీహం దగ్గర రక్తస్రావం అవడం లేదని నిర్ధరించుకుంటారు. ఒక్కసారి రక్తస్రావం నియంత్రణలోకి వస్తే గాయానికి గురైన వ్యక్తిని ఒక వారం వరకు ఆసుపత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉంచుతారు. ఆ తర్వాత డిశ్చార్జ్ చేస్తారు. అయితే వారు సాధారణ జీవితంలోకి రావడానికి మాత్రం కొన్ని నెలల సమయం పట్టొచ్చు. ప్లీహానికైన గాయం పూర్తిగా మానాలంటే 6 నుంచి 12 వారాలు పడుతుంది. ఈ సమయంలో గాయానికి గురైన వ్యక్తి చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే రికవరీ సమయంలో మరోసారి ప్లీహానికి గాయమైతే మళ్లీ అంతర్గత రక్తస్రావం జరిగే అవకాశం ఉంటుంది.

శ్రేయస్ అదృష్టవంతుడు!

శ్రేయస్ అయ్యర్ ఓ రకంగా అదృష్టవంతుడు. ఎందుకంటే గాయానికి గురైన వెంటనే అతడికి వైద్య సేవలు అందడం ఎంతో మేలు చేసింది. మంచి విషయం ఏంటంటే.. ప్లీహానికి చిన్న గాయమైతే ఇంకా తక్కువ సమయంలోనే రికవరీ అవుతారు. శ్రేయస్ శారీరకంగా ఫిట్‌గా ఉంటాడు కాబట్టి అనుకున్న సమయం కంటే త్వరగానే అతడు కోలుకునే అవకాశం ఉంది. అయితే అతడు ఇప్పుడప్పుడే క్రికెట్ మాత్రం ఆడలేడు! శ్రేయస్ మళ్లీ బ్యాట్ పట్టాలంటే దాదాపు మూడు నెలల వరకు ఆగాల్సిందే! ఈ నేపథ్యంలో శ్రేయస్ త్వరగా కోలుకుని, ఆసుపత్రి నుంచి డిశ్చార్జి కావాలని టీమ్‌ఇండియా ఆటగాళ్లు, బీసీసీఐ, అభిమానులు కోరుకుంటున్నారు.

## అభిషేక్ శర్మను ఎదుర్కొనేందుకు మేం సిద్ధంగా ఉన్నాం: మిచెల్ మార్ష్



టీమ్‌ఇండియా విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మను ఎదుర్కోవడానికి తమ జట్టు సిద్ధంగా ఉందని ఆసీస్ కెప్టెన్ మిచెల్ మార్ష్ అన్నాడు. ఆస్ట్రేలియాతో టీమ్‌ఇండియా అయిదు టీ20ల సిరీస్ ఆడనుంది. దీనిలో భాగంగా రేపు (అక్టోబర్ 29) కాన్‌బెర్రా వేదికగా మొదటి మ్యాచ్ జరగనుంది. ఈ నేపథ్యంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మార్ష్ మాట్లాడాడు. 'అభిషేక్ శర్మ అద్భుతమైన నైపుణ్యమున్న ఆటగాడు. ఐపీఎల్‌లోనూ సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున చక్కగా ఆడాడు. అతడు నిజంగా మాకో ఛాలెంజ్. కానీ మేం అతణ్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రపంచంలోని అత్యుత్తమ ఆటగాళ్లతో తలపడి మనల్ని మనం పరీక్షించుకోవాలి' అని మిచెల్ మార్ష్ అన్నాడు. అలాగే జోష్ ఇంగ్లిస్ ఈ సిరీస్‌కు అందుబాటులో ఉండే విషయమై మార్ష్ మాట్లాడాడు. అతడు ఇటీవల న్యూజిలాండ్ సిరీస్‌లో గాయం వల్ల ఆసీస్ జట్టుకు దూరమయ్యాడు. 'జోష్ ఇంగ్లిష్ ఫిట్‌నెస్ సాధించాడు. జట్టుకు అందుబాటులో ఉన్నాడు. అతడు మాకు చాలా ముఖ్యమైన ఆటగాడు. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగుతాడు' అని మార్ష్ వివరించాడు. అభిషేక్ శర్మ ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యుత్తమ టీ20 బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. అతడు 23 ఇన్నింగ్స్‌ల్లో 36.91 యావరేజ్‌తో 849 పరుగులు చేశాడు. ఇందులో రెండు శతకాలు, అయిదు అర్ధశతకాలున్నాయి. టీమ్‌ఇండియా, ఆస్ట్రేలియా ఇప్పటి వరకు 32 టీ20ల్లో తలపడింది. అందులో 20 మ్యాచుల్లో భారత జట్టు విజయం సాధించింది. ఆసీస్ జట్టు 11 మ్యాచుల్లో గెలిచింది. ఒక మ్యాచ్‌లో ఫలితం తేలలేదు.

> అలాగే జోష్ ఇంగ్లిస్ ఈ సిరీస్‌కు అందుబాటులో ఉండే విషయమై మార్ష్ మాట్లాడాడు. అతడు ఇటీవల న్యూజిలాండ్ సిరీస్‌లో గాయం వల్ల ఆసీస్ జట్టుకు దూరమయ్యాడు. 'జోష్ ఇంగ్లిష్ ఫిట్‌నెస్ సాధించాడు. జట్టుకు అందుబాటులో ఉన్నాడు. అతడు మాకు చాలా ముఖ్యమైన ఆటగాడు. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగుతాడు' అని మార్ష్ వివరించాడు.

## స్మృతి మంధాన తిరిగి ఆ పొరపాటు చేయకూడదు: టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్




: మహిళల వన్డే వరల్డ్ కప్ 2025లో ) భాగంగా టీమ్‌ఇండియా గురువారం నవీ ముంబయి వేదికగా ఆస్ట్రేలియాతో సెమీఫైనల్‌లో తలపడనుంది. అయితే ఈ టోర్నీలో ఇంతకుముందు ఆసీస్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా ఓటమి పాలైంది. ఆ మ్యాచ్‌లో ఆసీస్ కెప్టెన్ అలిస్సా హీలీ 142 పరుగులు చేసింది. ఆసీస్ జట్టు టీమ్‌ఇండియా నిర్దేశించిన 331 పరుగుల లక్ష్యాన్ని 49 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. దీంతో టీమ్‌ఇండియా మూడు వికెట్ల తేడాతో ఓటమి పాలైంది.

ఈ మ్యాచ్‌లో స్మృతి మంధాన కేవలం 66 బంతుల్లోనే 80 పరుగులు చేసింది. సెంచరీ సాధించేలా కనిపించిన ఆమె అనవసర షాట్‌కు యత్నించి తన వికెట్ కోల్పోయింది. 'ఆ మ్యాచ్‌లో స్మృతి మంధాన 80 పరుగులు చేసిన తర్వాత ఔటైంది. తాను వికెట్ కోల్పోయింది అనేకంటే.. తన వికెట్ తనే సమర్పించుకుంది అనొచ్చు. ఆమె మరోసారి అలాంటి పొరపాటును రిపీట్ చేయకూడదు' అని అంజుమ్ చోప్రా ఓ క్రీడా ఛానల్‌తో అన్నారు. 'ప్రపంచకప్‌నకు ముందు ఆ మూడు వన్డేల్లో (ఆస్ట్రేలియాతో) ఆమె ఆడిన ఇన్నింగ్స్ అందరికీ గుర్తున్నాయి. ఆ స్థానానికి చేరుకోవడానికి ఆమె చాలా కృషి చేసింది. కాబట్టి మంధాన దాన్ని కొనసాగిస్తూ.. సెమీఫైనల్‌లో రాణిస్తుందనుకుంటున్నా' అని అంజుమ్ పేర్కొన్నారు.

టీమ్‌ఇండియా మరో ఓపెనర్ ప్రతీక రావల్ బంగ్లాదేశ్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తూ గాయపడింది. దీంతో ఆమె టీమ్‌కు దూరమైంది. ఈ నేపథ్యంలో సెమీఫైనల్‌లో స్మృతి మంధాన పైన మరింత బాధ్యత పెరిగింది. వరల్డ్ కప్‌లో ఇప్పటివరకు లీగ్ దశలో మంధాన టాప్ స్కోరర్‌గా నిలిచింది. కేవలం ఏడు మ్యాచుల్లో దాదాపు 102 స్ట్రైక్ రేట్‌తో 365 పరుగులు సాధించింది. వరల్డ్ కప్ కంటే ముందు ఆమె ఆస్ట్రేలియాతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో 300 పరుగులు చేసింది. అందులో ఒక సూపర్ సెంచరీ కూడా ఉంది.

## శ్రేయస్ అయ్యర్ ఆరోగ్యం నిలకడగా ఉంది: సూర్యకుమార్ యాదవ్



సిడ్నీ వన్డేలో క్యాచ్ పట్టే క్రమంలో శ్రేయస్ అయ్యర్ తీవ్ర గాయానికి గురైన విషయం తెలిసిందే. ప్రస్తుతం అతడు సిడ్నీలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే అతడి ఆరోగ్యం గురించి టీమ్‌ఇండియా (టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అప్‌డేట్ ఇచ్చాడు. ఆసీస్‌తో రేపు (బుధవారం) టీమ్‌ఇండియా టీ20 మ్యాచ్ ఆడనుంది. ఈ నేపథ్యంలో మ్యాచ్‌కు ముందు నిర్వహించే ప్రెస్ మీట్‌లో అతడు శ్రేయస్ అయ్యర్ తాజా పరిస్థితి గురించి మాట్లాడాడు.

'శ్రేయస్ అయ్యర్ గాయపడ్డాడని తెలిసినప్పుడు నేను ఫోన్ చేశాను. అతడి దగ్గర ఫోన్ లేదని తర్వాత నాకు తెలిసింది. దీంతో నేను ఫిజియోకు కాల్ చేశాను. శ్రేయస్ అయ్యర్ పరిస్థితి నిలకడగా ఉందని అతడు వివరించాడు. మొదటి రోజే కండీషన్ ఎలా ఉందో కచ్చితంగా చెప్పలేరు. కానీ రెండు రోజులుగా నేను శ్రేయస్‌తో మాట్లాడుతున్నా. అతడు ఫోన్‌లో నాకు సమాధానం ఇస్తున్నాడు. శ్రేయస్ రిప్లై ఇస్తున్నాడంటే, అతడి ఆరోగ్యం స్థిరంగా ఉందని అర్థం. ప్రస్తుతం అతడు బాగానే ఉన్నాడు. వైద్యులు నిత్యం అతన్ని పర్యవేక్షిస్తున్నారు. అతడు మరికొన్ని రోజులు వారి పర్యవేక్షణలో ఉంటాడు. శ్రేయస్ స్పందిస్తున్నాడు కాబట్టి.. ఇది మంచి పరిణామం' అని సూర్యకుమార్ యాదవ్ అన్నాడు.

ఆసీస్ టూర్‌లో భాగంగా టీమ్‌ఇండియా అయిదు టీ20ల సిరీస్‌ను ఆడనుంది. రేపు కాన్‌బెర్రా వేదికగా మొదటి మ్యాచ్ జరగనుంది. మూడు వన్డేల సిరీస్‌ను టీమ్‌ఇండియా ఇప్పటికే 2-1 తేడాతో కోల్పోయిన విషయం తెలిసిందే.

## గ్యాప్ లేకుండా సిరీస్‌ల మీద సిరీస్‌లు.. బీసీసీఐ ఎందుకిలా చేస్తోంది?



: టీమ్‌ఇండియా క్షణం తీరిక లేకుండా వరుస మ్యాచ్‌లతో బిజీ బిజీగా మారిపోయింది. ఒక సిరీస్‌కు, మరో సిరీస్‌కు మధ్య కనీసం వారం రోజుల విరామం కూడా ఉండట్లేదు. ఆసియా కప్ ఫైనల్ ముగిసిన నాలుగు రోజులకే వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్‌లో తలపడిన భారత జట్టు.. ఇప్పుడు ఆస్ట్రేలియాలో పర్యటిస్తోంది. వన్డే సిరీస్ పూర్తయిన మూడు రోజులకే టీ20 సిరీస్ మొదలవుతోంది. వన్డేల్లో ఆడిన ఏడుగురు ఆటగాళ్లు.. టీ20 సిరీస్‌లో ఉన్నారు. అది ఎంత వైట్ బాల్ క్రికెట్ అయినా ఈ గ్యాప్ సరిపోతుందా? అనేదే ఇప్పుడు చర్చ. ఈ క్రమంలో బీసీసీఐ ప్లానింగ్, వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ ఏంటి అనేది అర్థం కావడం లేదు.

విండీస్‌తో టెస్టు సిరీస్‌లో ఆడిన 11 మంది ఆటగాళ్లు ఆసీస్‌తో వన్డే మ్యాచ్‌ల కోసం బయలుదేరారు. ఇక మూడు ఫార్మాట్‌లలో రెగ్యులర్‌గా ఆడే కొంతమంది ప్లేయర్లు నెలలతరబడి ఇంటి ముఖం చూడట్లేదు. ఇలా తీరిక లేకుండా మ్యాచ్‌లు ఆడితే ఆటగాళ్లపై పనిభారం పెరిగిపోతుంది. త్వరగా అలసిపోతారు. గాయాల బారినపడే అవకాశమూ లేకపోలేదు. శుభ్‌మన్ గిల్, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్ ఆసియా కప్‌లో 20 రోజుల వ్యవధిలో ఏడు మ్యాచ్‌లు ఆడారు. ఆ టోర్నీ ఇలా ముగిసిందో, లేదో వెంటనే కరేబియన్ టీమ్‌తో జరిగిన తొలి టెస్టులో గిల్, కుల్‌దీప్ బరిలోకి దిగారు.

విండీస్‌తో సిరీస్ ముగిసిన వెంటనే వీరు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లారు. అక్కడి వాతావరణానికి అలవాటు పడేలోపే ప్రాక్టీస్ మ్యాచ్‌లు కూడా లేకుండానే వన్డే సిరీస్ మొదలైంది. ఇప్పుడు మూడు రోజులు గ్యాప్ ఇచ్చి ఐదు టీ20ల సిరీస్ మొదలుపెడుతున్నారు. వన్డేల్లో ఆడిన శుభ్‌మన్ గిల్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, కుల్‌దీప్ యాదవ్, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ టీ20 మోడ్ ఆన్ చేసి ఇటొచ్చేస్తున్నారు. ఇలా తీరిక లేని షెడ్యూల్ వల్ల ఆటగాళ్లకు సరైన విశ్రాంతి దొరకడం కష్టమవుతోంది. ఇది వ్యక్తిగత ప్రదర్శనతోపాటు జట్టు ఫలితాలపై ప్రభావం చూపే అవకాశముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పనిభారం నిర్వహణ కొందరికేనా?

కొంతమంది ఆటగాళ్ల విషయంలో మాత్రం వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ సరిగ్గా అమలవుతోంది. ఆసియా కప్‌లో బుమ్రాకు రెండు మ్యాచ్‌ల్లో విశ్రాంతి ఇచ్చారు. ఈ పేసర్‌ను పనిభారం నిర్వహణ దృష్ట్యా ఆసీస్ వన్డే సిరీస్‌కు ఎంపిక చేయలేదు. సిరాజ్‌కు ఆసియా కప్ నుంచి రెస్ట్ ఇచ్చారు. ఆసీస్‌తో ఐదు టీ20లకు ఎంపికైన సూర్యకుమార్, అభిషేక్ శర్మ, వరుణ్ చక్రవర్తి, శివమ్ దూబె వంటి ప్లేయర్లకు నెల రోజులు విశ్రాంతి దొరికింది. మూడు ఫార్మాట్లలో రెగ్యులర్‌గా ఆడుతున్న ఆటగాళ్లలో కొంతమంది ప్లేయర్ల విషయంలో టీమ్ మేనేజ్‌మెంట్ రిస్క్ చేస్తోందనే చర్చ నడుస్తోంది. వర్క్‌లోడ్ గురించి పట్టించుకోకుండా వరుసగా మ్యాచ్‌లు ఆడుతున్న ప్లేయర్లపై మేనేజ్‌మెంట్ వెంటనే ఈ పరిస్థితిపై ఫోకస్ పెట్టి ప్రత్యామ్నాయ ఆటగాళ్లను సిద్ధం చేసుకోవాల్సిన అవసరముందనే వాదనలు వినిపిస్తున్నాయి.

అన్నట్లు గిల్‌ను వరుస సిరీస్‌లు గ్యాప్ ఇవ్వకుండా ఆడిస్తున్నారు ఇబ్బంది అవ్వదా అని ఆ మధ్య చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌ను అడిగితే.. 'కుర్రాడు కదా ఫర్వాలేదు' అన్నారు. అంటే కుర్రాళ్లతో రిస్క్ చేస్తున్నారనేగా?

రెస్ట్ లేకపోవడమే కారణమా?

ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌ను భారత్ 1-2తో చేజార్చుకుంది. ఈ సిరీస్‌లో గిల్, కేఎల్ రాహుల్ లాంటి కీలక ఆటగాళ్లు ఆశించిన మేర ప్రదర్శన చేయలేదు.

విండీస్‌తో టెస్టు మ్యాచ్‌లు ముగియగానే సరైన విశ్రాంతి లేకుండా ఆస్ట్రేలియాకు బయలుదేరడం, అక్కడి వాతావరణ పరిస్థితులకు అలవాటు పడేలోపే వన్డే సిరీస్ మొదలైంది. అప్పటివరకు భారత పిచ్‌లకు అలవాటు పడిన బ్యాటర్లు, బౌలర్లు.. ఉన్నట్టుండి మ్యాచ్ ప్రాక్టీస్ లేకుండానే బౌన్సీ పిచ్‌లపై ఆడారు. ఇది కూడా టీమ్‌ఇండియా ఆటగాళ్ల ప్రదర్శనపై ప్రభావం చూపిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

మరి రెస్ట్ లేకుండా మ్యాచ్‌లు ఆడిస్తే ప్రదర్శన పడిపోతుందని తెలిసినా మేనేజ్‌మెంట్ ఎందుకు రిస్క్ చేస్తుందో అర్థం కావడం లేదు. వచ్చే ఏడాది టీ20 ప్రపంచ కప్ ఉండటంతో ఇప్పటి నుంచే కీలక ఆటగాళ్ల విషయంలో మేనేజ్‌మెంట్ జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరముంది.

# ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం

* పీఓ, ఏపీఓ, ఓపిఓలు విధులు,బాధ్యతలపై పూర్తి అవగాహనతో పోలింగ్ విధులకు వెళ్లాలి.
* తటస్థంగా ఉంటూ పారదర్శకంగా ఎన్నిక పోలింగ్ జరిగేలా సక్రమంగా విధులు నిర్వర్తించాలి.
* పీఓ, ఏపీఓ ల రెండో విడత శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్
* శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఎన్నికల పోలీస్ పరిశీలకులు ఓం ప్రకాశ్ త్రిపాఠి, వ్యయ పరిశీలకులు సంజీవ్ కుమార్ లాల్
* ఈసీఐ మార్గదర్శకాల మేరకు ఎన్నిక పోలింగ్ జరిగేలా చూడాలి: ఎన్నికల పోలీస్ పరిశీలకులు ఓం ప్రకాశ్ త్రిపాఠి



హైదరాబాద్, అక్టోబర్ 28 (భారత శక్తి): ఎన్నికలలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులదే కీలకపాత్ర అని, తమ విధులు,బాధ్యతలపై పూర్తి అవగాహన పెంచుకుని ఉప ఎన్నిక పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ కోరారు. మంగళవారం షేక్ పేట జి. నారాయణమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు..రెండు విడతలుగా జరిగిన ఈ శిక్షణ కార్యక్రమంకు 500 మందికి అధికారులు హాజరయ్యారు.శిక్షణ కార్యక్రమానికి





హాజరైన ఎన్నికల పోలీస్ పరిశీలకులు ఓం ప్రకాశ్ త్రిపాఠి, వ్యయ పరిశీలకులు సంజీవ్ కుమార్ లాల్ లు శిక్షణ జరుగుతున్న తీరును పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ పీఓ, ఏపీఓలకు ఎన్నికల పోలింగ్ రోజు వారి విధులు,బాధ్యతలపై జీహెచ్ఎంసీ ఎన్నికల విభాగం అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ తో కలిసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ట్రైనింగ్ కోసం ఉపయోగించే బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు,వివి ప్యాట్ లతో అనుసంధాన ప్రక్రియ, మాక్ పోలింగ్, ఓటింగ్ జరిపే విధానం పై మాస్టర్ ట్రైనర్లు పీఓ, ఏపీఓ లకు ప్రత్యక్ష అవగాహన కల్పించారు. నోటాతో కలిసి 59 మంది అభ్యర్థులు బరిలో ఉన్నందున ఒక్కో పోలింగ్ కేంద్రానికి 4 బ్యాలెట్ యూనిట్లను, ఒక కంట్రోల్ యూనిట్, ఒక వివి ప్యాట్ కు అనుసంధానం జాగ్రత్తగా చేయాలన్నారు.ఈ సందర్భంగా పీఓ, ఏపీఓలు సమావేశంలో వ్యక్తం చేసిన సందేహాలను జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్, మాస్టర్ ట్రైనర్లు నివృత్తి చేశారు. పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రం లోపల, వెలుపల కార్యకలాపాల నిర్వహణ, ఎన్నికల అధికారులు చేయవలసినవి, చేయకూడని అంశాలపై పీఓ, ఏపీఓలకు జిల్లా ఎన్నికల అధికారి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ రోజు ముఖ్యమైందని, పోలింగ్ దృష్ట్యా చేయాల్సిన అన్ని అంశాలపై ఎన్నికల సంఘం రూపొందించిన హ్యాండ్‌బుక్‌ను ప్రతీ పీఓ, ఏపీఓ తప్పకుండా చదవడమే కాకుండా, అందులోని అన్ని నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు..ఎన్నికల విధులను సీరియస్ గా తీసుకోవాలనీ చెప్పారు. శిక్షణ పొందిన నాటి నుంచి పోలింగ్ ముగిసేంత వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల పీఓ, ఏపీఓగా విధులు నిర్వహించే వారికి అన్ని అంశాల పట్ల పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. సందేహాలు ఉంటే శిక్షణ కార్యక్రమంలో నివృత్తి చేసుకోవాలన్నారు.పోలింగ్ ముందు రోజు చేయాల్సిన పనులను చెక్‌లిస్టు తయారు చేసుకొని విధులు నిర్వహించాలనీ చెప్పారు. ముఖ్యంగా ప్రతి పోలింగ్ ఆఫీసర్ తీసుకోవాల్సిన మెటీరియల్, ఈవీఎంల నిర్వహణ,ఓటరు జాబితా మార్క్డ్ కాపీ,పిఓ,ఏపిఓ డైరీ,వారి విధులు,పోలింగ్ కేంద్రం బయట ప్రదర్శించాల్సిన సామాగ్రి,పోలింగ్ కేంద్రంలోకి అనుమతించే వారు,మాక్ పోల్,ఈవీఎం,వివి ప్యాట్లను ఎలా అనుసంధానం చేయాలి వంటి అన్ని విషయాలు ఒకటికి రెండుసార్లు చదివి పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని చెప్పారు. పోలింగ్ రోజు ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లాలన్నారు.ఈసీఐ మార్గదర్శకాల మేరకు ఎన్నిక పోలింగ్ జరిగేలా చూడాలి: ఎన్నికల పోలీస్ పరిశీలకులు ఓం ప్రకాశ్ త్రిపాఠి, వ్యయ పరిశీలకులు సంజీవ్ కుమార్ లాల్ మాట్లాడుతూ... కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను నిక్కచ్చిగా పాటిస్తూ ఎన్నిక పోలింగ్ సజావుగా జరిగేలా ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు పని చేయాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో శిక్షణ కార్యక్రమాల బాధ్యులు సునంద, మమత తదితరులు పాల్గొన్నారు.



# మనసున్న మైనారిటీ నాయకున్ని కోల్పోయాం...

* అనారోగ్యంతో కాలం చేసిన హాఫీజ్ పీర్ షబ్బీర్..
* షబ్బీర్ కుటుంబాన్ని పరామర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..

బడంగ్పేట్, (భారత శక్తి) : మైనారిటీల సమస్యలను పరిష్కరించేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జమాత్ ఉలెమా అధ్యక్షుడు మౌలానా హాఫీజ్ పీర్ షబ్బీర్ అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందగా.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని షహీన్‌నగర్‌లోని హాఫీజ్ పీర్ షబ్బీర్ నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు.. ఈ సందర్భంగా సీఎంతో పాటు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి కూడా వెళ్లడం జరిగింది..




# శాతవాహన సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు స్టాపేజీ

హైదరాబాద్, అక్టోబర్ 28 (భారత శక్తి): ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. విజయవాడ సికింద్రాబాద్ విజయవాడ మధ్య రెగ్యులర్‌గా సర్వీసులందిస్తోన్న శాతవాహన సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12713/12714) రైలుకు అదనపు స్టాపేజీ కల్పిస్తున్నట్లు ప్రకటించింది. అక్టోబర్ 30 నుంచి ప్రయోగాత్మకంగా ఈ రైలు (Sa tavahana SF Express) జనగామ రైల్వే స్టేషన్‌లో ఆగుతుందని తెలిపింది. విజయవాడ సికింద్రాబాద్ (12713) శాతవాహన సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఉదయం 10.14/10.15 గంటల మధ్య ఒక నిమిషం పాటు; సికింద్రాబాద్ విజయవాడ రైలు (12714) సాయంత్రం 5.19/5.20 గంటల మధ్య జనగామ రైల్వే స్టేషన్‌లో ఒక నిమిషం పాటు ఆగుతుందని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ ఓ ప్రకటనలో తెలిపారు.

# పుణ్య కార్యాలకు పరమ పవిత్ర మాసం కార్తీకం

* ప్రముఖ ప్రవచనకర్త, కార్తీకం ఆధ్యాత్మిక విశ్లేషకులు
* బ్రహ్మశ్రీ చౌడూరి నరసింహారావు



హైదరాబాద్, అక్టోబర్ 28 (భారత శక్తి): సనాతన హైందవ ధర్మంలో హిందువులకు ఈ కార్తీక మాసం అత్యంత పవిత్రమైనదని, ఈ మాసం అన్ని పుణ్యకార్యాలకు నెలువైనదని, ప్రతిరోజూ పండుగ వాతావరణం కనిపిస్తుందని, స్నానాలకు, దానాలకు, అర్చనలకు ఎంతో ప్రత్యేకమని, శరణు ఘోషలతో అయ్యప్ప స్వామి దీక్షలకు ఎంతో పవిత్ర కాలమని, తెలుగు నెలలలో ఎనిమిదవ మాసమైన కార్తీక మాసానికి సమానమైన మాసం ఏదీ లేదని ప్రముఖ ప్రవచన కర్త, ఆధ్యాత్మిక విశ్లేషకుడు బ్రహ్మశ్రీ చౌడూరి నరసింహారావు అభిప్రాయ పడ్డారు. ఈ మాసంలో దాదాపుగా అన్ని పుణ్య తిథులను తమ ప్రవచనంలో ప్రస్తావిస్తూ..చౌడూరి నరసింహా రావు చంద్రుడు పూర్ణుడై కృత్తికా నక్షత్రంతో కూడి ఉండుటచే ఆ పౌర్ణమికి కార్తీక పౌర్ణమిగా, మాసాన్ని కార్తీక మాసంగా పేర్కొనవచ్చన్నారు. ఈ కార్తీకంలో హరిహరుల దేవాలయాల్లో, అంబిక మందిరాల్లో, మఠాల్లో ఇలా అన్నిచోట్ల ఆయా దేవీ దేవతలకు అభిషేకాలు, పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. అన్ని దేవాలయాలు, మఠ మందిరాలు దీప కాంతులతో వెలుగులీనే మాసం కార్తీక మాసమని, ఈ మాసంలో చేసే వన భోజనాలకు విశేషమైన ప్రాధాన్యత ఉన్నదని, ఈ వన భోజనాలు అనే పదంలో వనం అంటే అమర కోషంలో 'మాట' అని ఉన్నదని, షడ్రసోపేతమైన భోజనాలను చేస్తూ, మంచి మాటలను వింటూ, మనసులో వైరాగ్య భావాన్ని పెంచుకుంటూ జీవించాలని చెప్పే తాత్విక చింతనతో కూడినది వన భోజనాలని, మామిడి, తులసి, ఉసిరి వృక్ష సముదాయాల్లో వనభోజనాలు నిర్వహిస్తారని, వన భోజనాల గురించి వేదవ్యాసుడు చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా ఉదాహరిస్తూ ప్రవచన కర్త కార్తీక వైశిష్ట్యాన్ని గురించి గంటన్నర పాటు సుదీర్ఘంగా ప్రసంగించారు. సభ్యులంతా వారి ప్రసంగాన్ని కరతాళ ధ్వనులతో అభినందించారు.కార్తీక మాసం సందర్భంగా తొలి కార్తీక సోమవారం నాడు వనస్థలిపురం శారదా నగర్ లోని శ్రీ పంచముఖ వీరాంజనేయ స్వామి దేవాలయ కమిటీ, వనస్థలిపురం భక్త సమాజం సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బ్రహ్మశ్రీ చౌడూరి నరసింహారావు 'కార్తీక వైశిష్ఠం' పై కీలకమైన ప్రవచనం చేశారు. ప్రవచనానికి ముందు శ్రీ పంచముఖ వీరాంజనేయ స్వామి దేవాలయం కమిటీ సభ్యులు సుబ్బారావు మరియు యజ్ఞ భగవాన్ లు ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చౌడూరి నరసింహారావును పుష్పమాలాలంకృతులను చేశారు. ప్రవచనానంతరం ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చౌడూరి నరసింహారావు దంపతులకు పుష్పమాలతో, శాలువాతో నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో జగన్నాధ రావు, కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డ్ సభ్యులు సిరిపురం అప్పారావు, తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మచార్య సుగ్గున శ్రీరాములు, విశ్వహిందూ పరిషత్ గోరక్షా విభాగం కేంద్ర కార్యకారిణి టి. యాదగిరి రావు,వనస్థలిపురం భక్త సమాజం అధ్యక్షులు, కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు సి హెచ్. వి. ఆర్. కె మూర్తి, శ్రీ పంచముఖ వీరాంజనేయ దేవాలయ అర్చకులు చిట్టా ప్రగడ రాజశేఖర్, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా వనస్థలిపురం భక్త సమాజం అధ్యక్షులు సి హెచ్ ఆర్కే మూర్తి వందన సమర్పణతో సభ ముగిసింది.

# తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితకు మంగళ హారతులతో స్వాగతం

* కార్యక్రమంలో పాల్గొన్న జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి..

హైదరాబాద్, అక్టోబర్ 28 (భారత శక్తి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత 'జాగృతి జనంబాట' కార్యక్రమంలో పాల్గొనేందుకు మహబూబ్ నగర్ జిల్లా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఉద్దండాపూర్ రిజర్వాయర్ సందర్శించడానికి వెళ్తున్న సందర్భంలో.. బెంగుళూరు హైదరాబాద్ జాతీయ రహదారి షాద్‌నగర్ వద్ద.. రంగారెడ్డి జిల్లా జాగృతి నియోజకవర్గ ఇంచార్జ్ సీమల రమేశ్ కురుమ ఆద్వర్యంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోళ శ్రీనివాస్, మైనారిటీ రాష్ట్ర అధ్యక్షుడు ముస్తఫా, రాష్ట్ర బిసి విభాగం ప్రధానకార్యధర్శి రాం కోటి, రాష్ట్ర యంబిసి అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ, అందుగుల సత్యనారాయణ, ఉదయ బాను, షాద్‌నగర్ పట్టణ అధ్యక్షుడు మహేష్, కేశంపేట్ మండల అధ్యక్షుడు వెంకటయ్య, కొత్తూరు కుమార్, మండల అధ్యక్షుడు వీరయ్య, చౌదర్ పల్లి మండల అధ్యక్షుడు అంజీ కుర, పరూక్ నగర్ మండల అధ్యక్షుడు మల్లేశ్, నరేందర్, గోపు వర్ష, జాగృతి శ్రేణులు, మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విలేఖర్లు అడిగిన ప్రశ్నలకు జవాబుగా తెలంగాణలో జరుగుతున్న జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల గెలుపు ఓటముల వల్ల ప్రజలకు ఒరిగేది ఏమిలేదన్నారు.. జాగృతి ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి ఈ యాత్రను ప్రారంభించినట్లు ఆమె తెలిపారు.



# సినీ పరిశ్రమ అండగా ఉంటే హాలీవుడ్‌ను హైదరాబాద్‌కు తీసుకువస్తాం: రేవంత్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 28 (భారత శక్తి) :ప్రపంచ చిత్ర పరిశ్రమకు హైదరాబాద్ నగరాన్ని వేదికగా నిలపడమే తన సంకల్పమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సినీ కార్మికుల సమాఖ్య ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడ పోలీస్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, ఐటీ, ఫార్మా రంగాల మాదిరిగానే సినీ పరిశ్రమకు కూడా ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. సినీ పరిశ్రమ తనకు అండగా నిలిస్తే హాలీవుడ్‌ను సైతం హైదరాబాద్‌కు తీసుకువచ్చే బాధ్యత తాను తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. హాలీవుడ్ చిత్రాల చిత్రీకరణ రామోజీ ఫిల్మ్ సిటీతో పాటు హైదరాబాద్‌లో జరిగేలా చూస్తానని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికుల కష్టాలు తనకు తెలియవనే భావన ఎవరికీ వద్దని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడుస్తున్నా సినిమా అవార్డులు ఇవ్వలేదని, అందుకే తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గద్దర్ పేరు మీద అవార్డులను ప్రవేశపెట్టామని ఆయన గుర్తు చేశారు. ఫ్యూచర్ సిటీలో సినిమా పరిశ్రమకు ప్రాధాన్యత కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. సినీ కార్మికుల పిల్లల కోసం కార్పొరేట్ స్థాయి పాఠశాలలను నిర్మించి, ఉచితంగా విద్యను అందిస్తామని ప్రకటించారు. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉచిత విద్యతో పాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం కూడా అందిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. సినీ కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వం తరఫున రూ. 10 కోట్లు డిపాజిట్ చేస్తామని ఆయన వెల్లడించారు. సినిమా టిక్కెట్ల పెంపు ద్వారా వచ్చే అదనపు ఆదాయంలో 20 శాతం కార్మికులకు ఇవ్వాలని సూచించారు. కార్మికులకు లాభాల్లో 20 శాతం వాటా ఇస్తేనే టిక్కెట్ ధరలు పెంచుకునేందుకు అనుమతిస్తామని స్పష్టం చేశారు. త్వరలోనే సినీ కార్మికులకు ఇళ్ల స్థలాలు కూడా అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## హైదరాబాద్‌లో కబ్జా నుంచి 1.27 ఎకరాల స్థలాన్ని కాపాడిన హైడ్రా

హైదరాబాద్, అక్టోబర్ 28 (భారత శక్తి) : హైదరాబాద్ నగరంలో హైడ్రా పలు ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించింది. ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల మేరకు, సంబంధిత అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలిన అనంతరం హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టారు. రంగారెడ్డి జిల్లా, సరూర్ నగర్ మండలం, కర్మన్‌ఘాట్‌లోని హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలో 1.27 ఎకరాల పార్కును కబ్జా చేశారంటూ స్థానిక అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. లే అవుట్‌లో పార్కు స్థలంగా చూపించి, ఆ తర్వాత ప్లాట్లుగా విక్రయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో విచారిణ జరిపి ఆక్రమణలను తొలగించారు. చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ఆక్రమణకు గురికాకుండా కాపాడినట్లు తెలియజేస్తూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. అదేవిధంగా, శేరిలింగంపల్లి జోన్, చందానగర్ సర్కిల్ పరిధిలోని గంగారాం కాలనీలో సుభాష్ నగర్ పేరుతో 1974లో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ లే అవుట్ వేసింది. ఇందులో 700 గజాల స్థలాన్ని ప్రజావసరాల కోసం కేటాయించారు. పేద ప్రజల కోసం ఉద్దేశించిన లే అవుట్‌లో కొందరు బడాబాబులు ఆక్రమణలకు పాల్పడ్డారు. ప్రజావసరాల కోసం కేటాయించిన స్థలాన్ని ప్లాటుగా మార్చారు. ఈ ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ అక్కడి నివాసితులు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, హైడ్రా అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

## ఢిల్లీలో కురవనున్న కృత్రిమ వర్షం!

ఢిల్లీ, అక్టోబర్ 28 (భారత శక్తి) : దేశ రాజధాని ఢిల్లీలో కృత్రిమ వర్షం కురిపించేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఢిల్లీలో తీవ్రస్థాయిలో వాయు కాలుష్యం నమోదవుతున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టారు. మంగళవారం ఢిల్లీలో వాయు నాణ్యత సూచీ 306గా నమోదైనట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు వెల్లడించింది. ఇది తీవ్రమైన కాలుష్యంగా పరిగణించబడుతోంది. ఈ నేపథ్యంలో కాలుష్యాన్ని నియంత్రించేందుకు స్థానికంగా కృత్రిమ వర్షం కురిపించేందుకు ఢిల్లీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా క్లౌడ్ సీడింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. ఐఐటీ కాన్పూర్ నుంచి బయలుదేరిన ఎయిర్ క్రాఫ్ట్ సిల్వర్ అయోడైడ్, పొటాషియం అయోడైడ్ లాంటి రసాయన ఉత్ప్రేరకాలను వివిధ ప్రాంతాల్లోని మేఘాలపై చల్లి క్లౌడ్ సీడింగ్ ప్రక్రియను పూర్తి చేసింది. ఫలితంగా మరికొన్ని గంటల్లో ఢిల్లీలో వర్షం కురిసే అవకాశం ఉంది. ఐదు క్లౌడ్ సీడింగ్ ట్రయల్స్ నిర్వహించడానికి ఢిల్లీ ప్రభుత్వం సెప్టెంబర్ 25న ఐఐటీ కాన్పూర్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం అక్టోబర్ 1 నుంచి నవంబర్ 30 మధ్య ఎప్పుడైనా ట్రయల్స్ నిర్వహించడానికి పౌర విమానయాన శాఖ డైరెక్టరేట్ జనరల్ అనుమతి ఇచ్చింది. ఈ ప్రక్రియను నిర్వహించడానికి అవసరమైన రూ. 3.21 కోట్ల బడ్జెట్‌ను ఢిల్లీ మంత్రివర్గం మే నెలలో ఆమోదించింది. అయితే ప్రతికూల వాతావరణం, రుతుపవన పరిస్థితుల కారణంగా ఈ ప్రక్రియ పలుమార్లు వాయిదాపడింది.

## తరుముకొస్తున్న 'మొంథా' తీవ్ర తుపాను.. పవన్ కల్యాణ్ తో కలిసి సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, అక్టోబర్ 28 (భారత శక్తి) : బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తీవ్ర తుపాను కోస్తాంధ్ర తీరంవైపు దూసుకొస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. తుపాను ప్రభావిత ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులను, అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా వాగులు ఆకస్మికంగా పొంగిపొర్లే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం అమరావతిలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి మొంథా తుపాను ప్రభావం, ప్రభుత్వ సన్నద్ధతపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

**తీరం దాటే ప్రాంతంపై ప్రత్యేక దృష్టి**

ప్రస్తుతం మొంథా తుపాను అత్యంత వేగంగా తీరానికి సమీపిస్తోందని, ఈ అర్ధరాత్రికి కాకినాడకు దక్షిణంగా తీరాన్ని దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇప్పటికే కాకినాడ, మచిలీపట్నం, విశాఖపట్నం సహా పలు తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు, తీవ్రమైన గాలులు వీస్తున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన చంద్రబాబు, తుపాను తీరం దాటే అవకాశం ఉన్న కాకినాడ పరిసర ప్రాంతాలకు తక్షణమే మరిన్ని ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను తరలించాలని ఆదేశించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యంత్రసామాగ్రి, కమ్యూనికేషన్ పరికరాలు, అత్యవసర బృందాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. గడచిన అనుభవాలను, ముఖ్యంగా హుద్‌హుద్ తుపాను సృష్టించిన విధ్వంసాన్ని గుర్తుచేసుకుంటూ, అప్పటి స్ఫూర్తితో కేవలం నాలుగు రోజుల్లోనే ప్రజలను గట్టెక్కించామని, అదే పట్టుదలతో ఇప్పుడు పనిచేయాలని పిలుపునిచ్చారు.

* **క్షేత్రస్థాయిలో పక్కా సమాచారం ఉండాలి**

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎంత విస్తీర్ణంలో నీరు నిలిచింది, ఏయే వాగులు పొంగే ప్రమాదం ఉందో కచ్చితమైన అంచనాలు రూపొందించాలని సీఎం ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా క్షేత్రస్థాయి నుంచి ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సోమవారం నుంచి భారీ వర్షాలు నమోదవుతున్నందున ఎర్రకాలువకు ఎగువ నుంచి ఆకస్మిక వరద ప్రవాహం వచ్చే ప్రమాదం ఉందని, ఆ ప్రాంతంలో అధికార యంత్రాంగం పూర్తి సన్నద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు.

* **డ్రోన్లతో పర్యవేక్షణ, తక్షణ పునరుద్ధరణ**

తుపాను ప్రభావంతో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 43 వేల హెక్టార్లలో పంట నీట మునిగిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా కోనసీమ, ప్రకాశం, నంద్యాల, కడప, తూర్పుగోదావరి జిల్లాల్లో పంట నష్టం ఎక్కువగా ఉందని వివరించారు. ఈ సందర్భంగా పంట నష్టం వివరాలను రైతులు నేరుగా ప్రభుత్వానికి పంపేలా వ్యవసాయ శాఖ రూపొందించిన యాప్‌లో మార్పులు చేయాలని సీఎం సూచించారు. డ్రోన్ల ద్వారా ముంపు ప్రాంతాలను, గాలుల కారణంగా కూలిపోయిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, టవర్లను గుర్తించి తక్షణమే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తుపాను ప్రభావిత జిల్లాల్లోని 1.92 కోట్ల మందికి మొబైల్ ఫోన్ల ద్వారా హెచ్చరిక సందేశాలు పంపామని, 2,703 జనరేటర్లను సిద్ధం చేశామని అధికారులు తెలిపారు. అత్యవసర కమ్యూనికేషన్ కోసం పోలీస్ శాఖ 81 టవర్లతో వైర్‌లెస్ వ్యవస్థను ఏర్పాటు చేసిందని వివరించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. తుపాను కారణంగా రోడ్లపై చెట్లు, స్తంభాలు కూలిపోయి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు... అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో తాను ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నానని, యంత్రాంగమంతా క్షేత్రస్థాయిలో ఉందని మంత్రి నారా లోకేశ్ సీఎంకు తెలిపారు. రాయలసీమలో ప్రస్తుతం వర్షాలు లేనందున కృష్ణా నది ప్రవాహాలను అక్కడి చెరువులకు మళ్లించి, ఒక్క టీఎంసీ నీటిని కూడా వృథా చేయవద్దని జలవనరుల శాఖ అధికారులకు చంద్రబాబు సూచించారు. ఈ సమీక్షలో మంత్రులు అనిత, నారాయణ, అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భారీగా తగ్గిన బంగారం ధరలు.. హైదరాబాద్‌లో రూ. 1.22 లక్షలకు దిగొచ్చిన పసిడి

హైదరాబాద్, అక్టోబర్ 28 (భారత శక్తి) : బంగారం ధరలు ఈ మధ్యకాలంలో తగ్గుముఖం పడుతున్నాయి. దీపావళి సమయంలో రికార్డు స్థాయికి చేరిన పసిడి ధర, ప్రస్తుతం దిద్దుబాటుకు గురవుతోంది. అంతర్జాతీయంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు, పసిడి పెట్టుబడుల్లో లాభాల స్వీకరణ వంటి కారణాల వల్ల పసిడితో పాటు వెండి ధరలు కూడా తగ్గుతున్నాయి. ముఖ్యంగా, అమెరికాచైనా మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందనే అంచనాలు ఈ ధరల దిద్దుబాటుకు ప్రధాన కారణంగా విశ్లేషకులు భావిస్తున్నారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య అక్టోబర్ 30న సమావేశం జరగనుంది. ఈ సమావేశం అనంతరం వాణిజ్య ఒప్పందంపై కీలక ప్రకటన వెలువడవచ్చనే అంచనాతో పసిడికి డిమాండ్ తగ్గిందని వాణిజ్య నిపుణులు భావిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర ఔన్సు 4 వేల డాలర్ల దిగువకు చేరింది. హైదరాబాద్‌లో మధ్యాహ్నం సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1.22 లక్షలుగా నమోదైంది. కిలో వెండి ధర రూ. 1.48 లక్షల వద్ద కొనసాగుతోంది. బంగారం ధర గరిష్ఠ స్థాయి నుంచి రూ.10 వేలకు పైగా తగ్గింది. ఈరోజు కిలో వెండి ధర రూ. 5 వేలకు పైగా దిగొచ్చింది.

## ఢిల్లీ ఎయిర్‌పోర్టులో బస్సు దగ్ధం.. ఎయిరిండియా విమానం పక్కనే ఘటన

ఢిల్లీ, అక్టోబర్ 28 (భారత శక్తి) : ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ మధ్యాహ్నం పెను ప్రమాదం తప్పింది. టెర్మినల్ 3 వద్ద ఎయిరిండియా విమానానికి కొన్ని మీటర్ల దూరంలో ఆగి ఉన్న ఓ బస్సులో అగ్నిప్రమాదం సంభవించింది. బస్సు పూర్తిగా మంటల్లో చిక్కుకుని దగ్ధమైంది. అయితే, ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే, టెర్మినల్ 3 వద్ద బే 32 సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ బస్సు పలు విమానయాన సంస్థలకు గ్రౌండ్ సర్వీసులు అందించే 'సాట్స్ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్' అనే థర్డ్‌పార్టీ సంస్థకు చెందినది. ప్రమాదం జరిగినప్పుడు బస్సులో ప్రయాణికులు ఎవరూ లేరు. సమాచారం అందుకున్న వెంటనే విమానాశ్రయ అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి, నిమిషాల వ్యవధిలోనే మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనపై ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయ యాజమాన్యం స్పందించింది. ఇదొక సాధారణ ఘటనేనని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని 'ఎక్స్' వేదికగా తెలిపింది. "ప్రయాణికులు, సిబ్బంది భద్రతకే మా ప్రథమ ప్రాధాన్యత. విమాన సర్వీసులన్నీ యథాతథంగా కొనసాగుతున్నాయి" అని స్పష్టం చేసింది. ప్రమాద సమయంలో బస్సులో ప్రయాణికులు గానీ, లగేజీ గానీ లేదని పోలీసులు తెలిపారు. అయితే, బస్సులో డ్రైవర్ మాత్రమే ఉన్నాడని, అతనికి ఎలాంటి గాయాలు కాలేదని పేర్కొన్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై సాట్స్ సంస్థ దర్యాప్తు ప్రారంభించిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రమాద కారణాలను తెలుసుకునేందుకు బస్సును క్షుణ్ణంగా పరిశీలించనున్నట్లు పోలీసులు తెలిపారు.

## హైవేలపై టోల్ వసూళ్ల జోరు... 9 నెలల్లోనే రూ.49 వేల కోట్ల ఆదాయం

ఢిల్లీ, అక్టోబర్ 28 (భారత శక్తి) : దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై టోల్ వసూళ్లు రికార్డు స్థాయిలో పెరుగుతున్నాయి. 2025 క్యాలెండర్ ఇయర్‌లో మొదటి తొమ్మిది నెలల్లో (జనవరి సెప్టెంబర్) టోల్ ఆదాయం ఏకంగా 16 శాతం వృద్ధితో రూ.49,193 కోట్లకు చేరింది. వాహనాల రాకపోకలు గణనీయంగా పెరగడం, నిర్ణీత కాల వ్యవధిలో టోల్ రుసుములను సవరించడమే ఈ భారీ పెరుగుదలకు ప్రధాన కారణాలని 'ఐసీఆర్ఏ అనలిటిక్స్' మంగళవారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. నివేదిక ప్రకారం ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో టోల్ చెల్లించే వాహనాల సంఖ్య కూడా 12 శాతం పెరిగి 26,864 లక్షలకు చేరుకుంది. గతేడాది మొత్తం మీద ఎలక్ట్రానిక్ టోల్ వసూళ్లు రూ.57,940 కోట్లుగా నమోదయ్యాయి. ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే 11 శాతం అధికం. వాహనాల సంఖ్య పరంగా చూస్తే, 2023లో 30,383 లక్షలుగా ఉన్న టోల్ లావాదేవీలు, 2024 నాటికి 32,515 లక్షలకు పెరిగాయి. వాహనాల సంఖ్య కంటే టోల్ ఆదాయం వేగంగా పెరగడానికి భారీ వాహనాల వాటా ఎక్కువగా ఉండటం, టోల్ ఛార్జీల పెంపు వంటి అంశాలు దోహదపడినట్లు ఐసీఆర్ఏ విశ్లేషించింది.

**పశ్చిమ, దక్షిణ భారతానిదే సింహభాగం**

దేశ మొత్తం టోల్ ఆదాయంలో పశ్చిమ, దక్షిణ భారతదేశంలోని కారిడార్ల వాటా సగానికి పైగా ఉండటం స్థిరంగా కొనసాగుతోంది. ఈ ఏడాది 9 నెలల కాలంలో మొత్తం వసూళ్లలో పశ్చిమ భారతదేశం సుమారు 30 శాతంతో అగ్రస్థానంలో ఉండగా, దక్షిణాది 25 శాతంతో రెండో స్థానంలో, ఉత్తర భారతదేశం 23 శాతంతో మూడో స్థానంలో నిలిచాయి. తూర్పు, మధ్య భారతదేశం కలిపి నాలుగో వంతు వాటాను కలిగి ఉన్నాయి. ప్రాంతాలను బట్టి మారుతున్న వాహనాల తీరు పశ్చిమ, మధ్య, తూర్పు భారతదేశంలో టోల్ చెల్లించే వాహనాల్లో 50 శాతానికి పైగా వాణిజ్య వాహనాలే (సరుకు రవాణా) ఉంటున్నాయి. ముఖ్యంగా ఒడిశా, ఏపీలోని గనులుఓడరేవుల కారిడార్లు, ఛత్తీస్‌గఢ్‌లోని ఖనిజ ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాల గుండా పారిశ్రామిక, లాజిస్టిక్స్ కార్యకలాపాలు చురుగ్గా సాగడమే ఇందుకు కారణమని ఐసీఆర్ఏ అనలిటిక్స్ నాలెడ్జ్ సర్వీసెస్ హెడ్ మధుబని సేన్‌గుప్తా వివరించారు. దీనికి భిన్నంగా, ఉత్తర, దక్షిణ భారతదేశంలో ప్రయాణికుల వాహనాలదే ఆధిపత్యం. ఇక్కడి టోల్ లావాదేవీలలో 65 నుంచి 70 శాతం కార్లు, జీపులే ఉంటున్నాయి. జనసాంద్రత ఎక్కువగా ఉన్న నగరాలు, శివారు ప్రాంతాలు, వ్యక్తిగత వాహనాల వినియోగం అధికంగా ఉండటం వల్ల ఈ ధోరణి కనిపిస్తోంది.

## వాట్సప్, ఫోన్ కాల్స్‌కు కొత్త రూల్స్ అంటూ పోస్టర్.. స్పందించిన పోలీసులు



హైదరాబాద్, అక్టోబర్ 28 (భారత శక్తి) :ఈ మధ్య జరుగుతోన్న కొన్ని ఘటనల దృష్ట్యా వాట్సప్, ఫోన్ కాల్స్‌కు సంబంధించి కొత్త నిబంధనలు అమల్లోకి రాబోతున్నాయంటూ జరుగుతోన్న ప్రచారంపై హైదరాబాద్ పోలీసులు స్పందించారు. తాము విడుదల చేసినట్లుగా జరుగుతోన్న ప్రచారాన్ని ఖండించారు. అన్ని ఫోన్ కాల్స్ రికార్డ్ చేసి సేవ్ చేస్తారని, సామాజిక మాధ్యమ ఖాతాలన్నీ పర్యవేక్షిస్తారంటూ సర్క్యులేట్ అవుతున్న నకిలీ పోస్టర్‌ను ఎవరూ నమ్మొద్దని కోరారు. ఈ మేరకు హైదరాబాద్ పోలీసులు 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ''తప్పుడు సమాచారంతో డిజిటల్ పోస్టర్ ఒకటి సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ అవుతోంది. అందులో ఉన్న సమాచారం పూర్తిగా అవాస్తవం. పోలీసులు దాన్ని విడుదల చేయలేదు. ధ్రువీకరించుకోకుండా అలాంటి కంటెంట్‌ను ఎవరూ షేర్ లేదా ఫార్వార్డ్ వంటివి చేయొద్దు. ఇలాంటి నకిలీ సమాచారం గురించి మీకు తెలిస్తే ఫిర్యాదు చేయండి''అని ప్రజలను కోరారు. ఈ ట్వీట్‌ను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ #FactCheck #FakePoster ట్యాగ్‌లతో రీట్వీట్ చేశారు.

## తెలుగు రాష్ట్రాల్లో వార్ రూమ్‌లు ఏర్పాటు చేయండి: కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

ఢిల్లీ, అక్టోబర్ 28 (భారత శక్తి) : 'మొంథా' తీవ్ర తుపాను నేపథ్యంలో సత్వర నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా ఒడిశా, తెలుగురాష్ట్రాల్లో డివిజనల్ వార్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని దక్షిణ మధ్య రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎంలను రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆదేశించారు. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు డివిజన్లలో అవసరమైన సామగ్రి, యంత్రాలు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.



దక్షిణ మధ్య రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎంలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మొంథా తుపాను దృష్ట్యా తీసుకుంటున్న చర్యలపై నివేదిక కోరారు. తీసుకోవాల్సిన మరిన్ని చర్యలపై దిశానిర్దేశం చేశారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ప్రయాణికులకు అసౌకర్యాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసర వేళల్లో సత్వరం స్పందించాలన్నారు.

# అవినీతికి శాశ్వత చిరునామా..
# బడంగ్ పేట్ మున్సిపాలిటీ..

**భాగ్యనగరానికి చేరువలో, అభివృద్ధికి అడుగుల దూరంలో అన్ని వసతులు కలిగిన ప్రాంతం బడంగ్ పేట్ మున్సిపాలిటీ.. ప్రభుత్వం కోట్లలో నిధులు కేటాయిస్తోంది.. బడంగ్ పేట్ మున్సిపాలిటీని అన్ని హంగులతో రూపుదిద్దడానికి విశ్వ ప్రయత్నం చేస్తోంది.. కానీ ఇక్కడ పేరుకుపోయిన అవినీతి అభివృద్ధిని అధఃపాతాళానికి తొక్కిపడేస్తోంది.. అద్భుతమైన ప్రాంతంగా తీర్చిదిద్దడానికి గ్రీన్ బెల్ట్ ను ఏర్పాటు చేసింది.. గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలు సాగించరాదనే నియమం పెట్టింది ప్రభుత్వం.. కానీ వీటన్నిటినీ త్రోసిరాజని అక్రమార్కులు ఆ ప్రాంతాన్ని కూడా అకక్రమిస్తూ అక్రమ నిర్మాణాలు సాగిస్తున్నారు.. అడ్డుకోవాల్సిన మున్సిపల్ అధికారులు వారికి సహకరిస్తున్నారు.. లంచాలు తీసుకుంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.. దీంతో ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతోంది.. ఇక్కడ స్థలాలు, ఇండ్లు కొనుగోలు చేసిన అమాయకులు మాత్రం ఇరుక్కునిపోతున్నారు.. భవిష్యత్తులో ఎన్నెన్నో సమస్యలను ఎదుర్కోబోతున్నారు.. పేరొందిన నిర్మాణ సంస్థలే అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు.. కబ్జాలు చేస్తున్నారు.. ఈ వ్యవహారాలు ప్రభుత్వ పెద్దలకు తెలియకుండా జరుగుతున్నాయి పొరబాటే.. అధికారులకు తెలియడం లేదంటే నమ్మశక్యం కానీ విషయమే.. మరెందుకు ఇంతటి అలసత్వం ప్రదర్శిస్తున్నారు..? కారణం ఒక్కటే అక్రమార్జన.. ధనం మూలం ఇదం జగత్.. అన్న నానుడి బడంగ్ పేట్ మున్సిపాలిటీలో రాజ్యం ఏలుతోంది.. కబ్జాలకు తోడు అక్రమ రిజిస్ట్రేషన్లు.. ప్రజా ధనం, ప్రభుత్వ ఖజానాకు చేరవలసిన పైకం పక్కదారులు పడుతోంది.. ఇకిలాగే కొనసాగితే బడంగ్ పేట్ మున్సిపాలిటీ అవినీతి కూపంలో మునిగిపోవడం ఖాయం..**

- ఎన్ని కథనాలు వెలువడినా, ఎన్ని ఫిర్యాదులున్నా మారని పరిస్థితి
- అధికారులే కాదు, స్థానిక నాయకులు సైతం అవినీతిలో మునిగిపోయారు
- అక్రమ కట్టడాలకు ఆలవాలంగా నిలుస్తున్న ప్రాంతం
- అవినీతి పరులకు కొమ్ముకాస్తున్న మున్సిపల్ అధికారులు
- అడిగితే అడ్డగోలు సమాధానాలుతలబిరుసు ప్రవర్తన
- కోట్లలో ప్రజాధనం, ప్రభుత్వ ధనం కొల్లగొడుతున్న దౌర్భాగ్యం
- అటు ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్, ఇటు హైదరాబాద్ నగరం
- అభివృద్ధికి ఎంతో అవకాశంకానీ అవినీతి ఆశనిపాతం
- గ్రీన్ బెల్ట్ ను సైతం కొల్లగొడుతున్న అక్రమార్కులు
- చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలు మటుమాయం
- ప్రత్యేక అధికారిని నియమించినా కనిపించని ఫలితం
- దొరికిన కాడికి దోచుకుంటున్న అధికారులు, స్థానిక నాయకులు
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ముఖ్యమంత్రి రేవంత్ దృష్టి పెట్టాలి
- బడంగ్ పేట్ మున్సిపాలిటీని ప్రక్షాళన చేయకుంటే న్యాయపోరాటం చేయడానికి సంసిద్ధమవుతున్న "ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ"..

**(స్పెషల్ కరస్పాండెంట్)**
**హైదరాబాద్, అక్టోబర్ 28 (భారత శక్తి) :** బడంగ్ పేట్ మున్సిపాలిటీలో నిర్విరామంగా అక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా భవన అనుమతుల విషయంలో అవినీతి ఎక్కువగా ఉంది. అధికారులకు లంచం ఇచ్చినవారికి మాత్రమే అనుమతులు ఇవ్వడం అనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి..

జీ హెచ్ ఎం సి వద్ద జనన, మరణ ధృవీకరణ పత్రాలు, ఆస్తి పన్ను క్లియరెన్సులు, వ్యాపార లైసెన్సులు లాంటి సేవల కోసం చెల్లించాల్సిన ఫీజులు లెక్క లేకుండా రూపంలోకి మారిపోతున్నాయి..

కొన్ని అవినీతి కార్యకలాపు చూద్దాం.. ఆడిట్ లో సుభాషిణి అనే ఆపరేటర్ రూ. 56 లక్షలు నిధులు జీ హెచ్ ఎం సి ఖాతా కు జమ చేయకుండా తమ వద్ద ఉంచిన విషయం బయటపడింది. అదే విధంగా రోడ్ల మరమ్మత్తులు, డ్రైనేజీలు వంటి పనులలో టెండర్ల లో అవినీతి, నాణ్యతలో తేడాలు కనిపిస్తున్నాయి.. అధికారులు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. అక్రమ భవన నిర్మాణాలు, ప్రభుత్వ భూములపై అనధికార కట్టడాలు పెరుగుతున్నాయి.

**ఇక అభివృద్ధి విషయానికి వస్తే :**
బడంగ్ పేట్ మున్సిపాలిటీ ప్రాంతంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కొంత పని జరుగుతుండగా అవినీతి కారణంగా అభివృద్ధి ఆలస్యం అవుతుంది. కొన్ని వాయిదాలు, పరిరక్షణ చర్యలు చేపట్టబడ్డాయి. ఉదాహరణకు పార్కులు, ప్రభుత్వ స్థలాల రక్షణా చర్యలు.. అవినీతిపై ప్రజా, రాజకీయ నేతల నుండి ఎన్నెన్నో విమర్శలు వస్తున్నాయి.. ఆడిట్ లో కనుగొన్న ఘటనలపై అధికారులు విచారణలు చేస్తున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటున్న స్థితిలో ఉన్నారు..

అధికారులపై ప్రజలు, రాజకీయ పార్టీలు, పౌర సంఘాలు అవినీతి నిర్మూలన కోసం టాస్క్ ఫోర్స్ ఏర్పాట్లు చేయాలని కోరుకుంటున్నారు.

ప్రస్తుత మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులు సమీక్ష సమావేశాలు నిర్వహించి అభివృద్ధి, పరిరక్షణపై దృష్టి సారిస్తున్నారు. మొత్తానికి, బడంగ్ పేట్ మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుతం అవినీతి సమస్యలు ముఖ్యమైన అడ్డంకిగా ఉన్నాయి. అవి రోడ్డు, డ్రైనేజీ, భవన అనుమతులు, పౌర సేవలలో లంచాలు, జరిమానాలు లేకుంటే పని జరగకపోవడం వంటి ముసాయిదాలుగా కనిపిస్తున్నాయి. ప్రభుత్వ పరిధిలో ఉన్నవారు అవినీతి విషయంలో కనీసం చర్యలు తీసుకుంటున్నారని, అయినప్పటికీ ఇంకా అవినీతి నిర్మూలనకు పలు సవాళ్ళు ఉన్నవి. అభివృద్ధి ప్రాజెక్టులు ఖర్చుతో కూడుకున్న పనులు ఉండగా అవినీతి కారణంగా అవి సమయానుకూలంగా, నాణ్యమయిన విధంగా పూర్తవడం లేదు.

ప్రధాన సమస్యలుగా.. అక్రమ నిర్మాణాలు/ ఎన్క్రోచ్మెంట్లు, పర్యావరణ అవశేషాలు, స్థానిక నేర ఘటనలు ఇవి స్థానిక పాలన చర్యలకు అడ్డుగా నిలుస్తున్నాయి..

బడంగ్ పేట్ మునిసిపాలిటీపై పౌరుల నుండి లెక్కలేనన్ని ఫిర్యాదులు వచ్చాయి.. కొంతమంది ప్రభుత్వ స్థలాల్లో ఎన్క్రోచ్ చేసి అనధికారంగా నిర్మాణాలు చేయటానికి సంబంధించి




హెచ్చరికలు ఉన్నాయని హైకోర్టు గమనించింది.. మునిసిపాలిటీని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. గత కొన్ని సంవత్సరాల్లో స్థానిక స్థాయిలో మునిసిపల్ అధికారులు, ప్లానింగ్/టౌన్ ప్లానింగ్ సంబంధి బాధ్యతలపై ఎన్నో పిల్ లు, కోర్ట్ పాసింగ్‌లు నమోదు కావడం ద్వారా అధికారుల నిర్లక్ష్యం/కార్యాచరణపై విమర్శలు వస్తున్నాయి.

*** పర్యావరణ, పారిశ్రామిక / సేవేజ్ సమస్యలు :**
గుర్రంగూడ రిజర్వేడ్ ఫారెస్ట్ పరిధిలో పనిచేసే కాలువల నుంచి, పక్కన ఉన్న కాలనీల నుంచి మురికి నీరు చెత్తగా పడటంతో సుమారు 90 ఎకరాల అడవి భూభాగం ప్రభావితమైందని అడ్వైస్/నోటీసులు ఇచ్చారు.. సంబంధిత పురపాలక సంస్థలు అంటే జీ.హెచ్.ఎం.సి., హెచ్.ఎం.డబ్ల్యు.ఎస్.ఎస్.బీ. లు మునిసిపాలిటీకి ఫారెస్ట్ డిపార్ట్మెంట్ నోటీసులు పంపగా, జీవవైవిధ్య నష్టాలు, అనారోగ్య సమస్యల కారణంగా లంకె పడిన పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో అధికారులు బాధ్యుల్ని గుర్తించి, తక్షణ చర్య తీసుకోవాలని చెప్పబడింది.

స్థానిక స్థాయిలో పోలీసులు, హోమ్ రెయిడ్ కార్యక్రమాల్లో గేర్ ఆపరేషన్స్ జరిగాయి.. ఉదాహరణకు రాత్రి గూఢచర్యలుగా నిర్వహిస్తున్న జూద కార్యకలాపాలపై మీర్ పేట పోలీసులు రైడ్లు చేసి పలువురు పట్టుబడిన విషయాలు కూడా వెలుగుచూశాయి.. ఈ సంఘటనలు బడంగ్ పేట్ పరిధిలో నేరక్రమాల్ని సూచిస్తాయి.. పోలీస్ ఎన్ఫోర్స్మెంట్ చర్యలు జరుగుతున్నా పరిస్థితుల్లో మార్పు రావడం లేదు..

కాగా మునిసిపాలిటీ పరంగా రోడ్డు విస్తరణ, పార్కులు, పారిశుధ్య/జలసీమ ఏర్పాటు వంటి స్థానిక అభివృద్ధి పనులు కూడా టాప్‌లైన్‌లో ఉన్నాయి.. రోడ్ల అభివృద్ధి, బస్తీలకు మంచి నీరు అందించడానికి రిజర్వాయర్/ట్యాంక్ పనులు మొదలగునవి స్థానిక మెట్రో/మునిసిపల్



ప్రణాళికల్లో ఉన్నాయి. కానీ దురదృష్టం ఏమిటంటే అవినీతి మహమ్మారి ఈ అభివృద్ధిపై ప్రభావం చూపుతోంది..

ఇక హైకోర్టు ద్వారా బడంగ్ పేట్ మునిసిపాలిటీని వెంటనే భూసంబంధిత అక్రమాలపై చర్యల్ని తీసుకోవాలని, కొన్ని స్థానాల్లో డెమోలిషన్/నీటి ప్రవాహ పునరుద్ధరణకు పోలీస్ సహాయంతో అమలు చేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలతో మునిసిపల్, ఫారెస్ట్ డిపార్ట్మెంట్, పోలీసులు కలిసి చర్యలు తీసుకోవాల్సి ఉంది.. కానీ ఇవన్నీ సక్రమంగా జరుగుతాయా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి..

రాష్ట్ర ప్రభుత్వంనియోజక ప్రణాళికల్లో 2024 నుంచి అనేక ప్రాంతీయ మునిసిపాలిటీలను జీ.హెచ్.ఎం.సి.లో విలీనం చేసే ప్రతిపాదనలు వచ్చాయి.. ఇందులో భాగంగానే బడంగ్ పేట్ కూడా భాగం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.. అదే విధంగా స్థానిక టెండర్లు, పనుల ప్రకటనలు ఆన్లైన్‌లో ఉన్నాయి.. అవి పరిశీలించడం ద్వారా ఖర్చుల స్పష్టత, ప్రాజెక్ట్ విలువలు చూస్తే అవినీతి/ పారదర్శకత అంశాలపై మరింత నిజా నిజాలు బయటపడే అవకాశం కనిపిస్తోంది..

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఉన్న వనరులు అభివృద్ధి కార్యక్రమాలు అక్రమాలు భవిష్యత్ కార్యాచరణపై ఒకసారి పరిశీలిస్తే..

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని వనరులు, అభివృద్ధి కార్యక్రమాలు, అక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై విశ్లేషిస్తే.. తాజా పరిస్థితుల్లో, ఈ నగర పాలన స్థానిక వనరులను వినియోగించి అభివృద్ధి పనులు చేపడుతూ, కొన్ని రంగాల్లో అక్రమాలు, అవినీతి ఆరోపణలు వస్తున్నాయి.

**ఈ మున్సిపాలిటీకి వస్తున్న నిధులు :**
హెచ్.ఎం.డీ.ఏ., రాష్ట్ర ప్రభుత్వ నుంచి నగర అభివృద్ధికి నిధులు వస్తున్నాయి. ప్రధానంగా రోడ్ల నిర్మాణం, చెరువు అభివృద్ధి, పార్కులు, తాగునీటి పైప్‌లైన్‌లు, డ్రైనేజ్ ప్రాజెక్టులు మొదలైన రెండు కోట్ల రూపాయలకు పైగా పనులు జరుగుతున్నాయి.. పెద్ద చెరువుల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికతో నిధులు వెచ్చిస్తున్నారు.. అపార్ట్మెంట్లు, కాలనీ ప్రాజెక్టులకు అనుమతి ఇచ్చే అధికార వ్యవస్థను మరింత పారదర్శకంగా చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది..

రోడ్ల నిర్మాణం, సుందరీకరణ పనులు, విద్యార్థుల కోసం బుక్ లైబ్రరీ, కాలనీల్లో డ్రైనేజీ పనులు, విద్యుత్ సరఫరా మెరుగుదలతో అభివృద్ధి సాగుతోంది.. అదేవిధంగా గుర్రంగూడ, మామిడిపల్లి, మల్లాపూర్ ప్రాంతాల్లో పెండింగ్ పనులపై సమీక్ష వేశారు. మరిన్ని ఫండింగ్, పని వేగం పెంపు అవసరం ఉంది.. చరిత్రలో మొట్టమొదటి సారి చెరువులను ప్రాధాన్యతగా గుర్తించి బృహత్తర అభివృద్ధి పనులు జరుగుతున్నాయి..


కానీ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ శాఖపై భారీ అవినీతి ఆరోపణలు ఉన్నాయి. సర్వే, తనిఖీ చేయకుండా, డబ్బులు తీసుకుని ప్రభుత్వం భూములపై అనుమతులు ఇస్తున్నారు. సీలింగ్ భూములు, గ్రీన్‌బెల్ట్‌లో కూడా నిర్మాణాలు అక్రమంగా అనుమతించడంపై ఫిర్యాదులు అందుతున్నాయి..

రోడ్డు ఆక్రమణలపై ఉండే ఫిర్యాదుల తరువాత, హైకోర్టు చర్యలు తీసుకునేందుకు మున్సిపల్ అధికారులకు హెచ్చరికలతో కూడిన బలమైన ఆదేశాలు ఇచ్చింది. అక్రమంగా వేసిన ప్లాట్లలో ఆపరేషన్లు, ఎన్ క్రొచ్మెంట్ పై సంప్రదింపులు కొనసాగుతున్నాయి.. కాగా గత ఏడాది నుంచీ, మున్సిపల్ సిబ్బంది అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్నారని స్థానిక ప్రజానీకం ఆరోపిస్తోంది..

**భవిష్యత్ కార్యాచరణ :**
పౌర మొబైల్ యాప్స్, డిజిటల్ అసిస్టెంట్‌ల ద్వారా అవినీతి నివారణ, ఫిర్యాదు వ్యవస్థ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.. అలాగే రానున్న రోజుల్లో మున్సిపల్ కార్పొరేషన్ ప్రధానంగా డ్రైనేజీ విస్తరణ, రోడ్డు కంగ్రీట్ పనులు, చుట్టు ప్రదర్శన కోసం గ్రీన్ ప్రాజెక్టులు చేపట్టనున్నట్లు సమాచారం కూడా అందుతోంది.. ఇక ప్రభుత్వ పర్యవేక్షణ పెరగడంతో అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకునేందుకు మున్సిపల్ అధికారులు నూతన రూల్స్, యాక్షన్ ప్లాన్ రూపకల్పన చేస్తున్నారు..

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో అభివృద్ధి అవకాశాలు కొత్త శక్తిని సంపాదించుకుంటున్నాయి. అయినప్పటికీ, అక్రమాల అడ్డంకులు, నిధుల వినియోగంలో పారదర్శిత లోపాలు పట్టణ అభివృద్ధిని నిరోధిస్తున్నాయి. భవిష్యత్‌లో పౌర సేవలకు పారదర్శిత, పనుల వేగవంతీకరణ, వనరుల సద్వినియోగం తీసుకురావడానికి ప్రపంచ స్థాయిలో పరిష్కారాలు చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది..

ఇక చివరగా.. బడంగ్ పేట్ మున్సిపాలిటీలో ఇప్పటివరకు చోటుచేసుకున్న అవినీతి కార్యకలాపాలు, మున్సిపల్ కమిషనర్, అధికారులు, ఇతర స్థానిక రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ సంస్థలు చేస్తున్న అక్రమాలు.. వీరికి సహకరిస్తున్న మున్సిపల్ అధికారుల అవినీతి కార్యకలాపాలు మొదలైన వ్యవహారాలపై సంపూర్ణంగా సరైన ఆధారాలతో వరుస కథనాలు "భారత శక్తి" తెలుగు దినపత్రిక సహకారంతో.. వెలుగులోకి తీసుకుని రానుంది "ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ"..



# పెండింగ్ ఫీజు రీయంబర్స్, స్కాలర్షిప్స్ తక్షణమే విడుదల చేయాలి

- **అక్టోబర్ 30న ఫీజుల విడుదలకై జరుగనున్న బంద్..**
- **బంద్ చేపట్టనున్న ఉన్నత, ప్రొఫెషనల్, విద్యా సంస్థలు, యూనివర్శిటీలు..**
- **ఎస్ఎఫ్ఐ బంద్ కు సంపూర్ణ మద్దతు ప్రకటించిన డివైఎఫ్ఐ..**
- **ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించిన డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎండీ.జావీద్..**

హైదరాబాద్, అక్టోబర్ 28 (భారత శక్తి) : తెలంగాణ రాష్ట్రంలో గత ఆరు సంవత్సరాలనుండి పెండింగ్ లో ఉన్న ఫీజు రీయంబర్స్ మెంట్స్, స్కాలర్ షిప్స్ విడుదల చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం కనీసం 1200 కోట్ల రూపాయలు అయినా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 30న రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, పి.జీ., ఇంజనీరింగ్, ఫార్మసి, మెడికల్, ఇతర ప్రొఫెషనల్ విద్యా సంస్థలు, యూనివర్శిటీల బంద్ కు ఎస్ఎఫ్ఐ పిలుపునిచ్చింది. ఈ బంద్ కు డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుంది. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేష్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి.జావీద్, ఆర్ ఎల్. మూర్తి హైద్రాబాద్ జిల్లా నాయకుడు రాజులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు



కోట రమేష్, అనగంటి వెంకటేష్‌లు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో గత ఆరేళ్ళ నుండి సుమారు 8 వేల కోట్ల రూపాయలకు పైగా బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పెండింగ్ బకాయిలు దశలవారీగా విడుదల చేస్తామని చెప్పి ఇప్పటి వరకు కనీసం వారు ఇచ్చిన హామీలకు కూడా నిధులు ఇవ్వలేదని అన్నారు. విద్యా సంస్థలు యాజమన్యాలు బంద్ ప్రకటించి సంవత్సరం కాలంగా పోరాడితే 12 వందల కోట్లు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం వారు ఇచ్చిన మాట తప్పిందని అన్నారు. కాలేజీల యాజమన్యాలు ఫీజులు రాలేదనే పేరుతో రీయంబర్స్ మెంట్స్, స్కాలర్ షిప్స్ ఫీజులు విద్యార్థుల నుండి బలవంతంగా వసూలు చేస్తున్నారని, ఉన్నత చదువులకు ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్స్ ఇస్తామని యాజమాన్యాలు చెబుతుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు భరోసా ఇచ్చేలా ఫీజుల చెల్లింపు కోసం గ్యారెంటీ ఇచ్చి విద్యార్థులు భవిష్యత్ నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రిగా ముఖ్యమంత్రే ఉండి కనీసం పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. తక్షణమే ప్రభుత్వం ఫీ రియంబర్స్మెంట్, పెండింగ్ ఫీ రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలని అక్టోబర్ 30న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత విద్యా సంస్థలు, ప్రొఫెషనల్ విద్యా సంస్థలు, యూనివర్శిటీ బంద్ లో యువత, విద్యార్థులు, తల్లిదండ్రులు, యాజమాన్యాలు సహకరించాలని కోరారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.